ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఉమ్మడి కృషి

- భారత్, జర్మనీల ప్రకటన

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 205 | విజయవాడ, ఆదివారం 26 ఫిబ్రవరి 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 26 February 2023 | Rs

రాష్ట్రపతితో గవర్నరు భేటీ

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్

లోపలి పేజీలో..

APPSC

గ్రూప్-2, 3 పరీక్షలకు సిపిటి తప్పనిసరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్సి) భర్తీ చేసే గ్రూప్-2, 3 పోస్టులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సిపిటి) సర్టిఫికెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇందుకు సంబంధించిన గెజిట్ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి పోలా భాస్కర్ శనివారం విడుదల చేశారు. ఈ సర్టిఫికెట్ లేకుండా గ్రూప్-2, 3 సర్వీసుల్లో నియామకానికి అవకాశం లేదంటూ అడహాక్ నిబంధనలను జారీ చేశారు. ఎపి సాంకేతిక విద్యామండలి నిర్వహించే సిపిటి పరీక్ష గానీ, యుజిసి నుంచి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నిర్వహించే పరీక్ష గానీ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన నిర్వహించే పరీక్షలో గానీ ఉత్తీర్ణత సర్టిఫికెట్ ఉండాలని పేర్కొన్నారు. లేదంటే ఎపిపిఎస్సి ఈ పరీక్షను నిర్వహిస్తుందని, 100 మార్కులకు దీనిని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. 60 నిమిషాల పాటు నిర్వహించే ఈ పరీక్షలో ఎస్సి, ఎస్టి, వికలాంగ అభ్యర్థులు 30 మార్కులు, బిసి 35, ఒసి అభ్యర్థులు 40 మార్కులు సాధించాలని వెల్లడించారు. కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలు, ఆపరేటింగ్ సిస్టమ్స్, విండోస్, ఇంటర్నెట్ తదితర అంశాల్లో పరీక్ష ఉంటుందని తెలిపారు. గ్రూప్-1 ఉద్యోగాలకు ఈ నిబంధనలు వర్తించవని పేర్కొన్నారు.

హెచ్‌సియులో

ఎస్ఎఫ్ఐ ఘనవిజయం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సియు) విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఎబివిపి కూటమిపై ఎస్ఎఫ్ఐ కూటమి విజయకేతనం ఎగురవేసింది. అన్ని స్థానాలనూ కైవసం చేసుకుని విజయదుందుభి మోగించింది. హెచ్‌సియు ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ జెండా రెపరెపలాడింది. విద్యార్థులు అంబరాన్నంటేలా సంబరాల్లో మునిగిపోయారు. డప్పులు వాయిస్తూ, నినాదాలు చేస్తూ, గెలిచిన అభ్యర్థులకు పూలదండలు వేసి వారిని ఎత్తుకుని క్యాంపస్ అంతా తిప్పుతూ గెలుపు ఆనందాన్ని పంచుకున్నారు. హెచ్‌సియు నూతన అధ్యక్షులుగా ప్రజ్వల్, ఉపాధ్యక్షులుగా పృథ్వీసాయి, ప్రధాన కార్యదర్శిగా కృప మరియజార్జ్, జాయింట్ సెక్రెటరీగా కత్తి గణేష్, కల్చరల్ సెక్రెటరీగా లిఖిత్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రెటరీగా సిహెచ్ జయరాజు, ఐసిసి జిఎస్ క్యాష్ (ఇంటిగ్రేటెడ్) షిఫా మింజ్, ఐసిసి జిఎస్ క్యాష్ (పిజి)కి హృతిక్ లక్ష్మణ్ లలన్, ఐసిసి జిఎస్ క్యాష్ (రీసెర్చ్)కు ఎస్ఎస్ సుభాషిణి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఎబివిపి కనీస పోటీ ఇవ్వలేక చతికిలపడిపోయింది. మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు ఫలితాలు వచ్చినప్పటి నుంచే ఎస్ఎఫ్ఐ కూటమి ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అన్ని రౌండ్లలోనూ ముందంజలో ఉంది. అన్ని స్థానాల్లోనూ ఎస్ఎఫ్ఐ-ఎఎస్ఎ-డిఎస్‌యు కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అధ్యక్షులుగా పోటీ చేసిన వారిలో

మిగతా 7లో

అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రజ్వల్



ప్రధాన కార్యదర్శి కృప మరియజార్జ్

ప్యాక్స్‌పై

బహుళ పంజా

బిజినెస్ సెంటర్లుగా మారుస్తామంటున్న కేంద్రం

- సొసైటీ స్థలాల్లో మల్టీపర్పస్ బిల్డింగ్‌లు నిర్మిస్తున్న రాష్ట్రం
- కొత్తవేమో... ఉన్న పిఎసిఎస్‌ల మూత

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

సహకార ఉద్యమం స్ఫూర్తితో దశాబ్దాలుగా రైతులకు సేవలందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్-ప్యాక్స్) పై కేంద్ర ప్రభుత్వం పంజా విసిరింది. రైతుల అవసరాలతో నిమిత్తం లేకుండా మల్టీపర్పస్ కేంద్రాలుగా, ఫక్తు బిజినెస్ అవుట్‌లెట్లుగా మార్చేందుకు సిద్ధమైంది. మరో వైపు కేంద్రం మాదిరి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బికె)కు అనుసంధానంగా బహుళ ప్రయోజన సదుపాయ కేంద్రాల (మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్-ఎంపిఎఫ్‌సి)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ఈ ఎంపిఎఫ్‌సి ఆలోచన కేంద్ర బుర్రలో పుట్టిందేనని అర్థమవుతోంది. ప్యాక్స్‌ను మల్టీపర్పస్ సెంటర్లుగా తీర్చిదిద్దే కాన్సెప్టుతో దేశ వ్యాప్తంగా కొత్తగా రెండు లక్షల వ్యవసాయ, డెయిరీ, మత్స్య సహకార పరపతి సంఘాలను నెలకొల్పుతామని మొన్నటి బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ప్రముఖంగా ప్రకటించింది. వెనువెంటనే కేబినెట్ ఆమోదముద్ర వేసింది. కాగా రెండేళ్లుగా రాష్ట్ర సర్కారు ఎంపిఎఫ్‌సి కార్యాచరణ చేపట్టగా, కేంద్రం ఏర్పాటు చేస్తామంటున్న సహకార సంఘాలు అదే తరహాలో ఉన్నాయి. అటు కేంద్రం ఇటు రాష్ట్రం రెండూ ఇప్పటికే ఉనికిలో ఉన్న ప్యాక్స్‌పై దాడికి సిద్ధమయ్యాయి. ఆర్థికంగా బలహీనంగా ఉన్న పిఎసిఎస్‌లను మూసేయడం, ఉన్న వాటిలో, కొత్తగా నెలకొల్పే వాటిలో రైతుల అవసరాలతో నిమిత్తం లేకుండా లాభదాయక వ్యాపారాలను ప్రోత్సహించడంతో పాటు రైతుల నుంచి యూజర్ ఛార్జీల వసూళ్ల వంటి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

కేంద్రం కబ్జా

రాజ్యాంగపరంగా 'సహకారం' పూర్తిగా రాష్ట్రాల పరిధిలోని అంశం కాగా మోడీ సర్కారు కేంద్రం చెంత సహకార శాఖను నెలకొల్పింది. నిరుడు బడ్జెట్‌లో ప్యాక్స్ డిజిటలైజేషన్‌కు నిధులు కేటాయించారు. వచ్చే బడ్జెట్‌లో సుమారు రూ.2,500 కోట్లు ప్రతిపాదించారు. ఇప్పటి వరకు ప్యాక్స్ రైతులకు వ్యవసాయ సంబంధ రుణాలివ్వడానికి, నాణ్యమైన ఉత్పాదకాలను తక్కువ ధరపై అందించడానికి, పంటల కొనుగోళ్లకు... ఇలా రైతుల అవసరాలకే పని చేశాయి. ఇక నుంచి లాభాల కోసం 25 రకాల వ్యాపారాలు చేసేలా సొసైటీలను తీర్చిదిద్దుతామంటున్నారు. అందుకు కేంద్రం మోడల్ బైలాస్‌ను సైతం రూపొందించింది. అవి అమల్లోకొస్తే రైతులే కాదు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులూ సొసైటీల్లో సభ్యత్వం పొందే వీలుంటుంది. కార్పొరేట్ సంస్థల ఉత్పత్తులు నేరుగా ప్యాక్స్‌లో అమ్ముకునే అవకాశం ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు ప్యాక్స్ లేని గ్రామ పంచాయతీల్లో కేంద్రం కొత్తగా ప్యాక్స్ స్థాపిస్తామంటోంది. ఆర్థికంగా లేవలేని స్థితిలో ఉన్న వాటిని రద్దు చేస్తామంటోంది. రాష్ట్రంలో దాదాపు 2 వేల పిఎసిఎస్‌లు ఉండగా సగం నష్టాల్లో మునిగాయని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అధ్యయన సంస్థ 'నాక్బాబ్' నివేదిక ఇచ్చింది. కేంద్ర నిర్ణయంతో ఆ సంఘాల మనుగడ ప్రశ్నార్థకమైంది.

సెంటర్‌కు నకలు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వారి గ్రామాల్లో అన్ని సేవలూ ఒకే చోట అందించేందుకు ఆర్‌బికెలను నెలకొల్పింది. వాటికి అనుసంధానంగా గోదాములు, శీతల గిడ్డంగులు, డ్రయ్యర్ యార్డులు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, యంత్ర పరికరాల కోసం ఎంపిఎఫ్‌సిల నిర్మాణం చేపట్టింది. ఎకరం వరకు భూమి సేకరించాలనుకుంది. సాధ్యం కాకపోవడంతో ప్యాక్స్ స్థలాలను సేకరిస్తోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల స్థలాలనూ వినియోగిస్తోంది. కరోనా సమయంలో కేంద్రం ప్రకటించిన 'ఆత్మనిర్భర్ భారత్' ప్రాజెక్టులోని అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ను వాడుకుంటోంది. నాబార్డ్, ఆప్కాబ్, ఎన్‌సిడిసి, ఐసిడిఎస్ నిధులతో దశలవారీగా ప్యాక్స్ స్థలాల్లో ఎంపిఎఫ్‌సిలను నిర్మిస్తోంది. తొలిదశలో రూ.2 వేల కోట్ల వ్యయం అవుతుండగా, చాలా మట్టుకు రుణమే. నిర్మించే భవనాల్లో రైతుల పంట నిల్వలతోపాటు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, యంత్ర పరికరాలను స్టోర్ చేస్తారు. భవిష్యత్తులో ఎంపిఎఫ్‌సిలను వినియోగించుకోవాలంటే ప్యాక్స్‌లోని సభ్య రైతుల నుంచి యూజర్ ఛార్జీలు వసూలు చేసే ఆలోచన చేస్తున్నారు. ఆ విధంగా లోన్ రీపేమెంట్ చేయాలనుకుంటున్నారు. అందుకోసం చట్టాల్లో మార్పులు చేసేందుకు కసరత్తు జరుగుతోంది.

ఎన్నికల కోడ్‌ను రాష్ట్ర ప్రభుత్వమే దుర్వినియోగం చేస్తోంది

- సిఇఓకు సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వమే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి, అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి, అధికారాన్ని ఉపయోగించి బెదిరించడానికి పూనుకుంటోందని సిపిఎం రాష్ట్ర కమిటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖను మీడియాకు విడుదల చేశారు. దీంతోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను ఎలా మానిటరింగ్ చేయాలి, వారిని నిరంతరం ఫాలో ఎలా అవ్వాలి అనే అంశాలతో అధికార వైసిపి స్థానిక నాయకత్వానికి రాసిన లేఖను కూడా జత చేశారు.

ఒక్కో పోలింగ్‌బూత్‌కు 10 మంది చొప్పున పాయింట్ ఆఫ్ కాంటాక్ట్స్ (పి.ఒ.సి.)గా స్థానిక వైసిపి నాయకులను పనిచేయడానికి నియమిస్తున్నారని తెలిపారు. వీరితో మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశమవుతున్నారని, పి.ఒ.సి కేంద్రంగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో కుమ్మక్కై, ప్రైవేటు టీచర్లను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. పరిశ్రమలు, కంపెనీలను సందర్శించి యాజమాన్యంతో కలిసి ఓటర్లను ప్రలోభపెట్టడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. రవాణా, లాజిస్టిక్స్, ఫలహారాలు అని చెప్పి ఓటర్లకు గాలం వేయడానికి 'కోడ్' భాషను ఉపయోగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇది పూర్తిగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన అధికారాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. దీన్ని నివారించేందుకు ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి 24, 25 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం "సిటిజన్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్" నిర్వహించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందని పేర్కొన్నారు. దీనిపై గతంలోనే లేఖ రాశామని, ఇంతవరకూ ఏ చర్యలు తీసుకున్నదీ తెలియలేదని లేఖలో గుర్తు చేశారు. శనివారం మంత్రులు, ఎమ్మెల్యేలు పిఒసిల పేరుతో అధికార దుర్వినియోగానికి పూనుకుంటున్నారని, ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని పోలింగ్ ముగింపు వరకు ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా తగుచర్యలు తీసుకోవాలనీ కోరారు.

'ఇన్నింగ్స్' ముగిస్తున్నా...!

- ప్లీనరీలో సోనియా వ్యాఖ్య
- రాజకీయాలకు గుడ్‌బై అంటూ కలకలం
- అర్థం వేరే అంటున్న కాంగ్రెస్ నేతలు

న్యూఢిల్లీ: 'కాంగ్రెస్ పార్టీకి భారత్ జోడో యాత్ర ఒక టర్నింగ పాయింట్. ఈ సమయంలో నా ఇన్నింగ్స్ ముగించడం ఎంతో ఆనందంగా ఉంది.' అంటూ సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఆమె రాజకీయాలకు గుడ్‌బై చెప్పారంటూ విశ్లేషణలు వెలువడ్డాయి. దీంతో రంగంలోకి దిగిన పలువురు కాంగ్రెస్ నేతలు ఆ మాటల అర్థం వేరు అని వివరించార. రాయ్ పూర్ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశంలో శనివారం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో సోనియాగాంధీ మాట్లాడుతూ పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగానే ఆమె రాజకీయాలకు గుడ్‌బై చెబుతున్నారన్న అర్థం వచ్చేలా మాట్లాడారు.

'1998లో తొలిసారిగా పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే అవకాశం వచ్చింది. అప్పటి నుండి పార్టీ ఎన్నో విజయాలను సాధించింది. క్లిష్ట పరిస్థితులనూ ఎదుర్కుంది. 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం. యుపిఎ నేతృత్వంలో సాగిన ఆ పాలన వ్యక్తిగతంగా నాకు ఎంతగానో సంతృప్తినిచ్చింది. ఆ తరువాత భారత్ జోడో యాత్ర కూడా ఎంతో సంతృప్తినిచ్చింది. ఇది కాంగ్రెస్ పార్టీకి కీలకమైన టర్నింగ్ పాయింట్. ఈ సమయంలో నా ఇన్నింగ్స్ ముగించడం ఎంతో ఆనందంగా ఉంది.'

అని అన్నారు. సోనియాగాంధీ నుండి ఈ వ్యాఖ్యలు వెలువడిన వెంటనే మీడియాలో రకరకాల విశ్లేషణలు వెలువడ్డాయి. దీంతో పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు రంగంలోకి దిగారు. సోనియాగాంధీ రాజకీయాలకు గుడ్‌బై చెప్పలేదని, అధ్యక్ష పదవి నుండి తప్పుకున్నారని, అదే విషయాన్ని వివరించారని అన్నారు. ఎఐసిసి ఛత్తీస్‌గఢ్ ఇన్‌ఛార్జి సెల్జా మాట్లాడుతూ 'సోనియాగాంధీ అధ్యక్ష పదవి నుండి తప్పుకోవడం సంతోషంగా ఉంది అన్న విషయాన్నే వివరించారు. దాని అర్థం ప్రత్యక్ష రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్లు కాదు' అని చెప్పారు. అంతకుమందు సోనియాగాంధీ మాట్లాడుతూ భారత ప్రజలు సామరస్యం, సహనం మరియు సమానత్వాన్ని కోరుకుంటున్నారని యాత్ర నిరూపించిందని అన్నారు. ప్రజలకు, పార్టీకి మధ్య ఈ యాత్ర సంబంధాలను పునరుద్ధరించిందని ఆమె చెప్పారు. కాంగ్రెస్ ప్రజలతో నిలబడి, వారి కోసం పోరాడటానికి సిద్ధంగా ఉందని ఈ యాత్ర స్పష్టం చేసిందని అన్నారు. జోడో యాత్ర కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు ముఖ్యంగా రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సమయం దేశానికి, కాంగ్రెస్ కు చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. బిజెపి - ఆర్‌ఎస్‌ఎస్ పాలన ప్రజాస్వామ్యానికి ప్రమాదరకంగా మారిందన్నారు. కొంతమంది ఆర్థికవేత్తలకు అనుకూలంగా ఉండటం ద్వారా ఆర్థిక నాశనానికి కారణం అయ్యారని ఆరోపించారు. తోటి భారతీయులపై విద్వేష మంటలు వ్యాపింప చేస్తున్నారని చెప్పారుమైనారిటీలు, దళితులు, ఆదివాసీలు, మహిళలకు వ్యతిరేకంగా బిజెపి పనిచేస్తోందని, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తోందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని.. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, న్యాయం కోసం పోరాడతామని అన్నారు.

50 వేలు దాటిన భూకంప మరణాలు

- టర్కీలో మళ్లీ ప్రకంపనలు

అంకారా : టర్కీ, సిరియా భూకంపంలో మరణించిన వారి సంఖ్య 50 వేలు దాటింది. భూకంపాల వల్ల నష్టపోయిన 15 లక్షల ప్రజల కోసం కొత్త గహాల నిర్మాణ పనులు ప్రారంభించిన శనివారమే టర్కీని మరోసారి భూకంపం వణికించింది. సెంట్రల్ టర్కిష్ ప్రావిన్స్ నిగ్డేలో 5.3 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు టర్కీ ప్రభుత్వం తెలిపింది. ఫిబ్రవరి 6న వచ్చిన భూకంపాల వల్ల ఐదు లక్షల అపార్ట్‌మెంట్లు కలిగిన లక్షా 60 వేలకుపైగా భవనాలు కూలిపోయాయి. భూకంపం వల్ల టర్కీలో 44,218 మంది, సిరియాలో 5,914 మంది మరణించారు. కొన్ని నెలల్లో టర్కీలో ఎన్నికలు రాబోతున్నాయి. 15 బిలియన్ డాలర్ల వ్యయంతో రెండు లక్షల అపార్ట్‌మెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 70 వేల ఇళ్లు నిర్మించాలని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఇప్పటికే టర్కీ అధ్యక్షుడు తయ్యప్ ఎర్డోగాన్ ప్రకటించారు. ఈ నిర్మాణ ప్రణాళికలకు వరసగా వస్తున్న భూకంపాలు, భూప్రకంపనలు అడ్డుగా నిలుస్తున్నాయి. ఫిబ్రవరి 6న భారీ భూకంపాలు వచ్చిన తర్వాత ఇప్పటి వరకు వెయ్యికిపైగా ప్రకంపనలు టర్కీలో చోటు చేసుకున్నాయి. ఈ విపత్తులో అన్నీ కోల్పోయిన ప్రజలు ప్రస్తుతం గుడారాల్లో కాలం వెల్లదీస్తున్నారు.

కదిరిలో ఉద్రిక్తత

- దుకాణాల తొలగింపులో సిఐ అత్యుత్సాహం
- టిడిపి మహిళా నేతలపై దురుసుపురాంరం
- మీసం మెలేసి... తొడగొట్టిన సిఐ
- టిడిపి, వైసిపి పోటాపోటీగా నిరసనలు

లోపలి పేజీలో..

కిరాతకంగా స్నేహితుడి హత్య

- అమ్మాయి కోసం బిటెక్ విద్యార్థి ఘాతుకం

ఎదురుకాల్పుల్లో మృతి చెందిన పోలీసులు

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- ముగ్గురు పోలీసులు మృతి
- 8 మంది మావోయిస్టులు మరణించారంటున్న అధికారులు

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో మావోయిస్టులకు, పోలీసులకు మధ్య శనివారం పెద్దఎత్తున ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ సంఘటనలో ముగ్గురు పోలీసులు మృతి చెందారు. వారి మృత దేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఎనిమిది మంది మావోయిస్టులు కూడా మరణించినట్లు పోలీస్ అధికారులు చెబుతున్నారు. అయితే, శనివారం రాత్రి పొద్దుపోయేంతవరకు ఒక్క మావోయిస్టు మృతదేహం కూడా సంఘటన స్థలంలో లభించలేదు. మృత దేహాలను మావోయిస్టులు తమతో అడవిలోకి తీసుకువెళ్లారని, మరణించిన వారిలో ఒక మావోయిస్టు అగ్రనేత కూడా ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. బస్తర్ ఐజి సుందర్‌రాజ్ ఈ విషయం స్వయంగా చెప్పినట్లు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. మీడియాతో మాట్లాడుతూ హిందీలో ఆయన చెప్పిన వివరాల ప్రకారం సుక్మా జిల్లా జేగురుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా, కుందేడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇరుగ్రూపుల మధ్య హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. మూడు గంటలసేపు తీవ్ర స్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఎఎస్ఐ రామురామ్‌నాగ్, అసిస్టెంట్ కానిస్టేబుల్ కుంజం జోగా, కానిస్టేబుల్ వంజం భీమా మృతి చెందారు. ఈ ఘటనలో ఎనిమిది మంది మావోయిస్టులు కూడా చనిపోయారని ఆయన చెప్పారు. వారిలో ఓ అగ్రనేత కూడా ఉన్నారన్నారు. మావోయిస్టుల మృతదేహాలను వారి సహచరులు అడవిలోకి మోసుకుపోయారని, వారి కోసం భద్రతా బలగాలు గాలిస్తున్నాయని ఆయన తెలిపారు.

పేదల భూములను తిరిగివ్వకుంటే...

దశల వారీ పోరాటం ఉధృతం

- 15లోగా బాధితులకు న్యాయం చేయాలి
- అసైన్డ్ భూముల పరిరక్షణ సదస్సులో పి మధు

సదస్సులో మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు

ప్రజాశక్తి- చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పేదల వద్ద లాక్కున్న అసైన్డ్ భూములను పట్టాలతో సహా ప్రభుత్వం తిరిగి ఇవ్వాలని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు డిమాండ్ చేశారు. లేదంటే దశల వారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి, మంత్రి విడదల రజిని వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన అసైన్డ్ రైతులతో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని గ్రాండ్ వెంకటేష్ కల్యాణ మండపంలో అసైన్డ్ భూముల పరిరక్షణ సదస్సు శనివారం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, అసైన్డ్ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడవల్లి, మురికిపూడి, నాదెండ్ల, ఎండుగుంపాలెం తదితర 13 గ్రామాలకు చెందిన బాధిత రైతులు హాజరయ్యారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన పి.మధు మాట్లాడుతూ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పేదలకు పంపిణీ చేసిన భూములను ఆయన కుమారుడు, ప్రస్తుత సిఎం జగన్మోహన్‌రెడ్డి లాక్కుంటున్నారని విమర్శించారు. పేదలకు యడవల్లి, మురికిపూడి గ్రామాల్లో ఇచ్చిన అసైన్డ్ భూముల్లో గ్రానైట్ ఉండడంతో ఈ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. ఈ భూముల్లో కొన్నింటిని మైనింగ్ కోసం వైసిపి నాయకులకు కట్టబెట్టిందని, మరికొన్ని భూములను వైసిపి నాయకులు ఆక్రమించుకున్నారని విమర్శించారు. బాధిత రైతుల వివరాలను మంత్రి రజినీకి ఇస్తామని, మార్చి 15లోగా సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తొలుత ప్రతి గ్రామంలో ర్యాలీలు, మార్చి నెలాఖరులో చిలకలూరిపేటలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని, విద్యుత్తు ఛార్జీలను పెంచుతోందని అన్నారు. వీటిపై తన వైఖరేమిటో సిఎం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ పేదలకు

మిగతా 7లో

ఎండియు ఆపరేటర్లకు రూ.10 వేలు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండియు) ఆపరేటర్లకు బీమా ప్రీమియం ఈ ఏడాది నుంచి చెల్లించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండియు ఆపరేటర్ల విజ్ఞప్తిని సిఎం దృష్టికి తీసుకెళ్లి ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రీమియం చెల్లింపును వాహనమిత్ర పథకం కిందకు చేర్చి 2021 నుంచి అమలు చేయాల్సిందిగా సిఎం ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఏడాది జులైలో సొంతంగా ఆటో, ట్యాక్సీలు నిర్వహించుకునే వారికి చెల్లించే వాహనమిత్ర పథకంతో ఎండియు ఆపరేటర్లకు ప్రీమియం రూ.9 కోట్లను ప్రభుత్వమే చెల్లించనుందని మంత్రి తెలిపారు.

ఆరోగ్యమిత్రల జీవితాల్లో వెలుగులు నింపాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల జీవితాల్లో వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్యమిత్రలకు న్యాయం చేస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీలో 15 ఏళ్ల నుంచి వీరు పనిచేస్తున్నారని, అయినా ఎటువంటి క్యాడర్ లేదని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వారికి రావాల్సిన కేటగిరి-1 ఇవ్వాలని పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామని వివరించారు. 11వ పిఆర్‌సిలో నష్టపోయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 30 శాతం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో సీనియార్టీ గుర్తించి ఆ ప్రకారం కేటగిరి-1 ఇవ్వాలని, ప్రతి ఏడాదీ ఒక ఇంక్రిమెంటు ఇవ్వాలని కోరారు. సాధారణ, సిక్కు లీవులు మంజూరు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యమిత్రల జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం

- నాసిరకం విత్తనాలే కారణం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్ (ఏలూరు జిల్లా)

నాసిరకం విత్తనాల వల్ల పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన ఓ కౌలు రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఏలూరు జిల్లా నూజివీడు మండలంలోని పోనసానిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల వెంకట్రావు (26) ముసునూరు మండలం చింతలవల్లి గ్రామంలో ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సీడు మొక్కజొన్న సాగు చేశారు. విత్తనాలు వేసిన 90 రోజుల అనంతరం మొక్కజొన్న కండెలు రాకుండానే పంట ఎండిపోయింది. దీనిపై విత్తనాలు సరఫరా చేసిన ఆర్గనైజర్‌కు పలుమార్లు ఫోన్ చేసి విషయం చెప్పినా ఫలితంలేకుండా పోయింది. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. కౌలు ఖర్చులు అన్నీ కలిపి ఎకరాకు సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ ఖర్చయింది. పంట చేతికొచ్చే పరిస్థితి లేకపోవడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకట్రావు పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు వెంటనే నూజివీడులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విద్యుదాఘాతంతో కూలి మరణించిన ఘటన తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. అనుపల్లి పంచాయతీ బీర మాకుల కండ్రిగ గ్రామానికి చెందిన త్యాగరాజు రెడ్డి (40) తన ఇంటి అవసరాల కోసం రామచంద్రాపురంలో ఇనుపకమ్మిలను కొనుగోలు చేసి ట్రాక్టర్‌లో ఇంటికి బయలుదేరారు. గ్రామ సమీపంలోని మహాభారతం మిట్ట వద్ద 11కెవి విద్యుత్తు లైన్ ఇనుపకమ్మిలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై త్యాగరాజు అక్కడే కిందపడిపోయారు. గ్రామస్తులు గమనించి ఆయనను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కదిరిలో ఉద్రిక్తత

- దుకాణాల తొలగింపులో సిఐ అత్యుత్సాహం
- టిడిపి మహిళా నేతలపై బూతుపురాణం
- మీసం మెలేసి... తొడగొట్టిన సిఐ
- టిడిపి, వైసిపి పోటాపోటీగా నిరసనలు

స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, కదిరి టౌన్

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం వీధిలో దుకాణాలను తొలగించే విషయంలో ఆరంభమైన వివాదం చిలికి చిలికి గాలివానగా మారింది. సిఐ తుమ్మశెట్టి మధు దీనికి మరింత ఆజ్యం పోయడంతో వివాదం ముదిరింది. టిడిపి నాయకులపై మీసం మేలేయడం.. తొడలుగొట్టి మరింతగా రెచ్చగొట్టే విధంగా సిఐ వ్యవహరించడమే కాకుండా మహిళలను కూడా చూడకుండా బూతుపురాణం అందుకోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దీనికి అధికార వైసిపి నాయకులు మరింత మద్దతు తెలుపడమే కాకుండా ఆయనను భూజలపైకి ఎత్తుకుని ఊరేగించారు. అటు టిడిపి, ఇటు వైసిపి రెండు పార్టీలకు చెందిన వారు నిరసనలు చేపట్టడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. శనివారం రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

వివాదం మొదలైంది ఇలా...

కదిరి పట్టణంలోనున్న ప్రముఖ దేవాలయం లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆ వీధిలో రేకులషెడ్డులతో వేసుకున్న దుకాణాలున్నాయి. వీటిని తొలగించేందుకు పోలీసులు శనివారం ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో టిడిపి కౌన్సిలరు ఇందుకు అభ్యంతరం తెలిపారు. దుకాణాలు తొలగించవద్దని కోరారు. కాని సిఐ తుమ్మిశెట్టి మధు ఆమెపై బూతుపురాణం అందుకున్నారు. ఈ విషయం తెలిసి మరికొంత మంది మహిళలు అక్కడికి చేరుకోవడంతో పోలీసులు, టిడిపి నాయకుల మధ్య వివాదం మొదలైంది. మహిళలను దుర్భాషలాడిన సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసు స్టేషన్ ఎదుట టిడిపి మహిళా నాయకులు ధర్నాకు దిగారు. ఆ సమయంలోనూ మరోమారు సిఐ రెచ్చిపోయారు. నిరసన తెలుపుతున్న మహిళలపై లాఠీఛార్జి చేశారు. ఈ విషయం తెలిసి కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. సిఐపై చర్యలు తీసుకోవాలని మరోమారు నిరసనకు దిగారు. ఆయన పట్ల కూడా సిఐ ఇదే రకంగా వ్యవహరించారు. మీసాలు మేలేసి, తొడగొట్టారు. ఈ వివాదం నడుస్తున్న క్రమంలో వైసిపి నాయకులు అక్కడికి చేరుకుని సిఐకి మద్దతుగా నిరసన చేపట్టారు. ఆయనను భూజాలపై ఎత్తుకుని ఉరేగించారు. అటు టిడిపి, ఇటు వైసిపి ఇద్దరూ ఒకేసారి నిరసనలకు దిగడంతో పరిస్థితి చేదాటిపోయే వరకు వెళ్లింది. రెండు గ్రూపులు పరస్పరం రాళ్లు, చెప్పులు విసురుకున్నాయి. ఈ ఘటనలో రెండువైపుల వారికి స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో నల్లమాడ సిఐ అక్కడికి చేరుకుని రెండు గ్రూపులకు నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత

- రూ.44,539 కోట్లతో వ్యవసాయ ఉత్పత్తుల
- ఎగుమతుల్లో అగ్రగామిగా ఎపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ, వ్యాపార పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతుల్లో 2021-22 సంవత్సరంలో రూ.44,539 కోట్లతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచింది. ఆక్వాకల్చర్, హార్టికల్చర్, డెయిరీ, పౌల్ట్రీ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపింది. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రాష్ట్రం అద్భుతమైన మైలురాళ్లను సాధించిందని ప్రభుత్వం పేర్కొంది. 21-22 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ ఫామ్, బొప్పాయి, నిమ్మ, కొబ్బరి, టామోటా, మిరపకాయలతో సహా అనేక పంటల ఉత్పత్తులతోపాటు, సముద్ర ఎగుమతుల్లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. గుడ్లు, చేపలు, రొయ్యల ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండగా, వరి, మొక్కజొన్న, మామిడి, స్వీట్ ఆరెంజ్, జీడిపప్పు పసుపుల్లో రెండో స్థానంలో ఉన్నామని ప్రభుత్వం పేర్కొంది. దేశవ్యాప్తంగా కేంద్రం అభివృద్ధి చేస్తున్న 11 పారిశ్రామిక కారిడార్లలో హైదరాబాద్ నుంచి బెంగళూరు, విశాఖ నుంచి చెన్నై, చెన్నై నుంచి బెంగళూరు వంటి మూడింటికి రాష్ట్రంలో స్థల వాటా పంచుకుంటుంది. ఎపిలో 11.43 శాతం వృద్ధిరేటుతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా ఎపి నెంబరు వన్‌గా నిలిచిందన్నారు. పంటల ఉత్పాదకతను పెంచుకునేందుకు అధిక నాణ్యత, ఇన్‌పుట్ సేవలను అందించడానికి వైఎస్ఆర్ రైతు భరోసా ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తో రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ-2025కు అనుగుణంగా ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సమీకృత ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయనుంది. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, మారిషస్ రకం పైనాపిల్, స్ట్రాబెర్రీ, దాల్చిన చెక్క, జాజికాయ, జపనీస్‌మింట్ వంటి కొత్త పంటలను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

సుప్రీం కోర్టుఛీఫ్ జస్టిస్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

శ్రీశైలంలో సిజెఐ

ప్రజాశక్తి - శ్రీశైలం

రెండు రోజుల పర్యటన నిమిత్తం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.చంద్రచూడ్ కుటుంబసభ్యులతో కలిసి శనివారం శ్రీశైలం చేరుకున్నారు. ఆదివారం ఉదయం శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునను దర్శించుకోనున్నారు. సిజెఐకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ వై. లక్ష్మణరావు, తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన, దేవాదాయశాఖ కమిషనర్ ఎం. హరి జవహర్‌లాల్, కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎన్. శ్రీనివాసరావు, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎస్‌పి రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారిచక్రపాణిరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్న స్వాగతం పలికారు.

పల్నాడులో విషాదం

- ఓ వ్యక్తిని ముక్కలుగా నరికి దహనం చేసిన తండ్రీకొడుకులు

ప్రజాశక్తి - దాచేపల్లి (పల్నాడు జిల్లా)

మృతుడు కోటేశ్వరరావు (ఫైల్)

ఓ వ్యక్తిని తండ్రీకొడుకులు దారుణంగా హతమార్చిన ఘటన పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రంలో శనివారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. నగర పంచాయతీ అయిన దాచేపల్లిలోని తిరుపతమ్మ గుడి ప్రాంతంలో గరికపాటి కోటేశ్వరరావు (45), బంబోతులు సైదుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరిద్దరూ స్థానిక పంచాయతీలో పంప్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కోటేశ్వరరావు ఇంటికి రాకపోవడంతో కుమారుడు శివశంకర్ తన తండ్రీ ఆచూకీ కోసం వెతకసాగాడు. స్థానిక శారదా పబ్లిక్ స్కూల్ ఆవరణంలో కోటేశ్వరరావు ద్విచక్ర వాహనం పడి ఉండడం, రక్తపు మరకలు ఉండడంతో అనుమానంతో తన బాబాయికి విషయం చెప్పాడు. సైదులు, కోటేశ్వరరావు కలిసి మాట్లాడుకోవడం తాను చూశానని ఆయన చెప్పడంతో వెంటనే సైదులు ఇంటికెళ్లాడు. అక్కడ ఆయన లేకపోవడంతో గ్రామంలోని పాఠశాల వైపు వెళ్తుండగా సైదులు, అతని కుమారుడు నాగరాజు ద్విచక్ర వాహనంపై వస్తూ కనిపించారు. వారిని ఆపి తన తండ్రి గురించి ఆరా తీశారు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో తన తండ్రి కోసం మళ్లీ శివశంకర్ వెతకసాగాడు. సమీప మిర్చి పొలాల్లో మంటలు రావడాన్ని గమనించి అక్కడికి వెళ్లి పరిశీలించాడు. తన తండ్రి కాలిపోతున్నాడని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. సైదులు, ఆయన భార్య, కుమారుడు నాగరాజును అదుపులోకి తీసుకుని విచారించారు. తాను, కుమారుడు కలిసి హత్య చేసినట్లు సైదులు అంగీకరించాడు. తన భార్యతో కోటేశ్వరరావు అనుచితంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని, ఆమె ఒకసారి మందలించినా పద్ధతి మార్చుకోపోవడంతో హత్య చేశామని, ముక్కలుగా చేసి కాల్చేశామని చెప్పారు. మృతుని కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దోపిడీ కేసులో ఐదుగురు అరెస్టు

- రూ.1.14 కోట్ల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

స్వాధీనం చేసుకున్న ఆభరణాలను పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు

గుంటూరులో రెండు రోజుల క్రితం ఆదాయపు పన్నుశాఖ అధికారులమని చెప్పి ఒక ఇంట్లో దోపిడికీ పాల్పడిన కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.48.50 లక్షల నగదు, రూ.66.30 లక్షల విలువ చేసే 1326 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను జిల్లా ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్ శనివారం మీడియాకు వెల్లడించారు. పాత గుంటూరు పరిధిలోని ప్రగతినగర్‌కు చెందిన దొడ్డక ప్రసాద్ ఇంట్లో శింగంశెట్టి కల్యాణి పదేళ్లుగా ఇంటి పని చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రసాద్ తన ఆస్తులను కల్యాణి వద్ద ఉంచాడు. ఈ విషయం తెలుసుకున్న కాండ్రు జాన్‌బాబు, జ్యోతుల ఏసు అనే ఇద్దరు యువకులు తమకు స్నేహితులైన బండ్లమూడి సురేష్, సంకురు విజయ్‌కుమార్, మేకతోటి రవీంద్ర, కొచ్చెర్ల వెంకటస్వామితో కలిసి దోపిడికి పథకం రూపొందించారు. ఆదాయపు పన్ను అధికారులుగా వెళ్లి మొత్తం నగలు, నగదు దోపిడీ చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా ఈ నెల 23న కల్యాణి ఇంటికి వెళ్లి నగదు రూ.50 లక్షలు, నగదు తీసుకుని కారులో పరారయ్యారు. ఆమెను విచారించగా కాండ్రు జాన్‌బాబు, జ్యోతుల ఏసు పేర్లను అనుమానితులుగా చెప్పారు. వారిని పోలీసులు పట్టుకుని విచారించడంతో మొత్తం వ్యవహారం బయటకొచ్చింది. మొత్తం ఆరుగురు నిందితుల్లో వెంకటస్వామి పరారవ్వగా మిగతా ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌పి తెలిపారు.

ఎల్ఐసి పరిరక్షణకు కృషి చేయాలి

- సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎం.కామేశ్వరి

ప్రజాశక్తి-గుంటూరు

సదస్సులో మాట్లాడుతున్న కామేశ్వరి

ఎల్ఐసి ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమాల్లో, సంస్థ బలోపేతానికి జరుగుతున్న కృషిలో ఉద్యోగినులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎం.కామేశ్వరి పిలుపునిచ్చారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ మహిళా సదస్సు గుంటూరులోని ఎల్ఐసి కార్యాలయంలో శనివారం జరిగింది. గుంటూరు, విజయవాడ, మచిలీపట్నం నుండి ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సులో ముఖ్య అతిథిగా కామేశ్వరి పాల్గొని మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు ఎల్ఐసిని కూడా ప్రయివేటీకరించేందుకు మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. ఎల్ఐసి బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని తెలిపారు. ఎల్ఐసి పెట్టుబడులు ఎప్పుడూ దీర్ఘకాలికంగానే ఉంటాయని, అదానీ షేర్లు పడిపోవడం వల్ల ఎల్ఐసికి నష్టమేమీ ఉండదని చెప్పారు.

నూతన పెన్షన్ విధానం రద్దుకు పాత పెన్షన్ విధానం సాధనకు ప్రతి ఉద్యోగి మరింత క్రియాశీలకంగా పని చేయాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ జి.సూర్యప్రభ మాట్లాడుతూ అన్ని రంగాల్లో సమానత్వం సాధించడం ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల మధ్య సమన్వయం, సహకారం, ఐక్యత అవసరమని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కరువై వారు ఉపాధికి దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డివిజన్ కన్వీనర్ కె.భవానీదేవి ప్రవేశపెట్టిన వార్షిక నివేదికను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. యూనియన్ నేతలు కె.భవానీదేవి, కెవి.రమణకుమారి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎల్ఐసి చీఫ్ మేనేజర్ ఎస్.విజయలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.సుధాకర్, జి.కిషోర్‌కుమార్ ప్రసంగించారు. 2023-24 సంవత్సరానికి కె.భవానీని కన్వీనర్‌గా, కెవి రమణకుమారి, వి.మణికుమారి, ఎన్.సుధారాణిలను కో-కన్వీనర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిడిఎస్‌వి వానీకుమారి, వి.హిమబిందు, ఎం.శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదానీకి కట్టబెట్టిన ఆస్తుల వివరాలు వెల్లడించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అదానీకి కట్టబెట్టిన ఆస్తుల వివరాలను వెల్లడించాలని సిఎం వైఎస్ జగన్‌ను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ నివేదిక.. అదానీ ఆర్థిక అవకతవకల వ్యవహారం దేశాన్నే కుదిపేస్తుందని తెలిపారు. ఈ నివేదికపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో అదానీ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం భూములు కట్టబెట్టడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు. తెలంగాణలో అదానీ కంపెనీల ఏర్పాటుకు ఆస్కారం లేదంటూ ఆ ప్రభుత్వం తిరస్కరించిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెడ్‌కార్పెట్ పరుస్తూ ఇబ్బడిముబ్బడిగా ఆస్తులను కట్టబెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలో పోర్టులు, సోలార్ విద్యుత్ ఒప్పందాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలన్నీ అదానీ కంపెనీలకు జగన్ అప్పగించారని పేర్కొన్నారు. ఇప్పటికే గంగవరం, కృష్ణపట్నం పోర్టులను ధారాదత్తం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు దక్కాల్సిన ఆస్తులు, ఆదాయ వనరులన్నీ అదానీకే అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, అదానీ, జగన్ మధ్య ఉన్న రహస్య ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అదానీ కంపెనీలకు ఎన్ని ఆస్తులు కట్టబెట్టారో ప్రజలకు వెల్లడించాలని పేర్కొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

మోకాలి మార్పిడిలో రోబోటిక్ సర్జరీ

- అపోలో ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు మదన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలో రోబోటిక్ సర్జరీని తీసుకువచ్చామని ఒంగోలు అపోలో ఆస్పత్రి సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మహానగరాలకే పరిమితమైన ఈ సర్జరీని నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..గతంలో నిర్వహించే మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలో అనేక ఇబ్బందులు ఉండేవని అన్నారు. రోబోటిక్ సర్జరీ ద్వారా కచ్చితత్వంతో పాటు, కోత తక్కువగా ఉంటుందని, బాధితులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. ఈ సర్జరీలో ముందుగా కంప్యూటర్లో త్రీడి నమూనాను రూపొందించి, ఆ తరువాత పేషెంట్ సిటీ స్కాన్ ఆధారంగా ఏ భాగంలో ఆపరేషన్ చేయాలో కచ్చితమైన వర్చువల్ ప్లానింగ్ ద్వారా రోబోటిక్ ఆర్మ్ అసిస్టెండ్ టెక్నాలజీ ద్వారా ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా తమ వద్ద రోబోటిక్ సర్జరీ చేసుకున్న పలువురు పేషెంట్లను మీడియాకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్లు పమ్మి కార్తీక్ రెడ్డి, పృథ్వి, వివేకానందరెడ్డి, శశిధర్ రెడ్డి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్

- పారిశ్రామిక దిగ్గజాల రాక : మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నగరంలో వచ్చే నెల 3, 4 తేదీల్లో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పారిశ్రామిక దిగ్గజాలైన ముఖేష్ అంబానీ, అదానీ, టాటా, బిర్లా గ్రూపులకు చెందిన అధినేతలు తరలిరానున్నారని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. విశాఖలోని వైసిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమ్మిట్‌లో పాల్గొనేందుకు సుమారు 6,500 మంది రిజిస్టర్ అయ్యారని తెలిపారు. ఈ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సదస్సు ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రాబోతున్నాయని, దీనివల్ల రాష్ట్ర ముఖచిత్రం మారిపోతుందని తెలిపారు. ఇప్పటికే విప్రో సంస్థ విశాఖలో వెయ్యి మంది ఉద్యోగులతో తమ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించుకుందని చెప్పారు. రాష్ట్రంలోని సహజ వనరుల వినియోగంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ రాష్ట్రంలో ఉన్న సముద్ర తీరాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మారిటైం బోర్డు ద్వారా రూ.15 వేల కోట్లతో మూడు పోర్టుల నిర్మాణం చేపడతామని తెలిపారు. దేశంలో పోర్టు సిటీలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో విశాఖ కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

వైసిపి పాలనలో సంక్షేమ బోర్డు నిర్వీర్యం

- అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటాం
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

వైసిపి హయాంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిర్వీర్యమైందని, నిధులు పక్కదారి పట్టాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 27వ రోజుకు చేరుకుంది. శనివారం ఉదయం తిరుపతి అంకుర ఆస్పత్రి సమీపంలోని విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. తిరుపతిలోని ఎస్‌సి కాలనీ, ఆర్‌టిసి బస్టాండు, అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహం, రైల్వే స్టేషన్, కృష్ణాపురం ఠాణా, ఎన్‌టిఆర్ సర్కిల్, బాలాజీ కాలనీ, అన్నమయ్య సర్కిల్ మీదుగా చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుచానూర్ వరకు చేరుకుంది. అంకుర ఆస్పత్రి వద్ద భవన నిర్మాణ కార్మికులతో లోకేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని, ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఇసుక అక్రమ రవాణా ద్వారా రోజుకు రూ.మూడు కోట్లు సంపాదిస్తున్నారని విమర్శించారు. పనుల్లేక భవన నిర్మాణ కార్మికులు చాలా మంది ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. బోర్డు నుంచి ఎటువంటి క్లైమ్ రావడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని, ఐదు లక్షల బీమా పథకం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. లోకేష్ పాదయాత్ర సాయంత్రానికి తిరుచానూరు సర్కివల్ వరకు చేరుకుంది. రాత్రి అక్కడి విడిది కేంద్రంలో ఆయన బస చేశారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం విచారకరం

టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సకాలంలో జీతం రాక ప్రభుత్వ ఉద్యోగి లోన్‌యాప్ బారిన పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం విచారకరమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ట్విట్టర్‌లో స్పందించారు. రాష్ట్ర దుస్థితికి ఈ ఘటన దర్పణమని విమర్శించారు. లక్షల కోట్ల అప్పులు, పన్నుల బాదుడు సొమ్మంతా ఎటుపోతుంది? ప్రభుత్వం సమాధానం చెప్పగలదా? అని ప్రశ్నించారు.

తెలంగాణలో రాష్ట్రపతి పాలన విధించాలి

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనీ, అందుకే రాష్ట్రపతిపాలన విధించాలని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కోరారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో షర్మిల భేటీ అయ్యారు. ప్రతిపక్ష నేతలపై, కార్యకర్తలపై దాడులు అధికమయ్యాయని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌తో భేటీ అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో వాస్తవ పరిస్థితులను వివరించేందుకే గవర్నర్‌ను కలిశానని తెలిపారు. కెసిఆర్ నియంత పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. దేశంలో భారత రాజ్యాంగం అమలులో ఉంటే తెలంగాణలో కెసిఆర్ రాజ్యాంగం అమలు అవుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నేతలు ప్రతిపక్షాలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించాలని గవర్నర్‌ను కోరినట్టు తెలిపారు. వీధి కుక్కలు దాడి చేసి పసిపిల్లల ప్రాణాలు తీస్తే పట్టించుకునే దిక్కులేదని ఆవేదన వ్యక్తంచేశారు. అక్కడినుంచి షర్మిల నిమ్స్ ఆస్పత్రి చేరుకుని చికిత్స పొందుతున్న మెడికో విద్యార్థిని ప్రీతిని పరామర్శించారు. వైఎస్. వివేకానంద రెడ్డి కేసు దర్యాప్తుపై స్పందించాల్సిందిగా విలేకరులు కోరగా.. చట్టం తన పని తాను చేస్తుందని షర్మిల తెలిపారు.

రాష్ట్రపతితో గవర్నరు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గవర్నరు శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో గవర్నరు అబ్దుల్ నజీర్‌కు ముఖ్య సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఎపి భవన్ అదనపు కమిషనరు హిమాన్షు కౌశిక్ స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నరుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఢిల్లీ పర్యటనకు వచ్చారు. పర్యటనలో భాగంగా శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌తో గవర్నరు భేటీ అయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఆదివారం భేటీ కానున్నారు.

కుమార్తెను చంపిన వ్యక్తిని శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దళిత యువకుడిని ప్రేమించిందనే పేరుతో కుమార్తెను చంపి కాల్చి బూడిదను చెరువులో కలిపిన తండ్రి దేవేందర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి శనివారం ప్రకటన విడుదల చేశారు. దేవేందర్‌రెడ్డికి సహకరించిన వారినీ శిక్షించాలని కోరారు. సమాజంలో నెలకొన్న ఆందోళనకర పరిస్థితికి ఈ ఘటన అద్దం పడుతుందని తెలిపారు. ఆడ పిల్లల ఆకాంక్షలను వివాహంలో వారి ఎంపికను గుర్తించాలని, గౌరవించాలని తెలిపారు. చదువులో, వస్త్రధారణలో అన్నింటా వారి ఇష్టాఇష్టాలను ఆమోదించే సంస్కృతిని పెంచుకోవాలని, ప్రభుత్వాల ఆంక్షలు పెట్టడానికి తిప్పి కొట్టాలని అన్నారు. దీనికోసం అందరూ కృషి చేయాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం (అనంతపురం)

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతపురం జిల్లా కంబదూరు మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. మృతుని భార్య వివరాల మేరకు.. దేవేంద్రపురానికి చెందిన బాలునాయక్ (40)కు 2.50 ఎకరాల పొలముంది. పంటల సాగు, వ్యవసాయ బోర్లు వేసేందుకు బ్యాంకులు, ప్రయివేటు వ్యక్తుల నుంచి రూ.9.50 లక్షలు అప్పు తీసుకున్నారు. బోరులో నీరు ఎండిపోవడం, అప్పులు తీరే దారిలేక గురువారం తన పొలంలోనే పురుగుల మందు తాగారు. చికిత్స నిమిత్తం ఆయనను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ భూములన్నీ మావే...

- మరోసారి వివాదానికి తెరలేపిన టిటిడి
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు వేల ఎకరాల్లో రిజిస్ట్రేషన్ల నిషేధం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) మరో వివాదాన్ని తెరపైకి తెచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మూడు వేల ఎకరాలకుపైగా భూములన్నీ మావే. వీటిని రిజిస్ట్రేషన్ చేయొద్దు' అంటూ గతేడాది ఫిబ్రవరిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాసింది. ఇందుకు సంబంధించి సుమారు 200 సర్వే నంబర్లను సమర్పించింది. ఈ లేఖపై దేవాదాయ శాఖ స్పందిస్తూ ఈ భూములన్నీ 22ఎ కింద ఉన్నాయని, వీటి రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖకు నివేదించింది. దీంతో, ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 26 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ ఈ నెల తొమ్మిదిన ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ల నిషేధం విధించిన వాటిలో సర్వే నంబర్ 11/2బి-2 అక్కారంపల్లిలోని 1200 ఎకరాలు, సర్వే నంబర్ 1, 2, 3, 4లో లీలామహల్ నుంచి బిటిఆర్ నగర్, శెట్టిపల్లి, మంగళం క్వార్టర్స్, కరకంబాడి వరకూ 700 ఎకరాలు, తిరుపతి బ్లిస్ స్టార్ హోటల్ నుంచి లక్ష్మీపురం జంక్షన్, పద్మావతిపురం వరకూ మరో 300 ఎకరాలు, నాగలాపురం, అప్పలాయగుంట, నారాయణవనంలోని రైతులకు సంబంధించి 250 ఎకరాలు ఉన్నాయి. నారాయణవనానికి చెందిన టిటిడి కళ్యాణ మండపం సర్వే నంబర్ 83/12ఎ/2బి/4ఎలో మూడు ఎకరాల్లో ఉంది. అయితే సర్వే నంబర్‌లోని 30 ఎకరాల రిజిస్ట్రేషన్‌పైనా నిషేధం విధించింది. ఈ మూడు వేల ఎకరాల్లో 1100 ఎకరాలు సాగు భూములు ఉన్నాయి. వీటిని రైతులు ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్నారు. మిగిలిన 1900 ఎకరాల్లో ఇళ్లు, షాపులు, కొన్ని అపార్టుమెంట్లు ఉన్నాయి. పేదలు, ప్రయివేట్ వ్యక్తులు వీటిని నిర్మించుకున్నారు. ఈ వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా, ఎటువంటి విచారణా జరపకుండా రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ గుడ్డిగా ఈ ఆదేశాలు ఇచ్చిందని స్థానికులు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడేందుకు వారు సన్నద్ధం అవుతున్నారు. నిషేధం విషయమై తిరుపతి జిల్లాకు సంబంధించిన ఓ రిజిస్ట్రేషన్ అధికారిని 'ప్రజాశక్తి' ఫోన్‌లో సంప్రదించగా టిటిడి ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రకటించారు తప్ప, సబ్‌డివిజన్ చేసి ఉంటే గందరగోళం ఉండేది కాదన్నారు. 26 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సమస్య తలనొప్పిగా మారిందని, తమ చేతుల్లో ఏమీ లేదని, ప్రభుత్వమే గెజిటెడ్ నోటిఫికేషన్ ఇచ్చి సబ్‌డివిజన్ చేసి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ ఈ సమస్య ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ జిఒతో రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాలో చేరిన తిరుపతి పద్మావతిపురంలోగల టిటిడి కల్యాణ మండపం సమీపంలోని ఇళ్లు

గతంలోనూ...

టిటిడి గతంలో కూడా ఇటువంటి వివాదాలకు తెరలేపింది. 'తిరుపతి అంతా టిటిడిదే' అంటూ 2002లో అప్పటి ప్రభుత్వం 781 జిఒను జారీ చేసింది. టిటిడి విజ్ఞప్తి మేరకు ఈ జిఒ ఇచ్చింది. అప్పట్లో ఇది పెద్ద వివాదాస్పదమైంది. '781 వ్యతిరేక జిఒ పోరాట కమిటీ'గా స్థానికులు ఏర్పడి మూడు నెలల పాటు ఆందోళనలు చేయడంతో అప్పటి ప్రభుత్వం వెనక్కి తగ్గి ఈ జిఒను ఉపసంహరించుకుంది.

విఆర్‌ఎపై చేయి చేసుకున్న తహశీల్దార్

- ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు వేయలేదని దాడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

ఫేస్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు నమోదు కాలేదన్న కారణంతో విఆర్‌ఎపై తహశీల్దార్ చేయిచేసుకున్న సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో చోటుచేసుకుంది. దీనిపై బాధితుడు, విఆర్‌ఎల సంఘం నాయకులు కలిసి సత్తెనపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. బాధితుని వివరాల ప్రకారం.. కొమెరపూడికి చెందిన విఆర్‌ఎ కొరబండి శ్రీనివాసరావు కొంతకాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఫేస్‌యాప్‌లో హాజరు వేయలేదు. దీంతో కార్యాలయానికి రావాలని శ్రీనివాసరావుకు తహశీల్దార్ కె.నగేష్ కబురు చేశారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో కార్యాలయానికి వచ్చిన శ్రీనివాసరావుపై తహశీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎప్పుడు రమ్మంటే, నువ్వు ఎప్పుడు వచ్చావు?, పైగా ఫోన్ తీసుకురాకుండా ఎందుకొచ్చావు..?' అంటూ ఆయనపై చేయి చేసుకున్నారు. ఈ విషయాన్ని బాధితుడు శ్రీనివాసరావు విఆర్‌ఎల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అందరూ కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తహశీల్దార్‌పై ఎస్‌టి, ఎస్‌సి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. విఆర్‌ఎపై చేయిచేసుకున్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ సేవకుల సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు పి.సంజీవరావు, పి.రవి, సిద్ధయ్య, పి.మహేష్, ఎం.హరిపోతురాజు, జె.రాజ్‌కుమార్ ఉన్నారు. దాడిపై తహశీల్దార్ కె.నగేష్‌ను వివరణ కోరగా దాడి అవాస్తవమని అన్నారు. యాప్‌లో ఎందుకు రిజిస్టర్ చేసుకోలేదని మాత్రమే అడిగానని చెప్పారు.

ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాల్సిందే

నిరసనలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపిఎస్‌ఆర్‌టిసి బస్టాండ్ల ప్రయివేటీకరణ ఆపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. స్థలాల లీజు పేరుతో జరుగుతున్నది కేంద్ర ప్రభుత్వ నగదీకరణ పథకమేనని విమర్శించారు. 33 సంవత్సరాల లీజు పేరుతో ఆర్‌టిసికి చెందిన వంద బస్సు స్టేషన్లను ప్రయివేట్ సంస్థలకు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రయివేటీకరణ నిర్ణయాలను ఆర్‌టిసిలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ రవాణా మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా ఏటా వెయ్యి అద్దె బస్సులు, ప్రయివేటు విద్యుత్తు బస్సుల ప్రవేశం, స్క్రాపింగ్ పాలసీ, యుటిఎస్ మిషన్లు వంటి వాటిని యాజమాన్యం వేగంగా అమలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. వడోదర మోడల్ పేరుతో గుజరాత్‌లోని ఎంతో విశాలమైన వడోదర బస్ స్టేషన్‌ను ప్రయివేట్ కన్సార్టియన్లకు అప్పజెప్పి ఆ బస్ స్టేషన్‌కు అన్ని ప్రయివేట్ బస్సులు వచ్చేలా ఏర్పాటు చేశారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలోనే ఇంటిగ్రేటెడ్ బస్ స్టేషన్ల పేరుతో వీటిపై అధ్యయనం చేశారని తెలిపారు. నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనువాసులురెడ్డి మాట్లాడుతూ.. విలీనం పేరుతో ఆర్‌టిసి ఆస్తులను కార్పొరేట్లకు అర్పణం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దివాకర్, కడప జోనల్ కార్యదర్శి భాస్కర్, నాయకులు పి.వి.నాదం, వైఎస్.రాజు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసికి మరో అవార్డు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ స్థాయిలో ఎపిఎస్ ఆర్‌టిసి మరో అవార్డును సొంతం చేసుకుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన డిజిటల్ టెక్నాలజీ పోటీల్లో వివిధ ప్రభుత్వ సంస్థలతో పోటీపడి ఈ అవార్డును ఆర్‌టిసి దక్కించుకుంది. ఈ మేరకు ఎపిఎస్‌ఆర్‌టిసి శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించడంలో ఎపిఎస్‌ఆర్‌టిసి ముందంజలో ఉండటంలో భాగంగా ఇటీవల కాగిత రహిత సేవలను ప్రవేశపెట్టింది. యుటిఎస్ (యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్స్) ద్వారా డిజిటల్ చెల్లింపుల సౌలభ్యాన్ని కలిగించింది. ఇందుకు గానూ 2023 సంవత్సరానికి ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ విభాగంలో వరుసగా ఐదోసారి డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డుకు ఎంపికైనట్లు ఎపిఎస్ ఆర్‌టిసి పేర్కొంది. యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు కాగిత రహిత టిక్కెట్లు సులభంగా జారీచేసే సౌలభ్యాన్ని ప్రయాణికులకు కల్పించి ఉత్తమ సేవలందిస్తున్నందుకు ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రశంసలు అందుకుంది. ఈ నెల 24న కొచ్చిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (అడ్మిన్) ఎ కోటేశ్వరరావు, డిప్యూటీ ఇంజినీరు (ఐటి) వై శ్రీనివాసరావు కలిసి సంస్థ తరపున అవార్డును అందుకున్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసి వరుసగా ఈ అవార్డు అందుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

శనగ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతుల దగ్గర నిల్వవున్న శనగ పంటను క్వింటాకు రూ.6 వేల ధరతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాయలసీమ జిల్లాల్లోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 8 లక్షల ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారని తెలిపారు. రబీలో ఇతర పంటలకు అవకాశం లేని పరిస్థితుల్లో అనివార్యంగా శనగ పంటను సాగు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి శనగపంటను పండించిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.5,335 కూడా దక్కడం లేదని పేర్కొన్నారు. శనగ రైతుల మధ్య దళారులకు క్వింటాకు రూ.4,500 కంటే తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. విత్తనం నుంచి విక్రయం దాకా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుకు అండగా ఉంటామని ఒక వైపు పేర్కొంటున్న ప్రభుత్వం మరొక వైపు ప్రకటనలకే పరిమితమవుతోందే తప్ప వాస్తవంగా రైతులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించకుండా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. రైతులకు అండగా నిలవాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

మండలి రద్దుకు కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

శాసన మండలి రద్దుకే తాము కట్టుబడి ఉన్నామని మత్స్యశాఖ, పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనమండలి వృథా, రద్దు చేయాలని కోరిన వైసిపి ఇప్పుడు అభ్యర్థులను నిలబెట్టి ఓట్లు ఎలా అడుగుతారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా స్పందించారు. కౌన్సిల్ రద్దు కోరుతూ కేంద్రానికి లేఖ రాసినా ఆమోదం రాలేదన్నారు. మండలిలో ఖాళీలను పూర్తి చేయాల్సి ఉన్నందున ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టామని చెప్పారు. కౌన్సిల్ రద్దు చేసినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

సమాజానికి బాలలు మానవ వనరులు

- వారి ఆసక్తి, అభిరుచులకు ప్రాధాన్యత ఇద్దాం
- గోదావరి బాలోత్సవం ప్రారంభ సభలో వక్తలు ఉద్ఘాటన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జి

బాలలు సమాజ సంపద, సమాజం ఆస్తి అని, వారిని సమాజభివృద్ధికి దోహదపడేలా తీర్చిదిద్దాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రెండు రోజులపాటు జరగనున్న 'గోదావరి బాలోత్సవం' పిల్లల పండుగ శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాన్ని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ప్రారంభించారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు వివిఎస్ కష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాబ్జి మాట్లాడుతూ బాలల రూపంలో ఉన్న మానవ వనరులను భవిష్యత్ సమాజానికి సద్వినియోగం చేసేలా ఇప్పటి నుంచే వారిలో ఆలోచన శక్తిని పెంపుదల చేసేందుకు దృష్టి సారించాలన్నారు. సెల్‌ఫోన్ ప్రపంచంలో బాల్యం శిథిలమైపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాలల్లో ఉన్న ఆలోచనా శక్తిని, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, వారికున్న ఆసక్తిని, అభిరుచులను పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా బాలోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అమరావతి బాలోత్సవం నిర్వాహకులు మురళీకష్ణ మాట్లాడుతూ నేటి విద్యావ్యవస్థ విద్యార్థులను ఏవో భ్రమలవైపు, భ్రాంతిలోకి తీసుకెళుతోందని అన్నారు. విద్యార్థుల ఆసక్తిని తెలుసుకుని ప్రోత్సహించేలా తల్లిదండ్రులతోపాటు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దారి తప్పిన విద్యావ్యవస్థను సన్మార్గంలో పెట్టేందుకు అవసరమైన రీతిలో చైతన్యం తీసుకొచ్చేందుకు దోహదం చేసేలా బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సిసిసి ఎండి పంతం కొండలరావు, పిఎ రాజబాబు, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, ఆలపాటి నాగేశ్వరరావు, డాక్టర్ తలారి వాసు, డాక్టర్ చైతన్య శేఖర్, పి.తులసి, తాడూరి శ్రీనివాస్, సూర్యనారాయణ, జివిఎల్ నరసింహారావు, ఖాదర్‌ఖాన్, సూర్యనారాయణ, గౌరీ, శ్రీనివాస్, పెరుమాళ్ల రఘునాథ్ పాల్గొన్నారు.

ప్రియుడితో కలిసి భర్త హత్య

ప్రజాశక్తి-కంచికచర్ల (ఎన్‌టిఆర్ జిల్లా)

వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్లలో శనివారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరులపాడు మండలం జుజ్జూరుకు చెందిన కుంచం రామారావు (45) గ్రామంలో రేషన్ దుకాణం నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ప్రొక్లెయిన్ అద్దెకు తీసుకొని నడుపుతుంటారు. రామారావు వద్ద ప్రొక్లెయిన్ డ్రైవర్‌గా అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రామారావు భార్యతో ప్రొక్లెయిన్ డ్రైవర్ ప్రవీణ్‌కు వివాహేతర సంబంధం ఏర్పడింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రవీణ్ తన స్నేహితులైన పులి రాజేష్, బుచ్చిబాబుతో కలిసి రామారావు ఇంటికి వచ్చారు. ఇంటి బయట రాజేష్, బుచ్చిబాబును కాపలాగా ఉంచి ప్రవీణ్ లోనికి వెళ్లాడు. ఇంట్లో భార్గవి, ప్రవీణ్ ఏకాంతంగా ఉండటాన్ని రామారావు చూసి కోపోద్రిక్తుడయ్యాడు. ప్రవీణ్ కుమార్‌తో ఘర్షణపడ్డాడు. దీంతో ప్రవీణ్ తన స్నేహితులైన రాజేష్, బుచ్చిబాబుతో కలిసి రామారావుపై దాడి చేశారు. ఇందుకు భార్గవి కూడా సహకరించడంతో నలుగురూ కలిసి రామారావుని చితకబాదారు. తీవ్ర గాయాలపాలైన రామారావును బంధువులు నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రామారావు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ నాగేంద్ర కుమార్ తెలిపారు.

వృద్ధి 5 శాతం లోపే..!

- జిడిపి గణాంకాలపైనే ఇన్వెస్టర్ల దృష్టి
- వచ్చే వారంలోనూ అప్రమత్తత

ముంబయి : మార్కెట్లలో వరుస నష్టాలతో ఆందోళనలో ఉన్న మదుపర్లు వచ్చే వారంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఫిబ్రవరి 27తో ప్రారంభమయ్యే వారంలో మార్కెట్లను ప్రధానంగా భారత జిడిపి గణంకాలకు తోడు తయారీ రంగం అంచనాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు ప్రభావితం చేయనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23 అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) గణంకాలను ఫిబ్రవరి 28న కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. ఇది ప్రధానంగా మార్కెట్లను ప్రభావితం చేయనుంది. ఫిబ్రవరికి సంబంధించిన మ్యానుఫ్యాక్చరింగ్ పిఎంఐ డేటాను మార్చి మూడో తేదిన ఎస్‌అండ్‌పి విడుదల చేయనుంది. జనవరిలో ఈ సూచీ 55.4కు తగ్గి మూడు మాసాల కనిష్ఠ స్థాయి వద్ద నమోదయ్యింది. డిసెంబర్‌లో ఇది 57.8గా ఉంది. ఫిబ్రవరి మాసానికి సంబంధించిన వాహన అమ్మకాలను మార్చి1న వాహన కంపెనీలు విడుదల చేయనున్నాయి. ఈ రిపోర్టులు ఆ రంగం సూచీలను ప్రభావితం చేయనున్నాయి.

2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత జిడిపి 4.6 శాతానికి పరిమితం కావొచ్చని రాయిటర్స్ పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. ఇంతక్రితం జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో 6.3 శాతం, ఏప్రిల్ - జూన్ త్రైమాసికంలో 13.5 శాతం చొప్పున జిడిపి నమోదయ్యింది. ఈ రెండు త్రైమాసికాలతోనూ పోల్చినా గడిచిన డిసెంబర్‌లో భారీ తగ్గుదల నమోదు కానుందని అంచనాలు వెలుపడుతున్నాయి. అదే జరిగితే స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి చోటు చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుత జనవరి నుంచి మార్చితో ముగియనున్న త్రైమాసికంలో వృద్ధి మరింత తగ్గి 4.4 శాతానికి మందగించనుందని రాయిటర్స్ పోల్‌లో నిపుణులు అంచనా వేశారు. 2023-24లో సగటున 6 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జనవరి 31న ప్రభుత్వం వేసిన అంచనా 6.5 శాతంతో పోల్చితే తక్కువగానే చోటు చేసుకోనుందని భావిస్తున్నారు.

ఈ నెల 16 నుంచి బిఎస్ఇ సెన్సెక్స్ 1856 పాయింట్లు లేదా 3 శాతం విలువ కోల్పోయింది. ఈ సమయంలో మదుపర్లు రూ.8.30 లక్షల కోట్ల సంపదను పోగొట్టుకున్నారు. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.8,30,322.61 కోట్లు కోల్పోయి రూ.2,60,00,662.99 కోట్ల వద్ద ముగిసింది. దేశ ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్లలో విశ్వాసాన్ని నింపడంలో కేంద్ర ప్రభుత్వ విధానాలు విఫలమయ్యాయని నిపుణులు విమర్శిస్తున్నారు.

అదాని షేర్లపై నీలినీడలు..!

హిండెన్ బర్గ్ దెబ్బతో భారీగా పడిపోయిన అదాని గ్రూపు కంపెనీల షేర్లపై నీలినీడలు కొనసాగుతూనే ఉన్నాయి. వచ్చే వారంలోనూ ఈ స్టాక్స్ పట్ల మదుపర్లు అప్రమత్తంగా వ్యవహారించే అవకాశం ఉంది. 2023 జనవరి 24న హిండెన్‌బర్గ్ రిపోర్టు వెల్లడయినప్పటి నుంచి అదాని గ్రూపు మార్కెట్ కాపిటలైజేషన్ రోజుకు సగటున రూ.52,343 కోట్లు పతనమవుతూ వచ్చింది. కేవలం నెల రోజుల్లో అదానీ గ్రూపు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ 63 శాతం పతనమయ్యింది. కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో ప్రపంచ కుబేరుల జాబితాలో గౌతం అదాని మూడో స్థానం నుంచి 29వ స్థానానికి దిగజారారు.

పిఎస్‌బిలపై ప్రభావం..

హిండెన్ బర్గ్ రిపోర్ట్ అదాని గ్రూపు కంపెనీలపైనే కాకుండా ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల షేర్లపైన తీవ్ర ప్రభావం చూపింది. అదానికి అప్పులిచ్చిన పలు బ్యాంక్‌ల సూచీలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే గడిచిన నెల రోజుల్లో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 18 శాతం కోల్పోయింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 17.1 శాతం, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ 17 శాతం, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్ 16.3 శాతం, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ 15.6 శాతం చొప్పున విలువ కోల్పోయాయి. తక్కువ ధర పలుకుతున్న ఈ సూచీలకు వచ్చే వారం మద్దతు లభించే అవకాశం ఉంది.

చేదెక్కుతున్న చెరకు

- కర్మాగారాలకు పేరుకుపోయిన బకాయిలు
- విఆర్‌ఎస్ తీసుకున్న ఉద్యోగులకు చెల్లింపుల్లేవు
- సమస్యల్లో 6 కర్మాగారాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

చెరకు రైతులను ఆదుకోవాల్సిన చక్కెర కర్మాగారాల పరిస్థితి దయనీయంగా ఉండడం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా సక్రమంగా లేకపోవడం వంటి కారణాలు ఈ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. మూడొంతులకుపైగా చక్కెర కర్మాగారాలు రాష్ట్రంలో మూతబడి ఉండడంతో రైతులు కూడా చెరకు సాగువైపు పెద్దగా దృష్టి సారించడం లేదు. రాష్ట్రంలో ప్రైవేటు, సహకార రంగాల్లో మొత్తం 29 కర్మాగారాలు ఉండగా, ఇందులో కేవలం ఐదు మాత్రమే మనుగడలో ఉండడం గమనార్హం.

గతంలో చెరకుపైనే ఎక్కువగా ఆధారపడే స్థాయిలో రైతులు ఉండేవారు. ఐదేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో చెరకు సాగు బాగానే ఉండేది. అప్పట్లో 18 కర్మాగారాలు పనిచేయడంతో చక్కెర ఉత్పత్తి కూడా మెరుగ్గానే ఉండేది. 82 వేల హెక్టార్లలో చెరకు ఉత్పత్తి కూడా జరిగేది. 2017-18 సీజన్‌లో ఏకంగా 48 లక్షల మెట్రిక్ టన్నుల వరకు క్రషింగ్ జరిగింది. ఇప్పుడు పూర్తిగా పరిస్థితులు తారుమారయ్యాయి. కేవలం ఐదు కర్మాగారాలే పనిచేస్తుండడంతో చాలామంది రైతులు చెరకు సాగు మానేసి, ఇతర పంటలవైపు వెళ్లిపోతున్నారు. అందుకే గతేడాది 22.85 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరనే క్రషింగ్ చేయగలిగారు. అందులో నాలుగు ప్రైవేటు రంగానికి చెందిన కర్మాగారాలే క్రషింగ్ చేశాయి. చోడవరం, తాండవ, ఏటికొప్పాక కర్మాగారాలకు రూ.26 కోట్లకుపైగా బకాయిలు ఉండిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. 2021 సీజన్ వరకు చెల్లింపులు జరిగినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ గతేడాదికి ఇంకా చెల్లింపులు జరగలేదు. దీంతో రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కనిపిస్తోంది. కర్మాగారాల పరిస్థితి బాగోలేకపోవడంతో పనిచేయని వాటిల్లో ఆరు కర్మాగారాల్లో విఆర్‌ఎస్ అమలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిఫార్సులు చేసింది. ఇవన్నీ సహకార రంగంలో ఉన్నవే కావడం విశేషం. దీనిపై గతంలోనే ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం అనేక దఫాలు భేటీలు నిర్వహించి, చివరకు విఆర్‌ఎస్ సిఫార్సుల నిర్ణయం తీసుకుంది. చిత్తూరు, వెంకటేశ్వర, కడప, కోవూరు, జంపని, అనకాపల్లి సహకార కర్మాగారాల్లో పనిచేస్తున్న వారికి విఆర్‌ఎస్ అమలు చేయడం వల్ల రూ.108 కోట్ల వరకు చెల్లించాల్సి వచ్చింది. ఈ చెల్లింపులపై ఉత్తర్వులు వచ్చినప్పటికీ బిల్లులు మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉండడంతో ఉద్యోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది సెప్టెంబరులోనే ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఇంకా నిధులు మాత్రం విడుదల కాకపోవడం గమనార్హం.

పేటియంలో ఆంట్ గ్రూప్ వాటా విక్రయం..!

న్యూఢిల్లీ : జాక్‌మాకు చెందిన ఫిన్‌టెక్ సంస్థ ఆంట్ గ్రూప్ పేటియంలో వాటాలను విక్రయించనుందని రిపోర్టులు వస్తున్నాయి. షేర్ల బైబ్యాక్‌తో పేటియంలో ఆంట్ గ్రూప్ వాటా పెరిగింది. ఇలా పెరిగిన వాటాలను విక్రయించాలని ఆంట్ గ్రూప్ భావిస్తుందని తెలుస్తోంది. షేర్ ధర, రెగ్యులేటరీ సంస్థల అనుమతులను బట్టి ఎంత వాటా విక్రయించాలన్న విషయమై రెండు సంస్థలు ఓ నిర్ణయానికి వస్తాయని సమాచారం. దీనిపై ఇరు సంస్థలు స్పందించలేదు. ఆంట్ గ్రూపు వాటాల అమ్మకాలు జరిగితే ఇప్పటికే గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్న పేటియం షేర్ల పరపతి ఎలా ఉంటుందో వేచి చూడాలి.

ఢిల్లీలో ఇవి క్యాబ్‌లపై ఉబెర్ ఆందోళన

న్యూఢిల్లీ : కేవలం విద్యుత్ వాహన క్యాబ్‌లకు మాత్రమే అనుమతించనున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం చేసిన ప్రకటనపై ఉబెర్ ఆందోళన వ్యక్తం చేసింది. దీని వల్ల నగరంలో లక్ష మందికి పైగా డ్రైవర్ల జీవితంపై ప్రతికూల ప్రభావం పడనుందని పేర్కొంది. ఇది పూర్తిగా క్యాబ్ సర్వీసుల రంగాన్ని మూసివేసేలా ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయం ఉందని తెలిపింది. ఉబర్, ఓలా వంటి రైడ్ హైలింగ్ కంపెనీలు వాడే వాహనాల నియంత్రణకు కొత్త పాలసీ తేనున్నట్లు ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇవిలను మాత్రమే టాక్సీలుగా వాడాలనే నిర్ణయం అమలు సాధ్యం కాదని పేర్కొంది.

తగ్గుతోన్న విదేశీ మారకం నిల్వలు

ముంబయి :ముంబయి : భారత విదేశీ మారకం నిల్వలు వరుసగా మూడో వారంలోనూ పతనమై.. 11 వారాల కనిష్టానికి తగ్గాయి. ఈ నెల 17తో ముగిసిన వారంలో రిజర్వ్ బ్యాంక్ వద్ద ఫారెక్స్ నిల్వలు 5.7 బిలియన్ డాలర్లు తగ్గి 561.27 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతకుముందు ఫిబ్రవరి 10వ తేదీతో ముగిసిన వారానికి 4.5 బిలియన్ డాలర్లు తగ్గి 496.07 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ నెల 17తో ముగిసిన వారానికి బంగారం నిల్వలు కూడా తగ్గుముఖం పట్టాయి. 100 కోట్ల డాలర్ల విలువైన బంగారం నిల్వలు తగ్గి 41.82 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. రూపాయి విలువ మరింత పతనం కాకుండా డాలర్లు విక్రయించడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

సంపాదకీయం

సేవా మూర్తులు!

అర్థరాత్రి ముగ్గురు మిత్రులు కారులో బయల్దేరతారు. అడవి మధ్యలో కారు ఆగిపోతుంది. బాగు చేయడానికి దిగిన ఒకరిని పాము కరుస్తుంది. నురగలు కక్కుతూ పడిపోతాడు. ఆ సమయంలోనే అడవిలోంచి పాముల సిద్ధయ్య వస్తాడు. వైద్యం చేస్తానని తన గుడిసెకి తీసుకెళతాడు. అయితే, వైద్యానికి కావాల్సిన మూలిక ఆ గుడిసెలో కనిపించదు. అంత రాత్రిలోనే సిద్ధయ్య కూతురు దూరంగా వున్న పొదల్లోనుంచి ఆ మూలికను తెస్తుంది. సిద్ధయ్య వైద్యం చేస్తాడు. ఆ మనిషి బతుకుతాడు. తెల్లవారిన తర్వాత మూలికలు తేవడంకోసం పొదల్లోకి వెళ్లిన సిద్ధయ్యను పాము కరుస్తుంది. వెళ్లడానికి బస్సెక్కుతున్న ఆ ముగ్గురిని సహాయం చేయమంటూ సిద్ధయ్య కూతురు వేడుకుంటుంది. మేం ఏం చేయగలం అంటూ... చచ్చే మనిషి కూతురికి ఇరవై రూపాయలిస్తాడు చచ్చి బతికిన మనిషి. సగం ఆస్తి రాసిస్తానన్న వ్యక్తి... ఆ తర్వాత మామూలు మనిషైపోతాడు. ఇది తిలక్ 'నల్లజర్ల రోడ్డు' కథ. ప్రాణం మీదకొచ్చినప్పుడున్న మనిషి ధోరణి... గట్టెక్కిన తర్వాత మారిపోతుంది. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రథమ చికిత్స అందించి, కంటికి రెప్పలా కాపాడుతారు నర్సులు. అయినా వారిది సిద్ధయ్య పరిస్థితే.

'ఇండియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రిక్ నర్సింగ్'లో ప్రచురించిన ఒక అధ్యయనం... నర్సులు అనేక మానసిక రుగ్మతలతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. కోవిడ్ సమయంలో అలుపెరుగని పోరాటం చేసిన వీరు ప్రస్తుతం అలసట, ఒత్తిడి, నిద్రలేమి, నిరాశతోపాటు భయం, కోపోద్రేకం, ఆందోళన వంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. సిబ్బంది కొరత, ఓవర్ టైమ్‌లు, తక్కువ వేతనాలు, అసురక్షిత ప్రదేశాల్లో పనిచేయడం వంటివి వారి సమస్యలకు కారణమౌతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ మహమ్మారి నర్సుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపినట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. రోగులకు సేవలందించడంలో ముందుండే నర్సులకు కనీస మౌలిక సదుపాయాలు కొరవడటం నిర్వివాదాంశం. దీంతో సమస్యల పరిష్కారం కోసం సమ్మెలకు దిగాల్సిన దుస్థితి ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోంది. ఉత్తమ వైద్య సేవలకు ఆదర్శం అని చెప్పుకునే బ్రిటన్‌లో లక్షమంది నర్సులు ఒకేసారి సమ్మెకు దిగడం చరిత్రలో ప్రథమం. ఒక్క భారత్‌లోనే 2024 నాటికి 43 లక్షల మంది నర్సుల అవసరం అని 'నర్సులు, మంత్రసానుల వృత్తి సంబంధిత సంస్థ' తెలిపింది. డబ్ల్యుహెచ్‌ఓ నిబంధనల ప్రకారం... ప్రతి వెయ్యి మందికి ముగ్గురు నర్సులు వుండాలి. కానీ, దేశంలో ఆ సంఖ్య 1.7గానే ఉంది. నర్సుల కొరతను తీర్చడంతోపాటు... ప్రభుత్వ రంగంలో మరిన్ని అవకాశాలు కల్పించాలని ఆ సంస్థ చెబుతోంది.

నర్సులంటే ఎలాంటి పరిస్థితిలోనైనా సంయమనాన్ని కోల్పోకుండా తమ సేవాతత్పరతను చాటుకునే మానవతామూర్తులు. ఎక్కడైనా ఒకరిద్దరు నర్సులు పొరబాట్లు చేసివుండొచ్చు. కానీ, వారి జీవితంలో ఎక్కువ భాగం రోగుల సేవలో గడుపుతుంటారు. ఇటీవల టాలీవుడ్ లోని ఓ ప్రముఖ హీరో నర్సులపై చేసిన కామెంట్ కలకలం రేపిన సంగతి తెలిసిందే. నర్సులపై కించపరిచే వ్యాఖ్యలు, బాడీ షేమింగ్‌కి పాల్పడటం సరైంది కాదు. అంతేకాదు. నర్సుల మాదిరి కొన్ని సేవలను ఎఎన్‌ఎంలు, ఆశాలు అందిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సేవలు అమోఘం. సరైన సౌకర్యాలు లేనిచోట కూడా వైద్య సేవలను అందిస్తున్నారు. అయినప్పటికీ వీరిపట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తూనేవుంది. వారి సేవలను గుర్తించాలి. సమాజంలో వారికి సరైన గుర్తింపునివ్వాలి. 'నల్లజర్ల రోడ్డు'లో చచ్చి బతికిన మనిషిలా కాకుండా... చచ్చైనా తోటివారికి మేలు చేస్తారు మన నర్సమ్మలు. విజయవాడకు చెందిన స్టాఫ్‌నర్సు ఝాన్సీరాణి కరోనా సమయంలో, అత్యవసరవేళల్లో డాక్టర్లతో సమంగా సేవలందించారు. కోవిడ్ సమయంలో భర్త చనిపోయినా, తోడబుట్టిన అక్క మృత్యువుపాలైనా.. వెనకడుగు వేయకుండా, ఆ బాధను పంటిబిగువున నొక్కిపెట్టి రోగులకు సేవలందించారు. అందుకుగానూ ఆమెను 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు-2021' వరించింది. ఇలాంటి ఎందరో త్యాగమూర్తులు, మానవతావాదులు మన నర్సులు. వీరు మన నైటింగేల్స్. వీరిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

మహనీయుల మాట



సమాజం సమస్యలకు స్పందించగలవాడే మంచి శాస్త్రవేత్త.

- జవహర్‌లాల్ నెహ్రూ,
భారత తొలి ప్రధాని.

Jawaharlal Nehru

తెలుగునాట బిజెపి నేతల విన్యాసాలు

ప్రస్తుతం

తెలకపల్లి రవి



ఎ.పి లోనైతే సోము వీర్రాజు నాయకత్వం అడుగడుగునా విభేదాలను ఎదుర్కొంటున్నది. మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అనేక మల్లగుల్లాల తర్వాత టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి నుంచి వచ్చి చేరిన ఎంపీలు, ఇతరులు కూడా తీవ్ర అసంతృప్తితో వున్నారు. టిడిపిని మళ్లీ పెరగనివ్వరాదనేది కేంద్ర బిజెపి వ్యూహమని చెబుతున్నా లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకూ పట్టువిడుపులతో మూడు పార్టీలను గుప్పిట్లో పెట్టుకోవాలనేది వ్యూహంగా వుంది. అయితే విభేదాలు ఎంతవరకూ పోయాయంటే కేంద్ర నాయకుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ మంత్రి పురందేశ్వరి బాహాటంగా వ్యతిరేకించుకునే వరకూ. రాజధాని సమస్యపై పరిపరి విధాల మాట్లాడుతూ ప్రతిష్టంభన పెంచడం ఇందులో భాగమే. విశాఖ సీటుపై కన్నువేసిన బిజెపి ఉక్కు ఫ్యాక్టరీ సమస్యపై ఆత్మరక్షణలో పడినా ఏదో తాత్కాలికంగా వేగం తగ్గించినట్టు చూపించేందుకు పథకాలు వేస్తున్నది.

తెలుగు రాష్ట్రాల న్యాయమైన కోర్కెలు నెరవేర్చని కేంద్ర బిజెపి రాజకీయ వ్యూహాలు, దర్యాప్తు సంస్థల ప్రయోగాలలో మాత్రం ఎత్తుల మీద ఎత్తులు వేస్తున్నది. ప్రధాన పాలక వర్గ పార్టీలను ఇరకాటంలో పెట్టడమే దాని ఏకైక లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇప్పటికే తెలంగాణ గవర్నర్ తమిళిసై కెసిఆర్ బిఆర్‌ఎస్ సర్కారుతో నిత్య ఘర్షణ పెట్టుకుంటుంటే ఎ.పి కి కూడా ఆగమేఘాల మీద సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అబ్దుల్ నజీర్‌ను నియమించింది. తమిళిసై తాను తమిళనాడు బిజెపి నేతనన్న విషయం నిరంతరం గుర్తు చేస్తూనే వున్నారు. అంతేగాక బిజెపి నాయకులతో పోటీపడి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచుతున్నారు. ఎ.పి గవర్నర్‌గా వచ్చిన నజీర్ గతంలో అయోధ్యతో సహా అనేక కీలక కేసుల్లో ఇచ్చిన తీర్పులు బిజెపికి సంతోషం కలిగించిన ఫలితంగానే ఈ పదవి పొందగలిగారన్నది సర్వజన భావన. జగన్ సర్కార్‌కు చెక్ పెట్టడానికే ఆయన వచ్చాడని టిడిపి, బిజెపి చెబుతుంటే వైసీపీ నేతలు మాత్రం అదేమీ లేదని తోసిపుచ్చుతున్నారు. అయితే ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా పోకడలు తెలుసు గనక నిజంగా తేలిగ్గా తీసుకోవడం జరగదు. కొత్త గవర్నర్‌కు ముఖ్యమంత్రి జగన్ ఘనస్వాగత సత్కారాలు జరపగా టిడిపి నేత చంద్రబాబు కూడా కలసి మాట్లాడారు. ఆయన రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యాన్ని దృష్టికి తెచ్చారని అనుకూల మీడియా వార్తలు. కొత్త గవర్నర్ తాను ఇంకా విషయాలు తెలుసుకోవాలని చెప్పినట్టు కూడా అవి పేర్కొన్నాయి.

బిజెపి శత వ్యూహాలు

రాజ్‌భవన్ రాజకీయాలు అలావుంచితే నేరుగా బిజెపి సంస్థాగత వ్యవహారాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఎ.పి లో వెనకబడి వున్నా తెలంగాణలో అధికారానికి వచ్చేస్తామని కొన్నాళ్ల కిందట బిజెపి అగ్రనేతలు కూడా హడావుడి చేశారు. స్వయంగా మోడీ, అమిత్‌షా, అధ్యక్షుడు నడ్డాలు పర్యటించి వెళ్లారు. దక్షిణాదిలో తమ తదుపరి టార్గెట్ తెలంగాణ అని గొప్పలు పోయారు. కాని మునుగోడు ఫలితాల తర్వాత ఇదంతా తారుమారైంది. ఇప్పుడు బిజెపి నేతలెవరూ అధికారంలోకి రావడం గురించి ఆశలు పెట్టుకోలేదు. పదిహేను స్థానాలు తెచ్చుకుంటే ధన్యమని భావిస్తున్నారు. భారీ ఎత్తున ఇతర పార్టీల నుంచి వచ్చి చేరతారని లెక్కలు వేసింది నిజం కాలేదు. ఒక బలమైన సామాజిక వర్గాన్ని చేర్చుకోవాలనుకుంటే వారు కాంగ్రెస్ లోనే కొనసాగే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ లోని పద్నాలుగు మంది ప్రముఖులను ఆకర్షించాలనుకుంటే ఇంతవరకూ వారిని సంప్రదించడమే కుదరలేదట. ఆఖరుకు చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తనే నెమ్మదైపోయారని బిజెపి నేతలంటున్నారు. ఆపరేషన్ ఫామ్‌హౌస్ సుడిగుండం నుంచి సిబిఐ కాస్త విముక్తి కలిగించినా సమస్య మిగిలే వుంది. మరోవైపున తమ చేతిలోని ఈడీ, సిబిఐ, ఐటిలను ఉపయోగించి రోజుకో దాడి చేయిస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం పేరిట బిఆర్‌ఎస్ అధినేత కుమార్తె కవితతో సహా ఆరోపణలలో ఇరికించి ప్రతికూల ప్రచారం కుమ్మరిస్తున్నారు. ఇప్పుడు ఢిల్లీ ఆప్ ముఖ్యమంత్రినీ ఉప ముఖ్యమంత్రినీ కూడా చేర్చారు. ఒక సారా వ్యాపారిని అరెస్టు చేయగా అనేకమందిని విచారిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు తెలిసినా ఆరు వేల కోట్ల మేరకు వివరాలు తమ దగ్గర వున్నా చట్టబద్ధంగా పట్టుకోలేము గనక ఈ కేసును తవ్వితీశామని ఈ మధ్యనే బిజెపి నేత ఒకరన్నారు. ఇదే కేసులో ఎ.పి లో వైసీపీ ఎం.పి మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడినీ, పార్లమెంటరీ నేత విజయసాయిరెడ్డి అల్లుడి తమ్ముడు శరత్ చంద్రారెడ్డినీ కూడా అరెస్టు చేశారు. అడపా దడపా బిఆర్‌ఎస్ నేతల వ్యాపార సంస్థలపై ఆకస్మిక దాడులు జరుపుతూ ఒత్తిడి పెడుతున్నారు. ఈ కేసుల్లో పొరబాట్లే లేవనీ, ప్రతి ఆరోపణా అబద్ధమని ఎవరూ చెప్పరు. కానీ వాటిపై దర్యాప్తు తీరు మాత్రం కేంద్ర సంస్థలపై బిజెపి ఒత్తిడి ఫలితమనేది వాస్తవం. తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహాయకుణ్ని కూడా ఇ.డి విచారించడం, ఎప్పుడో తేలిపోయిన బంగారం స్మగ్లింగ్ కేసునూ సాగదీయడం, కర్ణాటక కాంగ్రెస్ వారిపైన తమిళనాడులో డిఎంకె మంత్రిపైనా సాగే కేసులు...ఇవన్నీ చూస్తే బిజెపి యేతర, వ్యతిరేక పార్టీలనే లక్ష్యంగా చేసుకోవడం స్పష్టంగా తెలుస్తుంది. ఇ.డి, సిబిఐతో సహా ఈ సంస్థల అత్యున్నత బాధ్యులంతా ఎక్స్‌టెన్షన్ పైనే సర్వీసులో వున్నారు. ఆ పొడగింపు పద్ధతే తప్పని సుప్రీంకోర్టులో కేసు నడుస్తున్నది. అందువల్ల ఇదంతా సత్యశోధన న్యాయ సాధన కోసమే జరుగుతున్నదని నమ్మడం కష్టం. ఈ ఆరోపణల మధ్య వారు గనక బిజెపిలో చేరేట్టయితే అంతా గప్‌చిప్. కాకుంటే అప్పుడప్పుడూ నామకార్థంగా కొన్ని దాడులు చేసి వారు అదుపు తప్పిపోకుండా చూస్తుంటారు. ఇంతకంటే అనేక రెట్లు ప్రత్యక్షంగా జరిగిన తెలంగాణ ఆపరేషన్ ఫాంహౌస్ గురించి పట్టించుకోరు! ప్రపంచాన్నే ప్రకంపనలకు గురి చేసిన అదానీ విషయంలో నోరుమెదపరు. ఇలాంటి కారణాలతోనే జగన్ ప్రభుత్వం కేంద్రంతో సహకరించవలసి వస్తున్నదని అత్యధికుల అభిప్రాయం. గత ఎన్నికల సమయంలో సిబిఐ రాకను నిషేధించి మోడీని సవాలు చేసిన తెలుగుదేశం పార్టీ అధినేత కూడా ఇప్పుడు కేంద్రానికి ఫిర్యాదులు చేస్తూ జోక్యాన్ని ఆహ్వానించడం ఇక్కడ కొసమెరుపు.

ఎ.పి, తెలంగాణ పరిణామాలు

ఆలస్యంగానైనా తెలంగాణ ముఖ్యమంత్రి బిజెపితో రాజకీయ పోరాటం ప్రారంభించి బిఆర్‌ఎస్‌గా మారడం దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నది. అయితే ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతీయ పార్టీలు కేంద్ర బిజెపికి దగ్గరగా, విధేయంగా వుంటున్నాయి. తమలో తాము పోట్లాడుకోవడం తప్ప వీరికి ఎ.పి ప్రయోజనాలు, ప్రత్యేక హోదా, లోటు భర్తీ, వెనకబడిన ప్రాంతాల నిధులు, పోలవరం పూర్తి, విశాఖ ఉక్కు పరిరక్షణ వంటి అంశాలపైనైనా కలసి పోరాడాలనే స్పృహ, విధానం ఎంతమాత్రం లేవు. ఈ పరిస్థితిని రాజకీయంగా బిజెపి పూర్తిగా వాడుకుంటున్నది. అయితే ప్రజల్లో మాత్రం వారిపై విముఖత, అసంతృప్తి పూర్తిగా వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపైనా నిరసన వుంది. కాని ఇందులో రాష్ట్రం భాగంపై ఉద్యమాలు తప్ప కేంద్రం జోలికి పోవడానికి టిడిపి, జనసేన సిద్ధంగా లేవు. ఇక జగన్ సర్కారును తీసుకుంటే కేంద్రం ఇచ్చే ఆదేశాలు విధానాలు తు.చ తప్పకుండా పాటించేందుకు అత్యుత్సాహం చూపుతున్నది. గతంలో కెసిఆర్ కూడా నోట్ల రద్దును సమర్థించడంలో బిజెపి నేతల కన్నా ముందుండేవారని ఇక్కడ గుర్తుచేసుకోవాలి. ఉభయులూ కలసి మోడీకి అనుకూలంగా ఓటేసిన సందర్భాలెన్నో. ఇప్పుడు బిఆర్‌ఎస్ మారింది గాని వైసీపీ అదే బాటలో కొనసాగుతున్నది. తెలుగుదేశం స్వంత గెలుపు ఏకైక అవసరంగా ఇటు అటు మారుతోంది. వామపక్షాలతో కలసి నడిచిన పవన్ కళ్యాణ్ ముందే పొత్తు పెట్టుకున్నారు. బిజెపి, టిడిపి, జనసేన మధ్య సమీకరణాలు ఎలా మారతాయనే దానిపైనే ఎడతెగని ఊహాగానాలు అంచనాలలో ముంచి తేలుస్తున్నారు.

స్వతహాగా బిజెపికి తెలుగునాట పెద్ద పునాది లేదు. దానికి తోడు కేంద్రం వివక్ష వారిలో తీవ్ర ఆగ్రహం కలిగిస్తున్నది. ఫలితంగా వున్న బిజెపి పని ఎదురీతగా తయారైంది. అంతర్వేది, రామతీర్థం వంటి సమస్యలు రగిలించాలని చూసినా ఆశించిన స్పందన రాలేదు. తెలంగాణ లోనూ బండి సంజయ్, ఎంఎల్‌ఎ రాజాసింగ్ వంటి వారు పచ్చి మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నా ప్రజలు ఆదరించడం లేదు. టిఆర్‌ఎస్ నుంచి చేరిగెలిచిన ఈటల రాజేందర్ వంటి వారు కూడా జోరు తగ్గించుకోవలసి వచ్చింది. బిఆర్‌ఎస్, వామపక్షాలు గట్టిగా నిలిచి తిప్పికొట్టడం ఇందుకు ప్రధాన కారణం. ఆ వాతావరణం ఎ.పి లో లేదు. బిఆర్‌ఎస్ భవిష్యత్ వ్యూహాలేమిటనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. మునుగోడు ఫలితం తర్వాత మీడియా ఏకపక్షంగా ముగ్గురూ కలసిపోయినట్టే రాసినా ఉభయ కమ్యూనిస్టు పార్టీలూ ఆ కథనాలను తోసిపుచ్చాయి. ఎన్నికల చర్చలు ఇంకా జరగలేదనీ బిఆర్‌ఎస్ మంత్రులూ నాయకులూ కొందరు తోచినట్టు మాట్లాడ్డం సరికాదని స్పష్టం చేశాయి. బిజెపి వ్యతిరేక పోరాటంలో కలసి నడిచినా సమస్యలపైన సర్దుబాట్లపైనా తాము కలసి వ్యవహరిస్తామని గౌరవ ప్రదమైన సంబంధాలే కోరుకుంటామని తేల్చిచెప్పాయి. బిఆర్‌ఎస్, బిజెపిలను సమానంగా చూస్తూ కెసిఆర్ ప్రభుత్వంపై ఎక్కువ కేంద్రీకరిస్తున్న కాంగ్రెస్ అదే అస్పష్టతలోనూ అనైక్యతలోనూ మునిగివుంది. మునుగోడు తర్వాత జోరు తగ్గిన బిజెపి ఎకాఎకిన సర్కారులోకి వచ్చేస్తాననే అతిశయాలు తగ్గించుకోక తప్పలేదు. పైగా ఆ ఫలితం చూశాక పెద్ద నాయకులెవరూ ఇతర పాలక పార్టీల లోంచి బిజెపి లోకి దూకేందుకు ఆసక్తి చూపడం లేదనే వాస్తవం మోడీ అమిత్‌షాలు గ్రహించాల్సి వచ్చింది. టిబిజెపి అసలైన నేత ఎవరనేది కూడా పూర్తిగా తేల్చుకోలేని స్థితి.

బిజెపితో కలిస్తే చేటే

ఎ.పి లోనైతే సోము వీర్రాజు నాయకత్వం అడుగడుగునా విభేదాలను ఎదుర్కొంటున్నది. మాజీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అనేక మల్లగుల్లాల తర్వాత టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి నుంచివచ్చి చేరిన ఎంపీలు, ఇతరులు కూడా తీవ్ర అసంతృప్తితో వున్నారు. టిడిపిని మళ్లీ పెరగనివ్వరాదనేది కేంద్ర బిజెపి వ్యూహమని చెబుతున్నా లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకూ పట్టువిడుపులతో మూడు పార్టీలను గుప్పిట్లో పెట్టుకోవాలనేది వ్యూహంగా వుంది. అయితే విభేదాలు ఎంతవరకూ పోయాయంటే కేంద్ర నాయకుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ మంత్రి పురందేశ్వరి బాహాటంగా వ్యతిరేకించుకునే వరకూ. రాజధాని సమస్యపై పరిపరి విధాల మాట్లాడుతూ ప్రతిష్టంభన పెంచడం ఇందులో భాగమే. విశాఖ సీటుపై కన్నువేసిన బిజెపి ఉక్కు ఫ్యాక్టరీ సమస్యపై ఆత్మరక్షణలో పడినా ఏదో తాత్కాలికంగా వేగం తగ్గించినట్టు చూపించేందుకు పథకాలు వేస్తున్నది. టిడిపి కన్నాను చేర్చుకోవడంలో కనిపించే సామాజిక వ్యూహాన్ని వైసీపీ మరింత ఎక్కువగా ప్రయోగిస్తోంది. కులం మతం ఏది కలసి వస్తుందా అని బిజెపి చూస్తున్నది. పాత నేస్తం బిజెపి, ప్రస్తుత నేస్తం టిడిపి మధ్య జనసేనాని ఊగిసలాడుతూ ఉభయులనూ కలపాలని చూస్తున్నారు. ఆ కోణంలో చూస్తే బిజెపితో కలసి వుండే ఏ పొందిక కూడా రాష్ట్రానికి, దేశానికి మేలు చేస్తుందంటే అంతకన్నా హాస్యాస్పదం వుండదు. కేవలం నవరత్నాలనే గొప్పగా చెబుతూ అనేక అప్రజాస్వామిక పోకడలకు పాల్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కూడా ప్రజలు ఆమోదించేదిగా లేదు. ప్రత్యేకించి ఉద్యోగ ఉపాధ్యాయ రంగాలు ఆర్థిక విధానాలు ప్రజలపై భారాలు రైతుల సమస్యలు తీవ్ర స్థాయికి చేరుతున్నాయి. ఎ.పి సమగ్రాభివృద్ధి, ఆర్థిక సౌష్టవం కోసం కేంద్ర నిరంకుశత్వంపై పోరాటం ఇప్పుడు అనివార్యం. అది నిర్దిష్టంగా ఏ రూపం తీసుకునేది, ఏ శక్తులు ఏ పాత్ర పోషించేది తెలియాలంటే మరికొంత వేచి చూడాలి. ఎందుకంటే మన మీడియాలో కేవలం ప్రాంతీయ పార్టీల ప్రకారం విభజించి చూసే వారు బిజెపి అదృశ్య ప్రభావం అంతకంటే ఎక్కువగా వుందని చెప్పడం లేదు. ఏ కథలు చెప్పినా విభజనానంతర సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్రానికి నష్టం కలిగించే విధానం ఎవరు అనుసరించినా ప్రజలు సహించరు.

★

సంక్షోభంలో రాష్ట్ర చక్కెర పరిశ్రమ

సమస్య

మర్రాపు సూర్యనారాయణ

లక్షల మంది రైతులు, వేల మంది కార్మికులకు ఉపాధిని, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే చక్కెర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంలేదు. ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్రలో...కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తానని వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వాగ్దానం చేశారు. తీరా ముఖ్యమంత్రి అయిన తరువాత ఫ్యాక్టరీల పరిస్థితిపై రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నిపుణులు, మంత్రులతో రెండు కమిటీలు వేశారు. వారు రిపోర్టులు ఇచ్చినా వాటిని బయటపెట్టలేదు.

రాష్ట్రంలో చెరకు పరిశ్రమ సంక్షోభంలో వుంది. ఉన్న 29 చక్కెర కర్మాగారాల్లో 24 మూతపడ్డాయి. 2022-23 చెరకు క్రషింగ్ సీజన్ నాటికి ఐదు ఫ్యాక్టరీలు మాత్రమే క్రషింగ్ చేస్తున్నాయి. సంకిలిలో ప్యారీ, చోడవరంలో కోఆపరేటివ్ ఫ్యాక్టరీ, తాడువాయిలో ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ, ఉయ్యూరులో కెసిపి కర్మాగారం, తిరుపతిలో ఎస్‌ఎన్‌జె ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. వీటికి కూడా స్థాపిత సామర్థ్యానికి సరిపడా చెరకు పంట జోన్ ఏరియాల్లో లేదు. తగినంత చెరకు లేకపోవడం వల్ల వచ్చే క్రషింగ్ సీజన్ నాటికి ప్రస్తుతం నడుస్తున్న ఫ్యాక్టరీల్లో మరికొన్ని మూతపడే అవకాశం ఉంది.

ఒకప్పుడు రాష్ట్రంలో రైతులు 5.5 లక్షల ఎకరాల్లో చెరకు పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం సాగు విస్తీర్ణం 1.5 లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. అనకాపల్లి, విజయనగరం, చిత్తూరు వంటి జిల్లాల్లో బెల్లం తయారీ కోసం అక్కడ కొంత వరకు సాగు ఉన్నా...చక్కెర ఫ్యాక్టరీలపై ఆధారపడే ప్రాంతాల్లో మాత్రం చెరకు పంటను వదులుకొని ఇతర పంటలకు రైతులు మళ్లిపోతున్నారు.

చెరకు బకాయిల చెల్లింపు సమస్య

చెరకు ఏడాది కాలం పంట. విత్తనం వేసిన నాటి నుంచి పెట్టిన మదుపులు తిరిగి రాబట్టుకోవడానికి రైతు ఏడాది ఆగాలి. అప్పుడు ఫ్యాక్టరీలకు చెరకు సరఫరా చేసిన తరువాత కూడా డబ్బులు సకాలంలో రాక, రైతులు ఇక్కట్లు పడుతున్నారు. 'షుగర్ కంట్రోల్ యాక్టు-1966' ప్రకారం రైతులు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన 14 రోజులలోగా డబ్బులు చెల్లించాలి. అలా చెల్లించకపోతే ఆలస్యమైన కాలానికి 15 శాతం వడ్డీ కలిపి చెల్లించాలని చట్టంలో ఉన్నా మిల్లు యాజమాన్యాలు చట్టాన్ని లెక్కచేయడం లేదు. చట్టాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వం ఆ పని చేయలేదు. ఏ సీజన్‌కు డబ్బులు ఆ సీజన్‌లో క్లియర్ చేయకుండా రెండు మూడు సంవత్సరాల తరబడి బకాయిలు చెల్లించకుండా రైతులను తిప్పుతున్న ఫ్యాక్టరీలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. పైగా బకాయిల కోసం ఆందోళనలు చేసిన చెరకు రైతులపైన పోలీసులను ఉసిగొలిపి కేసులు పెట్టిన ఉదంతాలు రాష్ట్రంలో ఉన్నాయి. బొబ్బిలిలో ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 90 మంది రైతులపై పోలీసు కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. ఇందులో 45 మంది మహిళా రైతులు. తిరుపతిలో మయూరా షుగర్ ఫ్యాక్టరీ, చిత్తూరు లోని నేతమ్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో నేటికీ రూ.60 కోట్లు చెరకు బకాయిలు గత మూడేళ్లగా కొనసాగుతున్నాయి. అక్కడ కూడా ఆందోళన చేసిన రైతులపై ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తోంది. డబ్బులు చెల్లించని యాజమాన్యాలను వెనకేసుకొస్తూ షుగర్ కంట్రోల్ యాక్టును ప్రభుత్వమే నీరుగారుస్తోంది.

రాష్ట్ర సలహా ధర లేదు

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది టన్ను చెరకుకు ఎఫ్‌ఆర్‌పి (ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్) రూ. 3,050 ప్రకటించింది. ఈసారి కూడా స్వామినాథన్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదు. ఎఫ్‌ఆర్‌పి కి రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా 'రాష్ట్ర సలహా ధర' (ఎస్.ఎ.పి) ప్రకటించి రైతులను ప్రోత్సహిస్తున్నాయి. మన రాష్ట్రంలో కూడా 2002 సంవత్సరం వరకు ఎస్.ఎ.పి విధానం ఉండేది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎస్.ఎ.పి ని రద్దు చేసింది. ఆ తరువాత దాన్ని పునరుద్ధరిస్తానన్న వై.ఎస్ రాజశేఖరరెడ్డి గాని, ఆ తరువాత వచ్చిన ముఖ్యమంత్రి గాని ఎవ్వరూ ఆ పని చేయలేదు. మన రాష్ట్రం మినహా దేశంలో చెరకు పండిస్తున్న అన్ని రాష్ట్రాల్లోనూ ఎస్.ఎ.పి ఇస్తున్నారు. కేంద్రం ప్రకటించిన ఎఫ్.ఆర్.పి, రాష్ట్ర సలహా ధర (ఎస్.ఎ.పి)తో కలిపి టన్ను చెరకుకు హర్యానాలో రూ. 3,662, పంజాబ్‌లో రూ. 3,874 ఇస్తున్నారు. తమిళనాడులో ఎస్.ఎ.పి రూ. 200 ఇస్తున్నారు. కర్ణాటకలో చెరకు కటింగ్, రవాణా ఖర్చులు ఫ్యాక్టరీ యాజమాన్యాలే చెల్లిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల చెరకు రైతులతో పోల్చితే మన రైతులు టన్నుకు రూ.1000 నష్టపోతున్నారు.

నూతన చెరకు వంగడాల కొరత

కేంద్రం ప్రకటించిన ఎఫ్.ఆర్.పి ధర రూ.3,050 చెల్లించడానికి పంచదార 10.25 శాతం రికవరీకి ముడిపెట్టింది. గత సంవత్సరం మన రాష్ట్రంలో షుగర్ ఫ్యాక్టరీల సగటు రికవరీ 9.5 శాతంగా ఉంది. రికవరీ తగ్గిన పాయింట్ల నిష్పత్తిలో ఎఫ్.ఆర్.సిలో కోతపెట్టి ప్రస్తుత సీజన్‌లో టన్నుకు రూ.2,750 యావరేజిగా రాష్ట్రంలో చెల్లిస్తున్నారు. అంటే రాష్ట్రంలో కనీసం ఎఫ్.ఆర్.పి ధర కూడా చెరకు రైతులు పొందలేకపోతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 13-11.5 శాతం రికవరీ సాధిస్తున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన చెరకు వంగడాలను అభివృద్ధి పరిచి రైతాంగానికి అందిస్తూ రికవరీలను సాధిస్తున్నారు. మన రాష్ట్రంలో ఆ ప్రయత్నం కొరవడింది. రైతుకు టన్నేజీ, రికవరీ ఇచ్చే నూతన వంగడాలను అందించడంలో వెనుకబడిపోతున్నాము.

చక్కెర పరిశ్రమ పాలసీ ఏది?

లక్షల మంది రైతులు, వేల మంది కార్మికులకు ఉపాధిని, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే చక్కెర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంలేదు. ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్రలో.. కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తానని వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వాగ్దానం చేశారు. తీరా ముఖ్యమంత్రి అయిన తరువాత ఫ్యాక్టరీల పరిస్థితిపై రెండు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. నిపుణులు, మంత్రులతో రెండు కమిటీలు వేశారు. వారు రిపోర్టులు ఇచ్చినా వాటిని బయటపెట్టలేదు. రాష్ట్రంలో వున్న 9 కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలలో (చోడవరం మినహా) 8 షుగర్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఇందులో 6 ఫ్యాక్టరీలను పునరుద్ధరించే ఆలోచనతో రిపోర్టులు తెప్పించుకున్నారు. ముందుగా శ్రీవెంకటేశ్వర, కడప, అనకాపల్లి ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామంటూనే 6 ఫ్యాక్టరీలకు లిక్విడేట్ ప్రకటించి రైతుల ఆశలపై నీళ్లు చల్లారు.

రాష్ట్రంలో ప్రధానమైన చెరకు పంట కనుమరుగు కాకుండా కాపాడుకోవాలి. ఉపాధి, ఆదాయ వనరుగా ఉన్న చెరకు పరిశ్రమను రాష్ట్రంలో అభివృద్ధి పరుచుకోవాలి. సరైన చక్కెర పరిశ్రమ విధానాన్ని రూపొందించి అమలు చేయాలి. అందుకు రైతులు, కార్మికులు ఫ్యాక్టరీల వారీగా సంఘటితమై రాష్ట్ర స్థాయి ఉద్యమం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే మార్గం.

(వ్యాసకర్త ఎ.పి చెరకు రైతు సంఘం కార్యదర్శి)

జనవాక్యం

చలివేంద్రాలు అవసరం

ఈ ఏడాది ఫిబ్రవరి మాసం నుండే ఎండలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. క్రమక్రమంగా ఎండలు మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు దాతల సహాయంతో చలివేంద్రాల పేరిట చల్లని కుండలలో ఉచిత మంచినీటిని సరఫరా చేయడం రివాజు. కొత్త కుండలలో మంచి నీటిని నింపడం వలన నీరు చల్లగా ఉంటుంది. వీటిని ఎక్కువగా రద్దీగా ఉండే కూడలి ప్రదేశాలలో ఏర్పాటు చేస్తారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ఇతర గ్రామస్తులకు, ముఖ్యంగా పేదవారికి ఈ చలివేంద్రాలు ఎంతో ఉపకరిస్తాయి. సామాజిక కార్యకర్తలు, దాతలు, ప్రభుత్వాలు వీటి ఏర్పాటుకు కృషి చేయాలి.

- భానోజీ బిల్లా, మర్రిపాలెం, వైజాగ్.

అంబులెన్స్‌లకు అనారోగ్యం

రాష్ట్ర వ్యాప్తంగా 108 అంబులెన్సులు మరమ్మతులకు నోచుకోక మూల పడుతున్నాయి. ఉన్న కొద్ది అంబులెన్సులు సమయానికి రాక ఎంతోమంది పేదలు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మహాప్రస్థానం అంబులెన్సులు అసలు పనిచేయడం లేదు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చామని చెప్పడంలో నిజం లేదు. క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు లోపభూయిష్టంగా ఉన్నాయి. బిల్లులు, వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం సేవల్లో లోపానికి మూల కారణం. పరిస్థితి మెరుగు పడాలంటే ప్రభుత్వం వైద్య శాఖలో పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి.

- జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

రిమాండ్ ఖైదీ మృతి

ప్రజాశక్తి –అడ్డతీగల (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అడ్డతీగల మండలం బొడ్డగండి గ్రామానికి చెందిన కన్నెటి రాజబాబు శుక్రవారం తెల్లవారుజామున ఆసుపత్రిలో మృతి చెందారు. అనారోగ్యంతో ఉన్న రాజబాబును రాజమండ్రి ఆస్పత్రిలో చేర్పించగా, మృతి చెందినట్లు హస్పటల్ వర్గాలు చెప్పాయని, మృతుడు అన్నయ్య రామకృష్ణ తెలిపారు. రాజబాబు మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆయన చెప్పారు.

కార్మికులను ఆదుకోకుంటే పోరాటం

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు
- గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

రోడ్డున పడిన చిలకపాలెం టోల్ ప్లాజా కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉపాధి కల్పించి ఆదుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం టోల్ ప్లాజా కార్మికుల పనిలో కి తీసుకోవాలని కోరుతూ శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపాలెం టోల్ ప్లాజా ఎత్తి వేయడంతో 2007 నుంచి పనిచేస్తున్న 106 మంది కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. వీరికి మడపాం, నాతవలస టోల్ ప్లాజాల్లో వెంటనే ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. టోల్ ప్లాజాను అర్ధాంతరంగా 2022 డిసెంబర్ 7న ఎత్తివేసి ఇక్కడి ఆదాయం నాతవలస, మడపాం టోల్ ప్లాజాలకు సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు 15ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను అక్కడ సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు దూరంగా అనకాపల్లి, విశాఖపట్నం వంటి సుదూర ప్రాంతాల టోల్ ప్లాజాల్లో 60మంది కార్మికులను వెళ్లాలని చెప్పడం అన్యాయమని అన్నారు. నేషనల్ హైవే అధికారులు కార్మికులను రెండు టోల్ ప్లాజాల్లో సర్దుబాటు చేసే విధుల్లో కొనసాగించాలని, గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని, కార్మికుల సమస్య పరిష్కరించాలని కోరుతూ అధికారులు, స్పీకర్, రెవెన్యూశాఖ మంత్రి, ప్రజా ప్రతినిధులను కలిసి కార్మికులు విన్నవించినా నేటికీ పరిష్కారం లభించకపోవడం దారుణమన్నారు. కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా తొలగించడంతో రోడ్డున పడ్డారని వారి కుటుంబాలు ఏ విధంగా బతకాలని, వారి పిల్లలు స్కూల్ ఫీజులు ఏ విధంగా చెల్లించాలని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నాయకులు కె.నాగమణి, అల్లు సత్యనారాయణ, చిలకపాలెం టోల్ ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డి.వి.నర్సింహులు, వి.వెంకటరమణ, ఎ.వి.ఆర్.మూర్తి, టి.అప్పారావు, పి.రాము, బి.రాజేశ్వరరావు, మురళీ, శంకరనారాయణ పాల్గొన్నారు.

పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణ ఆపండి

- పోర్టు గేటు వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి – కలెక్టరేట్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పోర్టు ఆసుపత్రి, బెర్తుల ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తూ షిప్పింగ్ సెక్రటరీ ప్రకటన చేయాలని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. షిప్పింగ్ సెక్రటరీ శనివారం విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సందర్భంగా పోర్టు గేటు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఇదివరకటి షిప్పింగ్ సెక్రటరీ పర్యటనకు వచ్చిన సందర్భంగా సార్లు నాలుగు పోర్టు బెర్తులను ప్రైవేటీకరణ చేశారన్నారు. ఐజిని అదాని పోర్టుకు అప్పజెప్పడం తాజా పర్యటన ముఖ్య ఉద్దేశంగా ఉందన్నారు. పోర్టు ఆధీనంలోని బెర్తులు, హాస్పిటల్, పోర్టు కాలనీ, కళ్యాణ మండపం తదితర వాటిని టెండర్లు పిలిచినా ఎవరూ రాకపోవడంతో ఎలా అయినా పోర్టు ఆస్తులను ప్రైవేటీకరణ చేయాలని సర్వే చేయడానికి షిప్పింగ్ సెక్రటరీ వచ్చారన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే ఏ రకంగా పర్యటనకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తారని ప్రశ్నించారు. షిప్పింగ్ సెక్రటరీ పోర్టు ఆస్తులు, బెర్తులు, హాస్పిటల్, కళ్యాణ మండపాలను ప్రైవేటీకరణ చేయడం లేదని, ఐజిని అదాని గంగవరం పోర్టుకు అప్పజెప్పమని ప్రకటన చేయాలన్నారు. లేనిపక్షంలో మిగతా కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకొని స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం తరహా ఉద్యమం కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి నిరసనలూ తెలుపకుండా గొంతు నొక్కే విధానం నేడు ఏర్పడిందన్నారు. విశాఖ పోర్టు ఆదాయం తగ్గించి, అదానీ ఆదాయాన్ని పెంచడానికి గంగవరం పోర్టుకు ఇండియన్ ఆయిల్ కంపెనీ టెండర్లు ఇవ్వడాన్ని చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివిఎస్.పద్మనాభరావు, లక్ష్మణరావు, జక్కన్న, సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, ఎల్లారావు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతి చర్చల కోసం చైనాను ఆహ్వానించిన రష్యా

మాస్కో : శాంతి చర్చల కోసం చైనాను ఆహ్వానిస్తున్నట్లు రష్యా ప్రకటించింది. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా... రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా మాట్లాడుతూ.. 'యుద్ధాన్ని ఆపేందుకు శాంతి చర్చలకు ప్రయత్నించాలని మా మిత్ర దేశం చైనా ఇచ్చిన సలహాను మేము విలువైనదిగా భావిస్తున్నాం. శాంతి చర్చల కోసం చైనాను సాదరంగా ఆహ్వానిస్తున్నాం. ఐక్యరాజ్యసమితి సూత్రాలకు కట్టుబడి రష్యా ప్రవర్తిస్తోంది. చైనా మాదిరిగానే మేము కూడా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ద్వారా అనధికారికంగా ఉన్న ఏవైనా నియంత్రణ చర్యల్ని చట్టవిరుద్ధంగా పరిగణిస్తాం.' అని ఆమె అన్నారు. యుద్ధం ఆపేందుకు ప్రత్యేక మిలిటరీ లక్ష్యాల పరిష్కారానికి, రాజకీయ దౌత్య మార్గాలకు రష్యా సిద్ధంగా ఉందని ఆమె స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లో సైనికీకరణ నిర్వీర్యం చేయాలనే డిమాండ్ చేయడంతోపాటు, ఉక్రెయిన్‌లో రష్యన్ మాట్లాడే జనాభా హక్కులను గౌరవించాలని పిలుపునిచ్చారు. రష్యాపై ఉన్న అన్ని అంతర్జాతీయ ఆంక్షలు, వ్యాజ్యాలను తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

ప్రజాశక్తి–విజయనగరం

రాష్ట్రంలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేసినా, అనధికారికంగా బాలలను దత్తత తీసుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధికారులను ఆదేశించారు. శనివారం మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బాల్య వివాహాలు జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, బాలలతో పనిచేస్తున్న సంస్థలు సంఘాలు నిరంతరం పర్యవేక్షణ చేసి పూర్తి స్థాయిలో నిర్మూలించాలని సూచించారు. బాల్య వివాహం చేసిన వారిపై పోలీస్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. బాలలను దత్తత తీసుకున్న వారు ఆ పిల్లలను సక్రమంగా పెంచుతున్నారా? లేదా? అన్నది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తనిఖీ చేయాలన్నారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శులతో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి సచివాలయంలోనూ బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన తదితర వాల్‌పోస్టర్లను ప్రదర్శించాలని చెప్పారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమ సమితి జిల్లా చైర్‌పర్సన్ జి.హిమబిందు, సభ్యులు భవాని, సుధారాణి పట్నాయక్, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ, సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయకర్త బి.రామకృష్ణ, శిశుగృహ మేనేజర్ త్రివేణి, లైజన్ ఆఫీసర్ విద్య, వన్ స్టాపర్ మేనేజర్ సాయి విజయలక్ష్మి, బాలసదన్ గీత, నాగరాజు, సంధ్య, సరస్వతి, వెంకటరావు, గృహహింస కేంద్ర నుంచి మాధవి, చైల్డ్‌లైన్ నుంచి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

గోడకూలి ఎల్‌కెజి విద్యార్థి మృతి

ప్రజాశక్తి – నూజివీడు (ఏలూరు జిల్లా)

ఓ ప్రయివేటు పాఠశాలలోని మరుగుదొడ్డి గోడ కూలి ఎల్‌కెజి చదువుతున్న బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లి మండలం ఈదులుగూడేనికి చెందిన కందుల నీలమణికంఠ(5) నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలోని విజ్‌డమ్ ప్రయివేటు పాఠశాలలో ఎల్‌కెజి చదువుతున్నాడు. మధ్యాహ్నం విరామం సమయంలో నీలమణికంఠ టాయిలెట్ కోసం మరుగుదొడ్డివైపు వెళ్లాడు. ఈ తరుణంలో ఒక్కసారిగా గోడ కూలి బాలుడిపై పడింది. ఈ ప్రమాదంలో నీలమణికంఠ అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న మరో ఇద్దరు చిన్నారులు గాయాలపాలయ్యారు. బాలుడి మృతదేహాన్ని నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నూజివీడు ఎస్ఐ శివనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పాఠశాల నిర్వాహకులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

బ్యాంక్ ఆఫ్ బరోడా

ఏలూరు రోడ్ బ్రాంచ్, # 29-5-21, చెరుకుపల్లివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520002, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు మాత్రమే)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు (1) Appendix IV ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏలూరు రోడ్ బ్రాంచ్, విజయవాడ** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేది నుండి 60 రోజులలోపు ఆ నోటీసులలో పేర్కొనబడిన మొత్తములను మరియు వాటిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా క్రింద పేర్కొనబడిన ఋణగ్రహీతలను/హామీదారులను కోరుతూ దిగువ తెలిపిన తేదిలలో డిమాండ్ నోటీసులను జారీచేశారు.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది.20-02-2023న** దిగువ పేర్కొన్న ఆస్థిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులకు సంభందించిన ఏవిధమైన లావాదేవీలైనా వారి పేర్ల ఎదురుగా పేర్కొనబడిన బాకీల మొత్తములకు మరియు వాటిపై వడ్డీకి మరియు ఇతర ఖర్చులకు **బ్యాంకు ఆఫ్ బరోడా, ఏలూరు రోడ్ బ్రాంచ్, విజయవాడ** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

	ఋణ గ్రహీతలు / హామీదార్ల పేర్లు మరియు చిరునామా
1	**ఎ) ఋణగ్రహీత పేరు: 1. శ్రీమతి ఇంజమూరి వెంకట సునీత (ఋణగ్రహీత) & 2. శ్రీ ఇంజమూరి వెంకటేశ్వరరావు (సహ-ఋణగ్రహీత) నివాసం** : ఫ్లాట్ నెం.516, 4వ ఫ్లోర్, సన్‌ఫ్లవర్ స్ప్లెండర్ సిటీ అపార్ట్‌మెంట్, చల్లపల్లి, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్ – 521126. **బి) బకాయి మొత్తం : రూ.10,75,353.43 పై** (అక్షరాల పది లక్షల డెబ్బై ఐదు వేల మూడు వందల యాభై మూడు రూపాయల నలభై మూడు పైసలు మాత్రమే) + వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలు మొదలగునవి. **సి) డిమాండ్ నోటీసు తేది : 28-11-2022.** **డి) స్థిరాస్తి వివరములు: ప్రైమరీ సెక్యూరిటీ – ఆస్తి వివరాలు: షెడ్యూలు -ఎ:** కృష్ణాజిల్లా, చల్లపల్లి, సబ్ రిజిస్ట్రీ, చల్లపల్లి గ్రామ పంచాయితీ పరిధి, చల్లపల్లి గ్రామం, సన్ ఫ్లవర్ కాలనీ దక్షిణం వైపు, పాత పంచాయితీ బ్లాక్ నెం.5, కొత్త బ్లాక్ నెం.7, సమీప డోర్ నెం.7-90, ఆర్.ఎస్.నెం.217/7, 220/5, 220/6, 222/1, 222/4, 245/3లోని ఎ.3.72 లేదా 18004.80 చ॥గ॥ల విస్తీర్ణం గల నివాస ఖాళీ స్థలం అందు గల "సన్ ఫ్లవర్ స్ప్లెండర్ సిటీ" అపార్ట్‌మెంట్ ఆస్తి. **హద్దులు: తూర్పు:** వరదా ప్రభాకర రావు మరియు ఇతరులకు చెందిన భూమి మరియు 40 అ॥ల వెడల్పు రోడ్డు, **దక్షిణం:** బొందలపాటి వెంకట రాజ్యలక్ష్మి మరియు ఇతరులకు చెందిన భూమి, **పడమర:** వక్కలగడ్డ రాఘవులు, కామిశెట్టి ఆంజనేయులు మరియు బొందలపాటి వెంకట రాజ్యలక్ష్మి గార్లకు చెందిన భూమి, **ఉత్తరం:** ఘంటా ఝాన్సీ లక్ష్మి, సన్‌ఫ్లవర్ కాలనీ రోడ్, బత్తుల రత్తయ్య మరియు మేకా రజని గార్లకు చెందిన భూమి. **షెడ్యూలు – బి:** పైన తెలిపిన షెడ్యూలు ఎ ఆస్తి 18004.80 చ॥గ॥లు లేదా 3.72 ఎకరాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం, దీనిలో 55.00 చ॥గ॥లు లేదా 45.98 చ॥మీ॥ల అనిర్దేశ్యపు ఉమ్మడి హక్కులతో 1012.50 చ॥అ॥ల ప్లింత్ ఏరియా + 153.5 చ॥అ॥ల బాల్కనీ మరియు కామన్ ఏరియాలు, 100 చ॥అ॥ల కార్ పార్కింగ్‌తో గల "సన్ ఫ్లవర్స్ స్ప్లెండర్ సిటీ" నాల్గవ అంతస్తులో అన్నీ సదుపాయాలు, ఉమ్మడి హక్కులు ఉమ్మడి సౌకర్యాలు మరియు సౌకర్యాలతో బి-షెడ్యూలు ఫార్ములో గల ఫ్లాట్ నెం.516 **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై మరియు ఉమ్మడి వరండా, **ఉత్తరం:** లిఫ్ట్ మరియు ఓపెన్ టు స్కై.
2	**ఎ) ఋణగ్రహీత పేరు: శ్రీ సునీల్ కుమార్ బాపట్ల, తండ్రి :లేటు శ్రీ బాపట్ల దాస్, నివాసం:** డి.నెం.19-7-6/2, ఆర్.కె. నిలయం, కంసాలిపేట మెయిన్ రోడ్డు, విజయవాడ – 520001. **బి) బకాయి మొత్తం : రూ.55,79,903.29 పై** (అక్షరాల యాభై ఐదు లక్షల డెబ్బై తొమ్మిది వేల తొమ్మిది వందల మూడు రూపాయల ఇరవై తొమ్మిది పైసలు మాత్రమే) + వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలు మొదలగునవి. **సి) డిమాండ్ నోటీసు తేది : 10-10-2022.** **డి) స్థిరాస్తి వివరములు:** కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ & మండలం, గొడవర్రు గ్రామం & గ్రామ పంచాయితీ, సర్వే నెం.334/7, ప్లాట్ నెం.50, సమీప డోర్ నెం.7-91లోని 150 చ॥గ॥లు లేదా 125.41 చ॥మీ॥ల విస్తీర్ణంలో క్రింది అంతస్తుతో గల ఆర్‌సిసి భవనం అన్నీ సదుపాయాలు మరియు అన్నీ ఈజుమెంట్ హక్కులతో కలదు. **హద్దులు: తూర్పు:** 33 అ॥ల వెడల్పు రోడ్డు – 30 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం.49 – 45 అ॥లు, **పడమర:** ప్లాట్ నెం.31 – 30 అ॥లు, **ఉత్తరం:** ప్లాట్ నెం.31 – 45 అ॥లు.,

తేది : 20-02-2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు రోడ్ బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ బరోడా

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

బ్యాంక్ ఆఫ్ బరోడా

ఏలూరు రోడ్ బ్రాంచ్, # 29-5-21, చెరుకుపల్లివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ - 520002, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు మాత్రమే)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు (1) Appendix IV ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, ఏలూరు రోడ్ బ్రాంచ్, విజయవాడ** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేది నుండి 60 రోజులలోపు ఆ నోటీసులలో పేర్కొనబడిన మొత్తములను మరియు వాటిపై వడ్డీతో తిరిగి చెల్లించవలసిందిగా క్రింద పేర్కొనబడిన ఋణగ్రహీతలను/హామీదారులను కోరుతూ దిగువ తెలిపిన తేదిలలో డిమాండ్ నోటీసులను జారీచేశారు.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది.21-02-2023న** దిగువ పేర్కొన్న ఆస్థిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ముఖ్యంగా ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులకు సంభందించిన ఏవిధమైన లావాదేవీలైనా వారి పేర్ల ఎదురుగా పేర్కొనబడిన బాకీల మొత్తములకు మరియు వాటిపై వడ్డీకి మరియు ఇతర ఖర్చులకు **బ్యాంకు ఆఫ్ బరోడా, ఏలూరు రోడ్ బ్రాంచ్, విజయవాడ** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

	ఋణ గ్రహీతలు / హామీదార్ల పేర్లు మరియు చిరునామా
1	**ఎ) ఋణగ్రహీత పేరు: శ్రీమతి దండె వెంకట రాజేశ్వరి, భర్త : శ్రీ దండె వీరాస్వామి, మరియు సహ-ఋణగ్రహీత : శ్రీ దండె వీరాస్వామి, తండ్రి : శ్రీ దండె సుబ్బారావు, నివాసం** : డి.నెం.12-457/31, ఫ్లాట్ నెం.511, 4వ ఫ్లోర్, మారుతి ఎన్‌క్లేవ్, హెచ్.పి. పెట్రోల్ బంక్ దగ్గర, తాడేపల్లి టౌన్, మున్సిపాలిటీ, గుంటూరు జిల్లా., **బి) బకాయి మొత్తం : రూ.35,85,502.42 పై** (అక్షరాల ముప్పై ఐదు లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రెండు రూపాయల నలభై రెండు పైసలు మాత్రమే) డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత ఋణగ్రహీత **తేది.30.12.2022న రూ.42,000/-**లు జమచేసినారు. ప్రస్తుత బకాయి **రూ.35,43,502.42 పై** (అక్షరాల ముప్పై ఐదు లక్షల నలభై మూడు వేల ఐదు వందల రెండు రూపాయల నలభై రెండు పైసలు మాత్రమే) + వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలు మొదలగునవి. **సి) డిమాండ్ నోటీసు తేది : 20-10-2022.** **డి) స్థిరాస్తి వివరములు: ప్రైమరీ సెక్యూరిటీ – ఆస్తి వివరాలు: షెడ్యూలు -ఎ:** గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, తాడేపల్లి మండలం, తాడేపల్లి మున్సిపాలిటీ, తాడేపల్లి టౌన్, ఆర్.ఎస్.నెం.113, తదుపరి ఆర్.ఎస్.నెం.113/1, డి.నెం.12-457/31లోని ఎ.1.00 సెంట్లు లేదా 4840 చ॥గ॥ల స్థలం., దీనిలో 45 చ॥గ॥లు లేదా 37.62 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణం గల స్థలం అన్నీ సదుపాయాలు మరియు ఈజీమెంట్ హక్కులతో కలదు. **హద్దులు: తూర్పు:** లక్కీ రోడ్ వేస్ & ఇతరులకు చెందిన ఆస్తి, **దక్షిణం:** 60 అ॥ల వెడల్పు పంచాయితీ రోడ్డు, **పడమర:** బి. వెంకటరెడ్డి గారికి చెందిన ఆస్తి, **ఉత్తరం:** పెట్రోలు బంక్. **షెడ్యూలు – బి:** పైన తెలిపిన షెడ్యూలు ఎ ఆస్తిలోని గుంటూరు జిల్లా, తాడేపల్లి టౌన్, మున్సిపాలిటీ, హెచ్.పి. పెట్రోల్ బంక్ దగ్గర, నిర్మించిన మారుతి ఎన్‌క్లేవ్ అను పేరు గల అపార్ట్‌మెంట్, 4వ అంతస్తులోని రెండు బెడ్ రూమ్‌లతో గల ఫ్లాట్ నెం.511 అన్నీ సదుపాయాలు మరియు అన్నీ ఈజీమెంట్ హక్కులతో కలదు. **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై & ఫ్లాట్ నెం.510, **పడమర:** ఉమ్మడి వరండా, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై & ఫ్లాట్ నెం.512.
2	**ఎ) ఋణగ్రహీత పేరు: 1. శ్రీ దండె వీరాస్వామి (ఋణగ్రహీత) & 2. శ్రీమతి దండె వెంకట రాజేశ్వరి (సహ-ఋణగ్రహీత) నివాసం** : డి.నెం.12-457-3-2, ఫ్లాట్ నెం.511, మారుతి ఎన్‌క్లేవ్, తాడేపల్లి, గుంటూరు జిల్లా – 522501. **బి) బకాయి మొత్తం : రూ.25,23,931.52 పై** (అక్షరాల ఇరవై ఐదు లక్షల ఇరవై మూడు వేల తొమ్మిది వందల ముప్పై ఒక్క రూపాయల యాభై రెండు పైసలు మాత్రమే) + వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలు మొదలగునవి. **సి) డిమాండ్ నోటీసు తేది : 17-11-2022.** **డి) స్థిరాస్తి వివరములు: ప్రైమరీ సెక్యూరిటీ – ఆస్తి వివరాలు: షెడ్యూలు -ఎ:** గుంటూరు జిల్లా, మంగళగిరి ఎస్ఆర్ఓ, తాడేపల్లి మండలం, ఉండవల్లి గ్రామ పంచాయితీ ఏరియా, డి.నెం.58/2, బ్లాక్ నెం.1, డోర్ నెం.1-42,43,44లోని 490.5 చ॥గ॥లు లేదా 410.10 చ॥మీ॥ల స్థలం., దీనిలో 49.49 చ॥గ॥లు లేదా 40.54 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణం గల స్థలం అన్నీ సదుపాయాలు మరియు ఈజీమెంట్ హక్కులతో కలదు. **హద్దులు: తూర్పు:** పంచాయితీ బజారు, **దక్షిణం:** కోదండ రామాలయం యొక్క ప్రహరీ గోడ, **పడమర:** మట్టా ప్రసాద్ మరియు ఇతరుల ఆస్తి, **ఉత్తరం:** శిగిరిశెట్టి అనిల్ గారి ఆస్తి, **మరలా తూర్పు** : శిగిరిశెట్టి సుబ్బారావు గారి ఆస్తి, **మరలా ఉత్తరం** : శిగిరిశెట్టి సుబ్బారావు గారి ఆస్తి, **షెడ్యూలు – బి:** పైన తెలిపిన షెడ్యూల్-ఎ ఆస్తిలోని "శ్రీ సాయి రెసిడెన్సీ" అను పేరు గల గ్రూప్ హౌస్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులోని 936 చ॥అ॥లు కామన్ ఏరియా మరియు 100 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియాతో గల స్థలం అన్ని సదుపాయాలు మరియు ఈజీమెంట్ హక్కులతో గల నివాస ఫ్లాట్ నెం.101. **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి వరండా, మెట్లు, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

తేది : 21-02-2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : ఏలూరు రోడ్ బ్రాంచ్ బ్యాంక్ ఆఫ్ బరోడా

Piramal Capital & Housing Finance

పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

(గతంలో దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్)

జాతీయ కార్యాలయం: పిసిహెచ్ఎఫ్ఎల్, హెచ్‌డిఐఎల్ టవర్స్, బి-వింగ్, 6వ & 8వ అంతస్తు, అనంత్ కానెకర్ మార్గ్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.

బ్రాంచి కార్యాలయం: డోర్ నం.7-1-615, 616& 617/ఎ, ఇంపీరియల్ టవర్స్, 4వ అంతస్తు, యూనిట్స్: 1,2&8, అమీర్‌పేట్ మెయిన్ రోడ్డు, హైదరాబాద్-500016, టి.ఎస్.

అనుబంధం-4 రూల్ 8(1) స్వాధీనతా ప్రకటన

2) సదరు చట్టం యొక్క 13(13) సెక్షన్ ప్రకారము, ఈ నోటీసు పొందిన అనంతరము మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు. సదరు సెక్షన్ యొక్క ఏ విధమైన ఉల్లంఘన జరిపినా తీవ్ర పరిణామాలకు గురిఅవుతారు.

3) ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) లోని నిబంధనలు గమనించగలరు.

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, లబ్బీపేట బ్రాంచి

SBI **భారతీయ స్టేట్ బ్యాంక్**

ఎస్ఎమ్ఇ మంగళగిరి శాఖ (63653), ఊర్వశి థియేటర్ ప్రక్కన, జిటి రోడ్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522 503

స్వాధీనత ప్రకటన

APPENDIX IV రూల్ 8(1) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002, (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలంగా,సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002& సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **భారతీయ స్టేట్ బ్యాంక్, మంగళగిరి శాఖ (శాఖ కోడ్-1011)** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు నోటిసు లో పేర్కొన్న బకాయి **తేది 15.12.2022 నాటికి రూ.5,04,15,668.09 పై (అక్షరాలా ఐదు కోట్ల నాలుగు లక్షల పదిహేను వేల ఆరు వందల అరవై ఎనిమిది రూపాయల తొమ్మిది పైసలు మాత్రమే)** తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు : మెస్సర్స్ టైటాన్ రెడి మిక్స్ కాంక్రీట్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు మేనేజింగ్ పార్ట్‌నర్ : శ్రీ మాచవరపు రవి కుమార్, తండ్రి : జాన్,** ఫ్లాట్ నెం.502, శ్రీ కేశవ హైట్స్, న్యూ పి & టి కాలనీ, పటమట, వార్డు 54, విజయవాడ-520010. **మరొక చిరునామా :** సర్వే నెం.197/1, ఇప్పటం రోడ్ దగ్గర, ఆత్మకూరు, మంగళగిరి, గుంటూరు-522302. **పార్ట్‌నర్స్ : 1. శ్రీ గాజుల వెంకట రమణ, తండ్రి : జి సూర్య ప్రకాశరావు,** విల్లా నెం.4, ఎస్‌ఎల్‌వి లైలా గ్రీన్ మేడాస్, ముస్తాబాద రోడ్, కేశరపల్లి, కృష్ణా జిల్లా-521102. **2. శ్రీ గన్నే వెంకట సుబ్బారావు, తండ్రి : జి రామ కోటయ్య,** డి.నెం.3-45, చిన్న ఓగిరాల, ఉయ్యూరు, పిన్-521246. **3. శ్రీ క్రాప కుటుంబరావు, తండ్రి : కె వెంకటేశ్వరరావు,** డి.నెం.2-7, చిన్న ఓగిరాల, ఉయ్యూరు-521246. **హామీదారు : శ్రీమతి గాజుల నాగవల్లి, భర్త : జి వెంకట రమణ,** డి.నెం.48-16-9ఇ, ఫ్లాట్ నెం.4ఎఫ్1, శకుంతల రెసిడెన్సీ, నాగార్జున నగర్, విజయవాడ-522010 వార్లను కోరుతూ **తేది.15-12-2022 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు.

ఋణగ్రహీతలు/హామీదారులు సదరు ఋణాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సదరు **రూల్స్‌లో 8** తో చదివే సదరు యాక్టులోని సెక్షన్**13(4)** క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ సంతకందారు బ్యాంకునకు తనఖా ఉంచిన దిగువ వివరించిన ఆస్తిని **తేది.20.02.2023 న స్వాధీనం** చేసుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలకు/ హామీదారులకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎవ్వరు ఎట్టి లావాదేవీలు జరుపరాదు. సదరు ఆస్తులకు సంబంధించిన ఎట్టి లావాదేవీలైనను **రూ.5,34,42,691.25 పై (అక్షరాలా ఐదు కోట్ల ముప్పై నాలుగు లక్షల నలభై రెండు వేల ఆరు వందల తొంభై ఒక్క రూపాయల ఇరవై ఐదు పైసలు మాత్రమే)** మరియు **తేది.17-02-2023** నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥నవి **భారతీయ స్టేట్ బ్యాంక్, మంగళగిరి శాఖ (శాఖ కోడ్-1011) (ప్రస్తుతము ఎస్ఎమ్ఇ మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది)** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించగలరు.

బ్యాంక్ వారికి తనఖా ఉంచిన స్థిరాస్తుల వివరములు

1. కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, పటమట సబ్ రిజిస్ట్రార్, కానూరు గ్రామ పంచాయితీ ఏరియా, కానూరు గ్రామ రీ-సర్వే నెం.118/2బి, ఫ్లాట్ నెం.1 వద్ద 202.0 చ॥గ॥ లేదా 168.89 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఖాళీ స్థలం యొక్క అమ్మకపు దస్తావేజు నెం.3753/2007 ప్రకారం యావత్తు ఆస్తి **శ్రీమతి గాజుల నాగవల్లి, భర్త : శ్రీ గాజుల వెంకట రమణ** గారి పేరున ఉన్నది.

హద్దులు : తూర్పు : 33.0 అ॥ల వెడల్పు రోడ్-37.5 అ॥లు, **దక్షిణం :** ప్లాట్ 2 ఆస్తి-49.0 అ॥లు, **పడమర :** పోతులూరి సత్యవతి గారి ఆస్తి-38.4 అ॥లు, **ఉత్తరం :** పంట బోదె-47.0 అ॥లు.

2. షెడ్యూలు-ఎ : కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా ఈస్ట్ రిజిస్ట్రార్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, గుణదల, నాగార్జున నగర్, గుణదల ఆర్‌ఎస్ఆర్ నెం.363/1, ప్లాట్ నెం.167. **హద్దులు : తూర్పు :** ప్లాట్ నెం.168-80.0 అ॥లు, **దక్షిణం :** ప్లాట్ నెం.173-45-0 అ॥లు, **పడమర :** ప్లాట్ నెం.166-80.0 అ॥లు, **ఉత్తరం :** 30 అ॥ల రోడ్-45-0 అ॥లు.

అవిభాజ్యపు విస్తీర్ణం 40-0 చ॥గ॥లు లేదా 33-44 చ॥మీ॥లు, మొత్తము 400 చ॥గ॥లు లేదా 334-45 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం.

షెడ్యూలు-బి : పైన తెలిపిన 'ఎ' షెడ్యూలు ఆస్తిలో, డోర్ నెం.48-16-9ఇ, పాత అసెస్‌మెంట్ నెం.38524/13సిఎ/1, కొత్త అసెస్‌మెంట్ నెం.700252 తో **శకుంతల రెసిడెన్సీ** నందలి నాల్గవ అంతస్తులో గల ఫ్లాట్ నెం.1, ప్లింత్ ఏరియా 900.00 చ॥అ॥లు, ఉమ్మడి ఏరియా 275 చ॥అ॥లు, కార్ పార్కింగ్ ఏరియా 75 చ॥అ॥లతో గల అమ్మకపు దస్తావేజు నెం. 4696/2017 ప్రకారం యావత్తు ఆస్తి శ్రీ గాజుల వెంకట రమణ, తండ్రి : సూర్య ప్రకాశరావు గారి పేరున ఉన్నది. **.హద్దులు : తూర్పు :** వరండా, **దక్షిణం :** ఉమ్మడి వరండా, మెట్లు & లిఫ్టు, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

3. ఐటమ్ నెం.1 : కృష్ణా జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్, పటమట సబ్ రిజిస్ట్రార్, కానూరు గ్రామ పంచాయితీ ఏరియా, కానూరు గ్రామ రీ-సర్వే నెం.154/1, 157/ఎ,బి ఫైనల్ లేఅవుట్ ప్లాన్ ఆమోదిత నెం.8/1998, ప్లాట్ నెం.లు.198, 199 వద్ద 711.94 చ॥గ॥లు మరియు 595.25 చ॥మీ॥ల విస్తీర్ణం గల యావత్తు ఆస్తి.

హద్దులు : తూర్పు : పంచాయితీ రోడ్-55.0 అ॥లు, **దక్షిణం :** 33 అ॥ల రోడ్-119.0 అ॥లు, **పడమర :** 33 అ॥ల రోడ్-55.0 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.200-114.0 అ॥లు.

అవిభాజ్యపు విస్తీర్ణం 37-0 చ॥గ॥లు లేదా 30-94 చ॥మీ॥లు, మొత్తము 711.94 చ॥గ॥లు లేదా 595-25 చ॥మీ॥ల విస్తీర్ణం గల స్థలం.

ఐటమ్ నెం.2 : పైన తెలిపిన ఐటమ్ నెం.1 ఆస్తిలో, వి.జి.టి.ఎమ్. ఆమోదిత ఆర్.సి. నెం.సి8-2719/2006, **జయరాం టవర్స్** అపార్ట్‌మెంట్ నందలి నాల్గవ అంతస్తులో గల ఫ్లాట్ నెం.4ఎ, ప్లింత్ ఏరియా 1077 చ॥అ॥లు, బాల్కని 50 చ॥అ॥లు, కార్ పార్కింగ్ ఏరియా 75 చ॥అ॥లతో గల అమ్మకపు దస్తావేజు నెం.6605/2010 ప్రకారం యావత్తు ఆస్తి **శ్రీ గాజుల వెంకట రమణ, తండ్రి : సూర్య ప్రకాశరావు** గారి పేరున ఉన్నది.

హద్దులు : తూర్పు : ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** ప్లాట్ నెం.బి మరియు ప్లాట్ నెం.ఎ మధ్యన ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఉమ్మడి వరండా.

4. కృష్ణా జిల్లా, ఉయ్యూరు సబ్ రిజిస్ట్రార్, పమిడిముక్కల మండలం, మంతాడ గ్రామ రెవిన్యూ పంచాయితీ ఏరియా, మంతాడ గ్రామ ఆర్ ఎస్ నెం.15-1బి, డోర్ నెం.2-22 దగ్గర 829 చ॥గ॥లు లేదా 693.15 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం యొక్క అమ్మకపు దస్తావేజు నెం.461/2015 ప్రకారం యావత్తు ఆస్తి **శ్రీ గన్నే వెంకట సుబ్బారావు, తండ్రి : రామ కోటయ్య** గారి పేరున ఉన్నది.

హద్దులు : తూర్పు : స్వరూప రాణి మరియు ఇతరుల ఆస్తి-141.0 అ॥లు, **దక్షిణం :** విజయవాడ నుండి బందర్ రోడ్-53.0 అ॥లు, **పడమర :** కొమరంపాలెం బిక్షాలు మరియు ఇతరుల స్థలం-130.3 అ॥లు, **ఉత్తరం :** పుల్లేరు కెనాల్-57.0 అ॥లు.

5. కృష్ణా జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రార్, పెనమలూరు మండలం, కానూరు గ్రామ పంచాయితీ ఏరియా, కానూరు గ్రామ రీ-సర్వే నెం.152/1ఎ, ఫ్లాట్ నెం.1, డోర్ నెం.5-197 తో గల యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** రెడ్డి బత్తిన రామాంజనేయులు మరియు వై లక్ష్మణ స్వామి గార్ల ఆస్తి-58.0 అ॥లు, **దక్షిణం :** ఫ్లాట్ నెం.2 స్థలం-25.0 అ॥లు, **పడమర :** ఇతరుల ఆస్తి-60.0 అ॥లు, **ఉత్తరం :** పంట కాలువ రోడ్-25.0 అ॥లు.

164.11 చ॥గ॥లు లేదా 137.21 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఇంటి స్థలం మరియు ఆర్‌సిసి గ్రౌండ్ & 1వ అంతస్తు డాబా యొక్క అమ్మకపు దస్తావేజు నెం.6441/2018 ప్రకారం **శ్రీ గాజల వెంకట రమణ, తండ్రి : సూర్య ప్రకాశరావు** గారి పేరున ఉన్నది.

తేది : 20.02.2023 ప్రదేశం : మంగళగిరి

సం/-చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచ్

త్రిపురకు తొలిసారిగా 60 మంది కౌంటింగ్ అబ్జర్వర్లు

- ఒక్కో నియోజకవర్గానికి ఒకరు
- నియమించిన ఎన్నికల సంఘం

అగర్తల : ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగించుకున్న ఈశాన్య రాష్ట్రం త్రిపురకు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం తొలిసారిగా 60 మంది లెక్కింపు పరిశీలకులను (కౌంటింగ్ అబ్జర్వర్లు) నియమించింది. మొత్తం 60 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఒక్కొక్క నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఈ నియామకాన్ని జరిపింది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు లెక్కింపు పరిశీలకులను నియమించినట్టు త్రిపుర రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎస్. బందోపాధ్యాయ తెలిపారు. ఓట్ల లెక్కింపు పరిశీలకులు మంగళవారం (ఈనెల 28) నాటికి త్రిపుర చేరుకునే అవకాశం ఉన్నదని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె.కె సిన్హా, సిఇఒ గిట్టె కిరణ్ కుమార్ దినకర్‌రావు, డిజిపి అమితాబ్ రంజన్ ఇప్పటికే మొత్తం ఎనిమిది జిల్లాల్లో పర్యటించి భద్రతా చర్యలకు సంబంధించి అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లు, ఎస్పీలతో సమావేశాలు నిర్వహించారని బందోపాధ్యాయ తెలిపారు. పటిష్ట భద్రత నడుమ మొత్తం 21 కౌంటింగ్ హాల్‌లలో మార్చి 2న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్నదని అన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 16న త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన విషయం తెలిసిందే. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మార్చి 2న జరిగి అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి.

మత వివక్షకు వ్యతిరేకంగా చట్టాన్ని తెస్తాం : కాంగ్రెస్

న్యూఢిల్లీ: దేశంలో ద్వేషపూరిత నేరాల ముప్పును పరిష్కరించడానికి, చట్టాన్ని ప్రతిపాదిస్తామని కాంగ్రెస్ తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశం జరుగుతోంది. కాంగ్రెస్ సభ్యులు, కొన్ని షరతులతో కూడిన ప్రతిపాదిత చట్టం 2024 సార్వత్రిక ఎన్నికల కోసం పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చనుంది. కాంగ్రెస్. రాజకీయ తీర్మానంలో మొత్తం 56 అంశాలు ఉంటాయని పార్టీ సీనియర్ సభ్యుడు ఒకరు తెలిపారు. కాంగ్రెస్ రాజకీయ తీర్మానంలో వస్తు, సేవల సరఫరాలో మతం, కులం, లింగం, భాష ఆధారంగా వివక్షను నిషేధించే లక్ష్యంతో వివక్ష నిరోధక చట్టాన్ని కూడా ప్రతిపాదిస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకులు పేర్కొన్నారు.

జపాన్‌లో 6.1 తీవ్రతతో భూకంపం

- జపాన్‌లోని హొక్కైడో ద్వీపంలో భూకంపం
- 61 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం
- సునామీ ముప్పు లేదన్న అధికార వర్గాలు

టోక్యో: జపాన్‌లోని హొక్కైడో ద్వీపంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.1గా నమోదైంది. భూకంపం నేపథ్యంలో సైరన్లు మోగడంతో హొక్కైడో ద్వీపవాసులు అప్రమత్తమయ్యారు. నెమురో ప్రాంతంలో 61 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు నేషనల్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎర్త్ సైన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ (ఎన్ఐఈడీ) వెల్లడించింది. ఆస్తినష్టం, క్షతగాత్రుల వివరాలు ఇంకా తెలియరాలేదు. భారీ భూకంపం వచ్చినా, సునామీ ముప్పు లేదని అధికారులు తెలిపారు. పసిఫిక్ మహాసముద్రంలోని రింగ్ ఆఫ్ ఫైర్ ప్రాంతంలో ఉన్న జపాన్‌కు భూకంపాల ముప్పు ఎక్కువ. ఇక్కడి ఇళ్లను కూడా భూకంపాలను తట్టుకునే విధంగా కలప, తేలికపాటి పదార్థాలతో నిర్మిస్తుంటారు. భూకంపాలను గుర్తించేందుకు జపాన్ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది.

ఆగి ఉన్న బస్సులను ఢీకొన్న ట్రక్కు.. 8మంది మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. సత్నా సరిహద్దులో ఆగివున్న రెండు బస్సులను ఓ ట్రక్కు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మరణించగా, 50 మందికి గాయాలయ్యాయి. ప్రమాదం ధాటికి ఒక బస్సు రెండు భాగాలుగా విడిపోగా, మరొకటి నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదం ఎంపీలోని బర్కడ గ్రామంలోని మోహనియా టన్నెల్ వద్ద చోటు చేసుకుంది బస్సులో ప్రయాణిస్తున్న వారు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ర్యాలీకి వెళ్లి తిరిగివస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి ట్రక్కు టైర్ పగలడం కారణమని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. గాయపడినవారిలో 10 నుంచి 20 మంది పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు చెప్పారు. రెండు బస్సులు సాత్నాలో జరుగుతున్న కోల్ మహాకుంభ్ పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ప్రమాద ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

డివైఎఫ్ఐ అఖిల భారత యువ మహిళా సమ్మేళనంలో మాట్లాడుతున్న మరియం ధావలే

బృందాకరత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

యువతను మోసం చేసిన మోడీ

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో యువతను ప్రధాని మోడీ మోసం చేశారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ విమర్శించారు. హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో రెండు రోజుల డివైఎఫ్ఐ అఖిల భారత యువ మహిళా సమ్మేళనం శనివారం ప్రారంభమైంది. సమ్మేళనం ప్రారంభానికి ముందు డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎఎ రహీం సంఘం జెండాను ఆవిష్కరించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలే సదస్సును ప్రారంభించారు. మహిళలు లింగ ప్రాతిపదికన, కార్మికులుగా, పౌరులుగా మూడు రకాలుగా దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. లింగ సమస్య కూడా వర్గ దోపిడీకి సంబంధించిన సమస్య అని అన్నారు. సంస్కృతిని కాపాడతామని చెబుతూ మహిళలపై సంఘ్ పరివార్ పితృస్వామ్యాన్ని ప్రయోగిస్తోందని విమర్శించారు. దాన్ని వ్యతిరేకించే వారిని దేశ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తోందని దుయ్యబట్టారు. డివైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమగ్నరాజ్ భట్టాచార్య నివేదికను సమర్పించారు. అనంతరం జరిగిన చర్చల్లో ప్రతినిధులు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన సెషన్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ ప్రసంగించారు. మోడీ సర్కార్ యువతకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తుందని విమర్శించారు. మోడీ హయాంలో యువత సమస్యలు ఎదుర్కొందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హిజాబ్ అంశాన్ని ఉటంకించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

కిరాతకంగా స్నేహితుడి హత్య

- అమ్మాయి కోసం బిటెక్ విద్యార్థి ఘాతుకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమించిన అమ్మాయి కోసం స్నేహితుడిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన సంఘటన హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా చారుకొండ మండలం సిరిసనగండ్లకు చెందిన నేనావత్ నవీన్(20) నల్గొండలోని ఎంజి యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ (ఇఇఇ) నాలుగో ఏడాది చదువుతున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న హరిహరకృష్ణ, నవీన్ స్నేహితులు. ఇద్దరూ ఒకే అమ్మాయిని ప్రేమించడంతో కొన్నాళ్లుగా ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. నవీన్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న హరిహరకృష్ణ దాదాపు మూడు నెలల నుంచి పక్కా ప్రణాళికతో వ్యవహరించాడు. ఈ నెల 17న ఉదయం పార్టీ చేసుకుందా మని హైదరాబాద్ అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని నిర్జీవ ప్రాంతానికి నవీన్‌ను హరి ఆహ్వానించాడు. పార్టీలో ఇద్దరికీ గొడవ జరిగింది. కింద పడిన నవీన్‌ను ఊపిరాడకుండా గొంతునులిమి హతమార్చాడు. తర్వాత మృతదేహాన్ని ఎవరూ గుర్తించకుండా ఉండేందుకు నవీన్ తల, మొండెం వేరు చేయడంతోపాటు గుండెను చీల్చి, మర్మాంగాలను ఛిద్రం చేశాడు. పొట్ట మొత్తం కోసి పేగులు బయటకు తోడేశాడు. హత్యకు ఉపయోగించిన కత్తిపై వేలిముద్రలు కనిపించకుండా చేతికి గ్లౌజులు ధరించాడు. హత్య చేసిన రెండు రోజుల తర్వాత నవీన్ తండ్రికి ఫోన్ చేసి.. నవీన్ కనిపించడంలేదని హరి సమాచారం ఇచ్చి తర్వాత ఫోన్ స్విచాఫ్ చేశాడు. అనుమానంతో నవీన్ కుటుంబ సభ్యులు నార్కెట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘోరం వెలుగులోకి వచ్చింది. నిందితుడు హరిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. హత్య చేసిన తీరును చూసి పోలీసులు విస్తుపోయారు. ఇంత క్రూరంగా చంపడానికి కారణాలను విశ్లేషిస్తున్నారు. హత్యకు సంబంధించిన కీలక సాక్ష్యాలను పోలీసులు సేకరించారు. నిందితుడు హరిహరకృష్ణను పోలీసులు శనివారం హయత్ నగర్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుడిని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు.

బిజెపి హయాంలో కుల, మత ప్రాతిపదికన దేశం విభజన

- శస్త్రచికిత్స అనంతరం లాలూ తొలి ప్రసంగం

పాట్నా : కుల, మత ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు బిజెపి యత్నిస్తోందని ఆర్‌జెడి అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ విమర్శించారు. విజయవంతంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ అనంతరం.. శనివారం ఆయన తన తొలి ప్రసంగంలో బిజెపిపై విరుచుకుపడ్డారు. బీహార్‌లోని పూర్ణియాలో నిర్వహించిన మహాగఠ్‌బంధన్ ర్యాలీని ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. దేశంలోని బలహీనవర్గాలు, మైనారిటీలకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకమని అన్నారు. తమ కూటమి 2024 లోక్‌సభ, 2025 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపిని తుడిచిపెట్టేస్తుందన్నారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని, రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను అంతం చేసేందుకు యత్నిస్తున్నాయని లాలూ ఈ సందర్భంగా తెలిపారు. 'మా పోరాటం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతోనే. సంఘ్ సూచనలనే బిజెపి పాటిస్తోంది' అని వ్యాఖ్యానించారు. బిజెపిని అధికారం నుంచి తొలగించేందుకు బీహార్ చొరవ తీసుకుందని.. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలోనూ బిజెపి గల్లంతవుతుందని చెప్పారు.

దూరదర్శన్, రేడియోల్లో ఇక ఆర్‌ఎస్‌ఎస్ వార్తలే

- హిందుస్తాన్ సమాచార్‌తో ప్రసార భారతి ఒప్పందం
- పిటిఐ, యుఎన్ఐలకు గుడ్‌బై

న్యూఢిల్లీ : భారత్‌లో ప్రభుత్వ వార్తా సంస్థలు దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్)ల్లో ఇక నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) వార్తలే కనిపించనున్నాయి.. వినిపించనున్నాయి. దూరదర్శన్, ఎఐఆర్‌లను నడిపే ప్రసారభారతి రోజువారీ వార్తలు, కథనాలు కోసం హిందుస్థాన్ సమాచార్‌తో ఒప్పందం కుదుర్చుకోవడమే ఇందుకు కారణం. హిందుస్థాన్ సమాచార్ అనేది ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వార్తా సంస్థ. హిందుస్థాన్ సమాచార్‌తో ఒప్పందం కోసం అతిపెద్ద ప్రొఫెషనల్ న్యూస్ ఏజెన్సీ ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ)లో సభ్యత్వాన్ని ప్రసార భారతి రద్దు చేసుకుంది. వాస్తవానికి 2017 నుంచి ప్రసార భారతికి 'మూల్యాంకన పద్ధతి'న ఉచితంగా హిందుస్థాన్ సమాచార్ వార్తలు అందిస్తుంది. ఈ నెల 9న ఈ రెండు సంస్థల మధ్య రూ.7.7 కోట్ల విలువైన అధికారిక ఒప్పందం కుదిరింది. రెండు సంవత్సరాల వ్యవధి కలిగిన ఈ ఒప్పందం 2025 మార్చిలో ముగుస్తుంది. ఈ ఒప్పందం ప్రకారం ప్రసార భారతికి ప్రతిరోజూ కనీసం వంద వార్త కథనాలను హిందుస్థాన్ సమాచార్ అందజేయాలి. ఇందులో కనీసం 10 జాతీయ వార్తలు, 40 స్థానిక కథనాలు ప్రాంతీయ భాషల్లో ఉండాలి.

హిందుస్థాన్ సమాచార్‌తో ప్రసార భారతిని అధికారికంగా చేర్చడం కోసం నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి పిటిఐ, యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యుఎన్ఐ)తో గిల్లికజ్జాలు పెట్టుకుంటోంది. ఈ రెండు ఏజెన్సీలు అసమంజసమైన సబ్‌స్క్రిప్షన్ ఫీజులను వసూలు చేస్తున్నాయని, ఈ సంస్థల సేవలను రద్దు చేయాలని ప్రసారభారతిని కొన్నేళ్ల కిందటే ఆదేశించింది. రెండు సంస్థలు ఏడాదికి రూ.15.75 కోట్ల ఫీజులను వసూలు చేస్తున్నాయని, పిటిఐ ఫీజు ఇందులో రూ. 9 కోట్లు వరకూ ఉందని కేంద్రం తెలిపింది. ఈ రెండు సంస్థలు యథాతథంగా వార్తలు అందిస్తున్నాయని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వార్తలను అందించే సంస్థ కావాలని కేంద్రం కోరుకుందని సమాచారం.

2016లో పిటిఐ ప్రధాన సంపాదకులుగా ఎంకె రజ్దాన్ పదవీకాలం ముగిసిన తరువాత ఆ స్థానంలో తమ చెప్పుచేతల్లో ఉండే వ్యక్తిని నియమించడం కోసం మోడీ ప్రభుత్వం లాబీయింగ్ జరపగా, పిటిఐ బోర్డు అవి పట్టించుకోకుండా ప్రముఖ జర్నలిస్టు విజయ్ జోషిని ఆ స్థానంలో నియమించింది. 2017లో మధ్య ఢిల్లీలో ఉన్న పిటిఐ భవనం నుంచి ప్రసారభారతి కార్యాలయం ఖాళీ చేసిన తరువాత ఈ రెండు సంస్థల మధ్య సత్సంబంధాలు లేవని సమాచార, ప్రసార శాఖకు చెందిన ఒక మాజీ కార్యదర్శి మీడియాకు తెలిపారు. పిటిఐ అద్దె ఎక్కువగా వసూలు చేస్తుందని ఈ భవనాన్ని ప్రసార భారతి ఖాళీ చేసింది. దేశ వ్యతిరేక వార్తలు ప్రసారం చేస్తుందని కూడా పిటిఐపై కేంద్రం ఆరోపణలు చేసింది. దేశంలోని చైనా రాయబారి, చైనాలోని భారత్ రాయబారితో పిటిఐ ఇంటర్వ్యూలు చేయడం కేంద్రానికి కోపం తెప్పించింది. ఈ పిటిఐ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్‌కు ప్రసారభారతి సీనియర్ అధికారి సమీర్ కుమార్ లేఖ కూడా రాసారు. ఈ వార్తలు భారతదేశ ప్రాదేశికతను బలహీనపరిచాయని ఆరోపించారు. ఎట్టకేలకు 2020లో అక్టోబర్‌లో పిటిఐ సభ్యత్వాన్ని ప్రసారభారతి రద్దు చేసుకుంది.

ప్రముఖ వార్త సంస్థ పిటిఐను తొలగించి, దాని స్థానంలో అంతగా తెలియని హిందుస్థాన్ సమాచార్‌తో ఒప్పందం కుదుర్చుకోవడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ప్రభుత్వ సానుకూల వార్తలకు, కాషాయ వార్తల ను ప్రచారం చేయడం కోసమే ప్రభుత్వం ఈ ఒప్పందం చేసుకుందని ఆరోపిస్తున్నారు. 1948లో హిందుస్థాన్ సమాచార్‌ను ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్‌తో కలిసి ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ ప్రచారక్, విశ్వ హిందూ పరిషత్ సహ వ్యవస్థాపకుడు శివరామ్ శంకర్ ఆప్టే స్థాపించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ ప్రకటనలు విరివిగా వస్తున్నా యి. దీంతో జుండేవాలన్‌లో ఉన్న తన చిన్న కార్యాలయాన్ని నోయిడాలోని పెద్ద ఆఫీసుకు మార్చాలని హిందుస్థాన్ సమాచార్ యోచిస్తుంది. 1986లో ఆర్థిక సంక్షోభంతో దీనిని మూసివేశారు. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న 2002లో ఆర్‌ఎస్‌ఎస్ దీనిని పునరుద్ధరించింది.

హెచ్‌సియులో 'ఎస్ఎఫ్ఐ' ఘనవిజయం

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి ప్రజ్వల్‌కు 1,838 ఓట్లు, ఎబివిపి కూటమి అభ్యర్థికి 1,250 ఓట్లొచ్చాయి. 588 ఓట్ల మెజార్టీతో ప్రజ్వల్ గొలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి ఎస్ఎఫ్ఐ కూటమి నుంచి పృథ్విసాయికి 1,861 ఓట్లు, ఎబివిపి కూటమి అభ్యర్థికి 1,163 ఓట్లు వచ్చాయి. 708 ఓట్ల తేడాతో పృథ్విసాయి విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పోస్టుకు పోటీ చేసిన ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి కృప మరియజార్జ్‌కు 2,076 ఓట్లు, ఎబివిపి కూటమి అభ్యర్థికి 1,185 ఓట్లు వచ్చాయి. కృప మరియజార్జ్ 892 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు. స్పోర్ట్స్ సెక్రెటరీగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి సిహెచ్ జయరాజుకు 1,544 ఓట్లు, ఎబివిపి కూటమి అభ్యర్థికి 1,377 ఓట్లు వచ్చాయి. 177 ఓట్ల తేడాతో జయరాజు గెలిచారు. జాయింట్ సెక్రెటరీగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి కత్తి గణేష్‌కు 1,578 ఓట్లు, ఎబివిపి కూటమి అభ్యర్థికి 1,011 ఓట్లు పోలయ్యాయి. 567 ఓట్ల తేడాతో గణేష్ విజయం సాధించారు. కల్చరల్ సెక్రెటరీగా ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి లిఖిత్‌కుమార్‌కు 1,789 ఓట్లు, ఎబివిపి కూటమి అభ్యర్థికి 1,318 ఓట్లు పొందారు. 471 ఓట్ల తేడాతో లిఖిత్‌కుమార్ గెలుపొందారు. ఐసిసి జిఎస్ క్యాష్ (ఇంటిగ్రేటెడ్) పోస్టుకు 126 ఓట్లతో షిఫా మింజ్, ఐసిసి జిఎస్ క్యాష్ (రీసెర్చ్) పోస్టుకు 213 ఓట్లతో ఎస్ఎస్ సుభాషిణి, ఐసిసి జిఎస్ క్యాష్ (పిజి) పోస్టుకు హృతిక్ లక్ష్మణ్ లలన్ విజయం సాధించారు.

పేదల భూములను తిరిగివ్వకుంటే... దశల వారీ పోరాటం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన కొద్దిపాటి భూమినీ తిరిగి లాక్కోవాలని చూడడం సరికాదన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎక్కడ భూములు తీసుకున్నా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ భూముల రీసర్వే పేరుతో అసైన్డ్, చెరువు, కాలువ, పోరంబోకు తదితర భూములను ఎస్‌సి, ఎస్‌టి, ఇతర పేదలకు దక్కనీయకుండా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రలను తిప్పికొట్టి భూములను, వాటి పట్టాలను సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ మురికిపూడిలో భూములను గ్రానైట్ పేరుతో సిఎం బంధువైన ఎంపి అవినాష్‌రెడ్డి, తదితరులకు కట్టబెట్టారని విమర్శించారు. యడవల్లిలోనూ ఇలాగే తీసుకున్నారని, అక్కడ పోరాట ఫలితంగా కొంతవరకైనా పరిహారం దక్కిందని తెలిపారు.

ఈ సదస్సులో మురికిపూడికి చెందిన దళిత రైతు రాజు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎస్‌సి, బిసిలకు 30 ఏళ్ల క్రితం ఇచ్చిన 400 ఎకరాలను ప్రస్తుత మంత్రి రజిని గ్రానైట్ క్వారీలకు అప్పజెప్పారని, దీన్ని వ్యతిరేకించిన వారిపై అత్యాచారం కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. ఛంఘీస్‌ఖాన్‌పేట సమీపంలోని సంఘం గోపాలపురానికి చెందిన దళిత మహిళ పోలేపోగు సుమమాధురి మాట్లాడుతూ 50 మందికి రెండు సెంట్ల చొప్పున ఎకరం స్థలంలో ఇళ్ల స్థలాలు, ఒక్కో కుటుంబానికి రెండెకరాల పొలం ఇచ్చారని, వాటికి పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయని, వాటిని వైసిపి నాయకులు ఆక్రమించారని తెలిపారు. దీనిపై అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. సదస్సులో కెవిపిఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, సిఐటియు పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, బి.శంకరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, పలు గ్రామాల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఉమ్మడి కృషి

- భారత్, జర్మనీల ప్రకటన

న్యూఢిల్లీ : ప్రపంచదేశాలను ఆందోళనకు గురిచేస్తున్న ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఉమ్మడిగా కృషి చేస్తామని భారత్, జర్మనీలు ప్రకటించాయి. జర్మనీ ఛాన్సలర్ ఓలఫ్ స్కోల్జ్ భారత్ పర్యటనకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు మాట్లాడుతూ ఉక్రెయిన్ అంశాన్ని ప్రస్తావించారు. 'కోవిడ్ మహమ్మారి, ఉక్రెయిన్ సంక్షోభం యావత్తు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు వీటితో ప్రతికూలంగా పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి ప్రయత్నాల ద్వారా ఈ సమస్యలను పరిష్కరించవచ్చని మేమిద్దరం అంగీకరిస్తున్నాము. మేము దీనిపై దృష్టి పెడుతున్నాము.' అని విడివిడిగా చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ ఉక్రెయిన్ సంక్షోభం మొదలైనప్పటి నుంచి కూడా చర్చలు, దౌత్యం ఆవశ్యకత గురించి భారత్ మాట్లాడుతోందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఎలాంటి శాంతి చర్చలలోనైనా చేరడానికి భారతదేశం సిద్ధంగా ఉందని అన్నారు. ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలు చేయాలని, సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. స్కోల్జ్ మాట్లాడుతూ ఉక్రెయిన్‌లో సంక్షోభాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఉక్రెయిన్- రష్యా వివాదంతో యావత్తు ప్రపంచం ఇబ్బంది పడుతుందని అన్నారు. అలాగే ఇయు-ఇండియా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు త్వరగా పూర్తికావడానికి వ్యక్తిగతంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు. జి20కి భారత్ అధ్యక్షత వహించడంపై అభినందనలు తెలిపారు. భారత్‌కు పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. హాంబర్గ్‌కు మేయర్‌గా ఉన్న సమయంలో భారత పర్యటనకు మొదటిసారిగా వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు.

ఉక్రెయిన్ సంక్షోభంపై కుదరని ఏకాభిప్రాయం

ప్రకటన లేకుండానే ముగిసిన జీ20 మంత్రుల సమావేశం

బెంగళూరు : ఉక్రెయిన్ సంక్షోభం కుదరకపోవడంతో ఎలాంటి ప్రకటన లేకుండానే జీ20 ఆర్థిక మంత్రుల సమావేశం శనివారం ముగిసింది. ప్రకటనకు బదులుగా సమావేశం యొక్క సారాంశం, అవుట్‌కం డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. రెండు రోజుల పాటు ఇక్కడ జరిగిన సమావేశంలో జీ20 ఆర్థిక మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లు పాల్గొన్నారు. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా రష్యా దండయాత్రను ఖండించాలని అమెరికా, ఫ్రాన్స్ దేశాల మంత్రులు కోరగా, ఆతిథ్య భారత్ దీనిని తిరస్కరించింది. ఈ సమావేశంలో అటువంటి సమస్యలు చర్చించడానికి వేదిక కాదని, అలాగే దండయాత్రకు బదులుగా 'సంక్షోభం', 'సవాలు' వంటి పదాలు వాడాలని సూచించింది. ఈ సమావేశంలో రాజకీయ విషయాలు చర్చించడంపై రష్యా, చైనా ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సమావేశానికి భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశంలో ఉక్రెయిన్ సంక్షోభంతో పాటు పేద దేశాలను రుణాల నుంచి విముక్తి కల్పించడం, డిజిటల్ కరెన్సీలు-చెల్లింపులు, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల్లో సంస్కరణలు, వాతావరణ మార్పులు వంటి అంశాలపై చర్చించినట్లు 'సారాంశం' తెలిపింది.

ఆమ్నెస్టీ భారత్‌కు ఊరట

- బ్యాంకు ఖాతాలు బ్లాక్ చేయాలన్న ఇడి నోటీసు రద్దు
- కర్నాటక హైకోర్టు ఆదేశాలు

బెంగళూరు : ప్రముఖ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియాకు ఊరట లభించింది. సదరు సంస్థకు చెందిన బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసుకు కర్నాటక హైకోర్టు బ్రేకులు వేసింది. ఆ నోటీసును రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. విదేశీ మారకపు నిర్వహణ, ఐటి చట్టాల కింద 2018లో ఇడి నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో ఇడి పంపిన నోటీసును సవాలు చేస్తూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా, ఇండియన్స్ ఫర్ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ట్రస్టు కర్నాటక హైకోర్టును ఆశ్రయించాయి. దీనిపై కర్నాటక హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. సదరు నోటీసును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నోటీసు కేవలం 60 రోజుల మాత్రమే చెల్లుబాటవుతుందని ధర్మాసనం తెలిపింది. కోర్టు తీర్పుతో ఈడీకి చుక్కెదురైంది. ఇడి ఆమ్నెస్టీ ఇండియా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంతో ఆమ్నెస్టీ ఇండియా కార్యాలయాలు 2020లో మూతపడిన విషయం తెలిసిందే.

యుపి ప్రభుత్వం ఏం చేస్తోంది?

- పట్టపగలే చంపుతున్నారు : అసెంబ్లీలో అఖిలేష్

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లో అసలు ప్రభుత్వ పాలన ఉందా? అంటూ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన 'రాజ్ పాల్' హత్య కేసులో ప్రధాన సాక్షి అయిన ఉమేశ్ పాల్‌ను కొంతమంది దుండగులు శుక్రవారం పట్టపగలు అత్యంత పాశవికంగా హత్యచేశారు. ఈ ఘటన యుపి అసెంబ్లీ సమావేశాల్లో చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై సర్వత్రా ఆందోళన వ్యక్తం మవుతోందని, యుపి ప్రభుత్వం, పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సభలో ఆయన ఫైర్ అయ్యారు. ఉమేశ్ హత్యలో గ్యాంగ్ వార్ వంటి పరిస్థితి కనిపించిందన్నారు. ఈ నేపథ్యంలో శనివారం సభలో సీఎం యోగి ఆదిత్యనాథ్, ప్రతిపక్ష నాయకుడు అఖిలేష్ యాదవ్ మధ్య వాడివేడి సంభాషణ చోటుచేసుకుంది. తొలుత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, "నేరస్థులు మీవాళ్లే. పట్టపగలే కాల్పులు జరుగుతు న్నాయి. బాంబులు విసురుతున్నారు. ఒక ముఖ్య మైన కేసులో ప్రధాన సాక్షిని చంపారు. పోలీసులు ఏం చేస్తున్నారు? ప్రభుత్వం ఏం చేస్తోంది? డబుల్ ఇంజన్‌లు ఎక్కడున్నాయి? ఇది సినిమా షూటింగా? బాహాటంగా తుపాకులు పేల్చేది రామరాజ్యమా..?" అంటూ మండిపడ్డారు.

"వాళ్లను మట్టిలో కలిపేస్తాం".. :యోగి

దీనిపై స్పందిస్తూ సిఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. "బాధితులు ఆరోపించిన వ్యక్తి సమాజ్‌వాదీ పార్టీకి చెందినవ్యక్తి. మాఫియాను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వాళ్లందరిని మట్టిలో కలిపేస్తాం. అఖిలేష్ యాదవ్ మాఫియాకు గాడ్‌ఫాదర్" అంటూ ఆయన వైపు వేలు చూపిస్తూ కామెంట్స్ చేశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి చోటుచేసుకుంది.

బుర్కినా ఫాసోలో మిలటరీ కాన్వాయ్‌పై ఐఎస్ దాడి

- 70 మంది సైనికుల హత్య, మరో ఐదుగురి అపహరణ

ఔగడౌగౌ : పశ్చిమ ఆఫ్రికా దేశం బుర్కినా ఫాసోలో ఒక మిలటరీ క్యాన్వాయ్‌పై ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ చేసిన ఆకస్మిక దాడిలో 70 మంది సైనికులు మరణించారు. ఈ దాడిలో పదుల సంఖ్యలో సైనికులు గాయపడగా, మరో ఐదుగుర్ని బందీలుగా పట్టుకున్నట్లు ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ఒక ప్రకటనలో తెలిపింది. సాహెల్స్ ఓడలన్ రాష్ట్రంలోని డియోకు సమీపంలో శుక్రవారం ఈ దాడి జరిగిందని తెలిపింది. తమ ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లోకి సైనికులు వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఈ దాడి చేశామని, అనేక ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపింది. ఎడారిలోకి మైళ్ల దూరం వరకూ సైనికులను తరిమితరిమి కొట్టామని తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను కూడా ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ విడుదల చేసింది. రక్తపు మరకల్లో పడి ఉండి మరణించిన 54 మంది సైనికులు ఫోటోలు, స్వాధీనం చేసుకున్న 50కు పైగా అస్సాల్ట్ రైఫిల్స్, బందీగా ఉన్న ఐదుగురు ఖైదీల చిత్రాలను విడుదల చేసింది. దేశంలోని టిన్-అకోఫ్ పట్టణంలోని ఒక సైనిక అవుట్ పోస్టుపై గత వారంలో జరిగిన దాడిలో పదుల సంఖ్యలో సైనికులు, సాధారణ ప్రజలు మరణించారని వార్తలు వచ్చిన కొన్ని రోజుల్లో తాజా దాడి గురించి ఐఎస్ ప్రకటన చేయడం ఆందోళన కలిగిస్తుంది. ఈ రెండు సంఘటనల్లో ఎంత మంది మరణించారనే విషయంపై స్పష్టత లేదు. తాజా దాడిలో 51 మంది సైనికులు మరణించారని ప్రభుత్వం ధ్రువీకరించింది. బుర్కినా ఫాసోలో అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ గ్రూప్‌లు తరచుగా విధ్వంసానికి పాల్పడుతుంటాయి.

మీకోసం

వాష్ బేసిన్‌లో రంధ్రాలు మూసుకుపోయినప్పుడు వేడినీటిలో కాస్తంత ఉప్పు కలిపి ఆ నీటిని వాష్ బేసిన్‌లో పోయాలి. రంధ్రాలు తెరుచుకుని వాష్ బేసిన్ శుభ్రపడుతుంది.

జీవన సౌరభం

ఇతరులకు స్వేచ్ఛను నిరాకరించే వారు తాము స్వేచ్ఛ పొందటానికి అర్హులు కారు.

మనుషలంతా ఒక్కటే !



అది వేమనపురం ప్రాథమిక పాఠశాల. పక్కనే చిన్న శివాలయం ఉంది. పిల్లలందరూ పాఠశాల చుట్టుపక్కల కలయ తిరుగుతూ ఆడుకుంటూ ఉంటారు.

ఒక రోజు రాజు, ప్రసాద్, శ్రీను, రాఘవ ఇంటర్వెల్ సమయంలో గోళీలాట ఆడుకుందామనుకున్నారు. శివాలయం గోడ పక్కన ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఆడుకోసాగారు. గుడిలో ఉన్న పూజారి బయటకు వచ్చాడు. 'ఎవర్రా మీరు? ఏం చేస్తున్నారిక్కడ? ఎవరి పిల్లలు?' అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేశాడు. పిల్లలందరూ బిక్క మొహం వేశారు. రాజును ప్రసాద్‌ను మీరు శివాలయంలోకి రాకూడదని, కోపగించుకున్నాడు. పిల్లలందరూ భయపడి అక్కడి నుంచి పాఠశాలలోకి పరుగెత్తారు.

ప్రసాద్‌కు రాజుకు గుడిలోకి ఎందుకు వెళ్ళకూడదో అర్థం కాలేదు. బడి గుడి ఒకటే అని మాస్టారు అన్నారు. ఎప్పుడూ మమ్మల్ని తక్కువ చేసి చూడలేదు. మరి ఈయన ఎందుకు గుడిలోకి రావొద్దన్నారు అని అనుకోసాగారు. తిరిగి గంట కొట్టగానే స్కూల్లోకి వెళ్లిపోయారు.

ఒకరోజు ప్రసాద్, వాళ్ళ నాన్న కలిసి సైకిల్ మీద వెళుతున్నారు. వారి ముందు బైకు మీద పూజారి వెళ్ళాడు. పూజారిని గుర్తించిన ప్రసాద్ 'నాన్న! ఆయనే నన్ను, రాజును గుడిలోకి రావద్దన్నాడు' అని చూపించాడు.

కొద్ది దూరం వెళ్లేసరికి గాయాలతో పడి ఉన్నాడు పూజారి. 'ఏమయ్యిందయ్యా' అడిగాడు ప్రసాద్ వాళ్ళ నాన్న. 'అడవి పంది బండికి బలంగా తగిలింది. అదుపుతప్పి పడిపోయాను' అన్నాడు, గాయాలతో బాధపడుతూ. కాలుకు దెబ్బతగిలినట్లు ఉంది. లేవలేక పోయాడు. పూజారిని లేపి ఆయన బండిమీదే పట్నానికి ఆస్పత్రికి తీసుకెళ్లాడు ప్రసాద్ వాళ్ల నాన్న.

'ఇన్ని రోజులూ ఎక్కువ కులం, తక్కువ కులం వాళ్లు అనే భావన ఉండేది. అవమానించిన వాళ్లే సమయానికి సహాయం చేశారు. మనుషలంతా ఒక్కటే అని, మానవత్వం ముఖ్యమని తెలిసొచ్చింది' అనుకున్నాడు పూజారి. అప్పటినుండి గుడిలోకి ఎవరు వచ్చినా గౌరవించసాగాడు.

- ఆవుల చక్రపాణి యాదవ్
99633 50973

బొమ్మ గీయండి!



చిన్నారులూ , ఈ రోజు ఒంటె బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.

నేను గీసిన బొమ్మ

- పి. సాత్విక, 3వ తరగతి, నేతాజి బాలా విద్యాలయం, తాడేపల్లి, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వక్కాకు ప్లేట్లతో పర్యావరణానికి మేలు

చాలా ఫంక్షన్లలో ప్లాస్టిక్ ఉన్న భోజన ప్లేట్లు ఉపయోగించటం చూస్తున్నాం. వాటిని వాడి, పడేశాక భూమిలో కలవకపోగా విషవాయువులను విడుదల చేస్తున్నాయి. అలాగే ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా వస్తున్న పేపర్ ప్లేట్లలోనూ క్యాన్సర్ కారకాలు కలుస్తున్నట్లు నిపుణులు తేల్చారు. వీటికి ప్రత్యామ్నాయంగా ఉండే సహజసిద్ధమైన వాటి కోసం అన్వేషించారు కృష్ణమాచారి. ఎన్నో అధ్యయనాల తరువాత ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి మేలు చేసే వక్క చెట్ల మట్టలతో ప్లేట్లు తయారు చేస్తున్నారు. ఇలా పర్యావరణానికి తన వంతు మేలు చేస్తున్నారు.

గతంలో గ్రామాల్లో విస్తరాకుల్లో, అరటి ఆకుల్లోనూ భోజనాలు పెట్టేవారు. వాటి వాడి పారేశాక భూమిలో కలిసిపోయి, భూమికి సారాన్ని ఇచ్చేవి. రానురానూ వీటి స్థానంలో ప్లాస్టిక్ ప్లేట్లు వచ్చాయి. ఫంక్షన్లలో బఫే పద్ధతి రావడంతో ప్లాస్టిక్ ప్లేట్ల వాడకం విపరీతంగా పెరిగింది. ఇవి భూమిలో కలవకపోగా నేలలో ఉన్న పోషకాలను నాశనం చేస్తున్నాయి. వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఈ ప్లేట్లలో ఆహారం తినడం వల్ల ప్లాస్టిక్, పేపర్ పదార్థాలు జీర్ణవ్యవస్థలోకి చేరి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే పేపర్‌ప్లేట్లతోనూ సమస్యలు ఉన్నాయి. పేపర్ పేట్ల తయారీకి వాడే రా మేటిరియల్‌లో దాదాపు 15 రకాల కెమికల్స్ కలుపుతారు. కాగితం కప్పు మెత్తబడకుండా ఫెవికాల్ లాంటి కెమికల్ గమ్ కూడా వాడతారు. ఆ కాగితంలో చేసిన ప్లేట్లు, టీ కప్పుల్లో వేడి వేడి ఆహార పదార్థాలు తిన్నప్పుడు, టీ తాగినప్పుడు ఆ కెమికల్స్ కడపులోకి వెళ్లి జబ్బులు వస్తున్నాయని విశాఖపట్నానికి చెందిన కృష్ణమాచారి తెలుసుకున్నారు. ఈ దిశగా ప్రజలను చైతన్యం చేయాలనుకున్నారు.

ఆరోగ్యానికి ప్రాముఖ్యత

కృష్ణమాచారి సి.ఎ చేశారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. జిఎస్టీలోనూ కీలకబాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన మొదటి నుంచీ ప్లాస్టిక్ రహిత ప్రత్యామ్నాయ వస్తువులకు ప్రాధాన్యత ఇస్తారు. కరోనా తర్వాత అందరిలోనూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. ఈ క్రమంలో జనంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించి, సహజసిద్ధమైన వనరుల వాడకపై చైతన్యం కలిగించాలనుకున్నారు. ఆ దిశగా ఓ వ్యాపారం ప్రారంభించాలని, పది మందికి ఉపాధి కల్పిస్తే బాగుంటుందని ఆలోచించారు. పెళ్లిళ్ళు, పుట్టిన రోజు వేడుకల్లో వాడే భోజనం, టిఫిన్ ప్లేట్లు, టీ కప్పుల ద్వారా ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని అర్థం చేసుకున్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా తానేమైనా చేయగలనా? అని ప్రశ్నించుకున్నారు. ఆన్‌లైన్‌లో వెతకగా బెంగుళూరులో వక్క ఆకులతో పేట్లు తయారుచేస్తున్నట్లు తెలిసింది. బెంగుళూరు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి వక్క పండిస్తున్న రైతులను కలిశారు. వక్కలో ఉన్న సుగుణాలే ఆకుల్లోనూ ఉంటాయని తెలుసుకున్నారు. ఈ విషయంలో వైద్యులనూ సంప్రదించారు. ఈ ఆకుల్లో 'ఎరికోలిన్' అనే పదార్థం ఉంటుందని, ఇది మెదడును ప్రభావితం చేస్తుందని, ఉత్సాహాన్ని కలిగిస్తుందని నిపుణుల ద్వారా తెలుసుకున్నారు. ఆహార పదార్థాలు వేడివల్ల ప్లేట్లో ఉన్న ఔషధ గుణాలు పొట్టలో చేరి నులిపురుగులు నాశనం చేస్తాయని, నోటి దుర్వాసనను పోగొడతాయని తెలుసుకున్నారు. ఈ ఆకులు 90 రోజుల్లో నేలలో పూర్తిగా కలిసిపోయి, ఎరువుగా తయారవుతాయి. పర్యావరణానికి లాభమే తప్ప నష్టం లేదు.



బెంగళూరు చుట్టుపక్కల 2 లక్షల 94 హెక్టార్లలో వక్క చెట్లను పెంచుతున్నారు. ఒక్కో చెట్టు సంవత్సరానికి నాలుగు, ఐదు ఆకులను ఇస్తుంది. వీటిని వృధా చేయకుండా అక్కడ కొంతమంది వ్యాపారులు ప్లేట్లు తయారు చేస్తున్నారు. కృష్ణమాచారి ఆ తయారీ యూనిట్లను పరిశీలించారు. మిషన్ల పని విధానం, ప్లేట్ల తయారీ గురించి కార్మికులతో మాట్లాడారు. తానూ కొన్ని నెలలు శిక్షణ తీసుకున్నారు.

మిత్రులు వద్దని వారించినా ...

ఈ యూనిట్ పెట్టాలని కృష్ణమాచారి అనుకున్నప్పుడు మంచి ఉద్యోగం ఉండగా... ఈ వ్యాపారం ఎందుకంటూ సన్నిహితులు అభ్యంతర పెట్టినా ఆయన రూ.15 లక్షల ఖర్చు పెట్టి కర్నాటక నుంచి మిషనరీ తెప్పించారు. సబ్బవరం మండలం రాపర్తివారిపాలెంలో 22 సెంట్ల స్థలంలో షెడ్డు నిర్మించారు. బెంగుళూరు నుంచి రైతులు ఎండబెట్టి పంపిన వక్క ఆకులు చాలా గట్టిగా ఉంటాయి. మొదట వాటిని పెద్ద పెద్ద తొట్లలో నీళ్లతో శుభ్రం చేసి, రెండు గంటల పాటు ఆరబెడతారు. దాంతో అవి కొంచెం మెత్తబడతాయి. ఏ సైజులో తయారు చేయాలో చూసుకుని మిషన్ల దగ్గరకు తీసుకెళ్లి ఆకులను ప్రెస్ చేస్తారు. వెంటనే ప్లేట్లుగా మారిపోతాయి. 12 అంగుళాల నుంచి, 10, 8, 6, 4 అంగుళాల భోజన పేట్లు, టిఫెన్ల ప్లేట్లు తయారు చేస్తున్నారు. గుండ్రంగా, చతురస్రంగా, చిన్న కప్పు ఆకారాల్లో మొత్తం ఏడు రకాల బఫే ప్లేట్లు తయారు చేస్తున్నారు. సుగంధ ద్రవ్యాల్లో ఒకటైన వక్క ఆకుల ప్లేట్లు తయారీ చేయడం చూసి చాలామంది వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

ఉపాధి కల్పిస్తూ...

ఈ పరిశ్రమలో ఐదుగురు మహిళలు పనిచేస్తున్నారు. లోడ్ దించడానికి, ఎత్తడానికి మగవాళ్లు పని చేస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 15 వందల ఆకులు తయారుచేస్తున్నారు. వాటిని కట్టలు కట్టి ఆర్డర్స్ ఇచ్చిన వాళ్లకు పంపిస్తున్నారు. ఎక్కువగా విశాఖపట్నంలో జరిగే ఫంక్షన్లకు ఆర్డర్లు వస్తున్నాయి. ప్రస్తుతం కాకినాడ, విజయనగరం, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు పంపిణీ చేస్తున్నారు. ఒక్కో ప్లేట్ సైజును బట్టి రూ.4 నుంచి రూ.6ల ధర పలుకుతుంది. రోజురోజుకూ పర్యావరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరుగుతున్న క్రమంలో ఈ వక్కాకుల ప్లేట్లు వినియోగం పర్యావరణహితంగా ఉంది.

- పద్మావతి

ఆర్‌ఆర్‌ఆర్‌కి ఐదు అవార్డులు

ఆస్కార్ రేసులో ఉన్న ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం తాజాగా ఆరవ హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ నుండి ఐదు విభాగాల్లో అవార్డులు అందుకొంది. బెస్ట్ యాక్షన్, బెస్ట్ స్టంట్స్, బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఇంటర్నేషనల్ సాంగ్‌తోపాటు స్పాట్ లైట్ అవార్డును కూడా చిత్రబృందం అందుకుంది. రాజమౌళి, రామ్‌చరణ్ తదితరులు ఈ వేడుకలో భాగమయ్యారు. 'బెస్ట్ యాక్షన్ ఫిల్మ్' కేటగిరీలో ఏరియల్ కంబాట్ ఫిల్మ్ 'టాప్ గన్: మేవరిక్', 'బ్లాక్ పాంథర్', 'బ్యాట్ మ్యాన్', 'విమెన్ కింగ్' ఉన్నప్పటికీ ఆ సినిమాలను పక్కకు నెట్టి 'ఆర్‌ఆర్‌ఆర్' 'బెస్ట్ యాక్షన్ ఫిల్మ్' అవార్డు సొంతం చేసుకుంది.

'కస్టడీ' ముగించేశారు

నాగ చైతన్య, కృతి శెట్టి జంటగా తమిళ్ డైరెక్టర్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కస్టడీ' చిత్రం షూటింగ్ ముగిసింది. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ సినిమా మే 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో మొట్టమొదటి సారి పవర్ ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నాగచైతన్య కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారంతో చిత్ర షూటింగ్ ముగిసినట్లు చిత్రబృందం తాజాగా ఒక వీడియోను విడుదలచేసింది.

'ప్రాజెక్టు కె అందరినీ అలరిస్తుంది...'

'సావిత్రమ్మ జీవితంలోని ఎత్తుపల్లాలను నాగ్ అశ్విన్ వెండితెర మీద చూపించిన విధానం నన్ను ఆకట్టుకుంది. 'ప్రాజెక్ట్ కె' లోను అనేక భావోద్వేగాలు ఉన్నాయి. గతంలో ఎప్పుడు కూడా మీరు అటువంటి దృశ్యాలను చూసి ఉండరు. ఫైట్స్ అద్భుతంగా ఉంటాయి. అమెరికా, సౌతాఫ్రికాతో సహ ఇండియాకు చెందిన వారు స్టంట్స్‌ను కొరియోగ్రఫ్ చేస్తున్నారు. మిక్కి జె. మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేయడం లేదు. సంతోష్ నారాయణన్‌తో సహ బాలీవుడ్‌కు చెందిన లేడీ మ్యూజిషియన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. చిత్రంలో చాలా మంది నటీనటులు ఉన్నారు. వారి పేర్లను త్వరలోనే ప్రకటిస్తాం. 'ప్రాజెక్ట్ కె' పై నాకు చాలా కాన్ఫిడెన్స్ ఉంది' అని అశ్వినీదత్ అంటున్నారు. అశ్వనీదత్ ప్రొడక్షన్ హౌస్ వైజయంతి మూవీస్ 'ప్రాజెక్ట్ కె' చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో రూపొందిస్తోంది. ప్రభాస్, దీపికా పదుకొణె ముఖ్య తారాగణంగా, అమితాబ్ బచ్చన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వైజయంతి మూవీస్ అధినేత అశ్వినీదత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పై విషయాలు ముచ్చటించారు.

మిథున్ తనయుడు ఎంట్రీ

సీనియర్ హిందీ హీరో మిథున్ చక్రవర్తి కొడుకు మిమో తెలుగు సినిమాతో ఎంట్రీ ఇస్తున్నారు. మాధవ్ కోదాడ దర్శకత్వంలో కె.బి.ఆర్. సమర్పణలో మారుతి శ్యాంప్రసాద్ రెడ్డి 'నేనెక్కడున్నా' అనే సినిమా నిర్మించారు. 'ఆపరేషన్ గోల్డ్ ఫిష్' ఫేమ్ సశా ఛెత్రి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మూవీ పోస్టర్‌ను, టీజర్ ను ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మాధవ్ కోదాడ మాట్లాడారు. జర్నలిజం, రాజకీయం నేపథ్యంలో వస్తున్న థ్రిల్లర్ చిత్రమిది. ఊహించని మలుపులతో సినిమా సాగుతుందన్నారని చెప్పారు. సినిమా చిత్రీకరణ పూర్తి అయ్యింది. ముంబై, హైదరాబాద్, బెంగళూరులో షూటింగ్ చేశాం. ప్రస్తుతం సెన్సార్ జరుగుతుంది. ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు. ఇందులో రష్యన్ డాన్సర్లతో చేసిన పబ్‌సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు.

యథార్థ సంఘటనల ఆధారంగా 'ఇన్ కార్'

హీరోయిన్ రితిక సింగ్ ప్రధాన పాత్రలో రూపొందిన సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్'. అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్ష వర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రంలో సందీప్ గోయత్, మనీష్ ఝుంజోలియా, జ్ఞాన్ ప్రకాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 3న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించింది. ఇందులో రితిక సింగ్ మాట్లాడుతూ.. 'ఇది చాలా సీరియస్ అండ్ కంప్లీట్ రా ఫిల్మ్. ఈ సినిమా షూటింగ్ నాకో డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్. చివరి క్షణం వరకూ పోరాడే పాత్ర చేశాను. కొన్ని సీన్లు చేస్తున్నపుడు టీం అంతా ఏడ్చేసేవారు. మహిళలు అత్యాచారాలకు గురైన వార్తలు చూస్తుంటాం. ఇలాంటి దారుణమైన సంఘటనలకు ఎలాంటి పరిస్థితులు దారి తీస్తాయనేది ఇందులో చూపించాం. ఈ సినిమా షూటింగ్ పూర్తయిన వరకూ తల స్నానం చేయలేదు. ఈ మూవీ చివర్లో ఒక గొప్ప హోప్‌ని ఇస్తుంది.' అన్నారు.

ఐపిఎల్‌లో యువ క్రికెటర్లదే హవా!

- పృథ్వీ షాకు అగ్రస్థానం
- బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 4-0తో గెలుస్తాం
- బిసిసిఐ మాజీ అధ్యక్షులు సౌరవ్ గంగూలీ జోస్యం

కోల్‌కత్తా: వచ్చే నెలలో జరిగే ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లో యువ క్రికెటర్లు అద్భుతంగా రాణిస్తారని బిసిసిఐ మాజీ అధ్యక్షులు సౌరవ్ గంగూలీ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. టీవీ షో కార్యక్రమంలో మాట్లాడుతూ.. సీజన్-16 ఐపిఎల్‌లో పృథ్వీ షా అందరికంటే ఎక్కువ పరుగులు చేస్తాడని, ఆ తర్వాత రిషబ్ పంత్, గైక్వాడ్ రాణించడం ఖాయమని పేర్కొన్నాడు. అలాగే బౌలర్ల కోటాలో ఉమ్రాన్ మాలిక్ ఆకట్టుకొంటాడని జోస్యం చెప్పాడు. ఈ క్రమంలో శుభ్‌మన్ గిల్ పేరును ప్రస్తావించగా.. వీరి తర్వాతి స్థానంలో శుభ్‌మన్‌ది అని చెప్పుకొచ్చాడు. అలాగే కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా ఉన్న శ్రేయస్ అయ్యర్, ముంబయి ఇండియన్స్‌కు ఆడుతున్న ఇషాన్ కిషన్‌లను గంగూలీ పరిగణనలోకి తీసుకోలేదు. 'ఆటతీరు పరంగా సూర్యకుమార్ యాదవ్ అత్యుత్తమ ఆటగాడని, అతడ్ని యువ క్రికెటర్ల లెక్కలోకి తీసుకోలేమని అన్నాడు. యువ క్రికెటర్లంతా పాతికేళ్లలోపు వారేనని, పృథ్వీ షా, రుతురాజ్ గైక్వాడ్ ఎలా ఆడుతున్నారో తాను చూస్తూనే ఉన్నానన్నాడు. యువ పేసర్ ఉమ్రాన్ మాలిక్ కూడా తన జాబితాలో ఉన్నాడని, అతడు ఫిట్‌గా ఉంటే తన పేస్‌తో మ్యాచ్‌పై అభిమానులకు ఆసక్తి ఏర్పడేలా చేస్తాడు' అని గంగూలీ చెప్పుకొచ్చాడు. ఈ షోలోనే పాల్గొన్న భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్.. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ గురించి గంగూలీని అడగ్గా.. వెంటనే ఈ జాబితాలోకి అతడి పేరును చేర్చాడు. 'అవును సరిగ్గా ఆ పేరు (శుభ్‌మన్ గిల్) నా మనసులో మెదిలింది. అతడు నా ఐదో ఆటగాడు. పృథ్వీ షా, రిషబ్ పంత్, సూర్య కుమార్ బహుశా ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండొచ్చు. రుతురాజ్ గైక్వాడ్, ఉమ్రాన్ మాలిక్, శుభ్‌మాన్ గిల్ తర్వాతి స్థానాల్లో ఉంటారు' అని గంగూలీ పేర్కొన్నాడు. అలాగే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 4-0తో భారత్ గెలుస్తుందన్నాడు.

సఫారీలు మరో ఝులక్ ఇచ్చేనా..?

నేడు మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్

కేప్‌టౌన్: మహిళల టి20 ప్రపంచకప్ చరమాంకానికి చేరుకుంది. రెండు వారాలకు పైగా సాగిన మెగా టోర్నీలో ఆతిథ్య దక్షిణాఫ్రికా, 5సార్లు టైటిల్ విజేత ఆస్ట్రేలియా జట్లు ఫైనల్‌కు చేరకున్నాయి. ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్ పోటీల్లో ఆస్ట్రేలియా జట్టు ఐదు పరుగుల తేడాతో భారత్‌ను ఓడించగా.. దక్షిణాఫ్రికా జట్టు ఆరు పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచి ఫైనల్‌కు చేరా యి. దక్షిణాఫ్రికా మహిళలజట్టు టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకోవడం ఇదే తొలిసారి. దక్షిణాఫ్రికా యువ బౌలర్లు ఇస్మాయిల్, ఖాకా చెలరేగితే ఆస్ట్రేలియాపై గెలుపు సునాయాసమే. ఇలాగే ఓపెనర్లు వోల్వార్డ్ట్, బ్రిట్స్ అద్భుత ఫామ్‌లో ఉన్నారు.

ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ రేసులో రీచా

ఐసిసి టి20 మహిళల ప్రపంచకప్ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు రేసులో రీచా ఘోష్ నిలిచింది. ఐసిసి శనివారం ఐసిసి అవార్డు ఆటగాళ్ల జాబితాను విడుదల చేసింది. కీలక ఇన్నింగ్స్‌లతో తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది మంది క్రికెటర్లను షార్ట్ లిస్ట్ చేసింది. భారత జట్టు నుంచి వికెట్ కీపర్ రీచా ఘోష్ మాత్రమే ఈ లిస్టులో చోటు దక్కించుకుంది. ఫైనల్ చేరిన ఆసీస్ జట్టులో నుంచి ముగ్గురు, సఫారీ జట్టు నుంచి ఇద్దరు ఈ లిస్టులో ఉన్నారు. ఆస్ట్రేలియా జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన మేగ్ లానింగ్, అలిసా హేలీ, అష్ గార్డినర్‌లు ఈ లిస్టులో చోటు సంపాదించారు. ఇంగ్లండ్ (నాట్ సీవర్ బ్రంట్, సోఫీ ఎక్లెస్టోన్), దక్షిణాఫ్రికా జట్టు (లారా వొల్వార్డ్, తజ్మిన్ బ్రిట్స్) నుంచి ఇద్దరేసి చొప్పున ఈ జాబితాలో స్థానం పొందారు. వెస్టిండీస్ నుంచి హేలీ మథ్యూస్‌ను ఐసీసీ షార్ట్ లిస్ట్ చేసింది. ఈ తొమ్మిది మందిలో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచేది ఎవరో నేటితో తేలిపోనుంది.

పట్టు బిగిస్తోన్న ఇంగ్లండ్

న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో పర్యాటక ఇంగ్లండ్ జట్టు పట్టు బిగిస్తోంది. శనివారం ఇంగ్లండ్‌జట్టు తొలి ఇన్నింగ్స్‌ను 8వికెట్ల నష్టానికి 435పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ ఆరంభించగా.. రెండోరోజు ఆట నిలిచే సమయానికి 138పరుగులకే 7 వికెట్లను పడగొట్టి పై చెయ్యి సాధించింది. న్యూజిలాండ్ జట్టు ఓపెనర్ లాథమ్:(35), నికోలస్(30) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. రెండోరోజు ఆట నిలిచే సమయానికి బ్లండెల్(25), సౌథీ(23) క్రీజ్‌లో ఉండగా.. ఆండర్సన్, లీచ్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. న్యూజిలాండ్ జట్టు ఇంకా 297పరుగులు వెనుకబడి ఉంది. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ జట్టు ఇప్పటికే 1-0 ఆధిక్యతలో ఉంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68